1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 8
సంచిక : 3
పుటలు : 52
రు. 25 లు
ISSN NO: 2582-8738

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

మే 2022

యు.జీ.సీ. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in

తెలుగు వాడి అహింసా యుద్ధరీతిని, రామదండు నిబద్ధతను
బ్రిటీష్ దొరలకు రుచి చూపించిన ఆంధ్రరత్న మహోజ్వల ఉద్యమం




సహాయ నిరాకరణలో మేలి అడుగు

చీరాల - పేరాల ఉద్యమానికి వందేళ్ళు

జాతీయభాషల పట్ల తమ విధానాన్ని భాజపాయేతర పార్టీలు ప్రకటించాలి

బుద్ధ జయంతి (16మే) సందేశం



"దేనినైనా 'చాలకాలంగా వింటున్నది, సంప్రదాయంగా వస్తున్నది, పురాతన గ్రంథాల్లో చెప్పబడింది, మనకు తెలిసిన సిద్ధాంతానికి అనుగుణంగా ఉంది, లేదా మన గురువు చెప్పింది' అనే కారణంతో దానిని సత్యంగా స్వీకరించవద్దు"

"ఈ ధర్మాలు అకుశలమైనవి, ఇవి కుశలమైనవి; ఇవి వివేకవంతులు నిందించేవి, ఇవి వివేకవంతులు ప్రశంసించేవి; వీటిని స్వీకరించి ఆచరిస్తే హాని జరుగుతుంది, వీటిని స్వీకరించి ఆచరిస్తే మేలు జరుగుతుంది అని మీరు స్వయంగా తెలుసుకుని వేటిని నిరాకరించాలో, వేటిని స్వీకరించి ఆచరించాలో నిర్ణయించుకోండి."

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



మే 2022

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. హామీపత్రం తప్పనిసరి: **రచన సొంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపిండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం ఇబ్బంది అవుతుంది. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.

లోపలి పుటలలో....

కార్టూన్లు	రేఖాచిత్రాలు	ముఖచిత్రం	కంప్యూటర్
సరసి	చిదంబరేశ్వరరావు	వి.ప్రసాద్	బండారు రఘురాం

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిష్టర్డ్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.
సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు   మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000
4 సంll: రూ.1000, 1 సంll :రూ.300
ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

TELUGU JAATHI - AXIS BANK, TENALI
అక్కౌంట్ నెం. **914020020387880**
IFSC Code : UTIB0000556

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ QRకోడ్‌ను స్కాన్ చేసి లేదా QRకోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

94404 48244 లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

డాll సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ

ఇవీ సంగతులు...

దేశ జాతీయభాష హిందీ అంటూ అజయ్‌దేవ్‌గన్ వ్యాఖ్యలు: ట్విట్టర్ వేదికగా హిందీ చిత్రసీమ నటుడు అజయ్ దేవ్‌గన్‌కు కన్నడ నటుడు కిచ్చా సుదీప్‌కు మధ్య చిన్నపాటి మాటల యుద్ధం జరిగి కాసేపట్లోనే సద్దుమణిగింది. కానీ ఈ మాటల యుద్ధంలో అజయ్ దేవ్‌గన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు వాస్తవాలకు చాలా దూరంగా ఉన్నాయి. హిందీ భారతదేశ జాతీయభాష అని, హిందీలోకి డబ్ కాకపోతే దక్షిణాది భాషల చిత్రాలకు భారతదేశంలో ఆదరణ లేదని అన్నాడు. ఇంటర్నెట్ వాడుకర్లలో చాలా మంది అజయ్ దేవ్‌గన్‌కు హిందీ భారతదేశ జాతీయ భాష కాదంటూ అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. అజయ్ దేవ్‌గన్ మాతృభాష పంజాబీ అని, మాతృభాష పట్ల కనీస గౌరవం చూపమని చాలా మంది హితవు పలికారు.

తప్పనిసరి హిందీఅమలును వ్యతిరేకించిన మణిపూర్ విద్యార్థులు 2020 జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా మణిపూర్ ప్రభుత్వం పదవ తరగతి వరకు హిందీని ఒక విషయంగా చదవడాన్ని అందరు విద్యార్థులకు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలంటూ మణిపూర్‌లోని విద్యావేత్తల, మేధావుల సమాఖ్య కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థి సంఘాలను కలుపుకొని ప్రభుత్వానికి నివేదన సమర్పించింది.

అరుణాచల్‌ప్రదేశ్‌లోపాఠశాలల్లో ప్రవేశించనున్న మాతృభాషలు అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఎనిమిది తెగలకు సంబంధించిన విద్యార్థులు పాఠ్యప్రణాళికలో భాగంగా తమ మాతృభాషలను మూడవ భాషగా తొలిసారి చదవనున్నారు. ఆయా భాషల లిపులను క్రమబద్ధం చేసి, పాఠ్యపుస్తకాలను రూపొందించింది రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థ. ఈ విషయమై సంస్థకు ఆయా తెగల గురించి పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల సహాయం ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి తెలిపారు. మూడవ భాషగా తెగల భాషలను బోధించేందుకు సిబ్బందికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్టు ఆయన అన్నారు.

తమిళనాడులో త్రిభాషాసూత్రంఅమలుకాదు:విద్యాశాఖ కమిషనర్ ఇటీవలే కొన్ని మీడియా ఛానళ్ళలో తమిళనాడు బడులలో త్రిభాషా సూత్రం అమలవుతోందని వార్త వచ్చింది. ఈ వార్తను బిజెపి శ్రేణులు సోషల్ మీడియాలో విరివిగా పంచుకున్నాయి. అయితే ఈ వార్తలో నిజం లేదని. తమిళనాడులో కేవలం ద్విభాషా సూత్రమే అమలులో ఉందని అక్కడి విద్యాశాఖ కమిషనర్ మీడియా ప్రకటనలో తెలిపారు.

ఝార్ఖండ్‌లో తెగల విద్యార్థులకు మాతృభాషల్లో విద్య అందనుంది: 250 ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి వరకు– వచ్చే విద్యాసంవత్సరం నుండి తెగల విద్యార్థులకు వారి మాతృభాషల్లోనే చదువులు అందించాలని ఝార్ఖండ్ రాష్ట్ర విద్యాశాఖ సంకల్పించింది. 70% కన్నా ఎక్కువ విద్యార్థులు ఒకే తెగవారు ఉంటే, ఆ తెగకు సంబంధించిన భాషలో ఆ తరగతిలో చదువులుంటాయి. ముందారి, నాగ్‌పురీ పంచ్‌పర్గనియా, ఖడియా, కుడుఖ్, సంతాలీ, కుర్మాలీ, ఖోర్తా తెగల భాషలకు మొదటిప్రాధాన్యతగా వనరులు కల్పించనున్నారు. ఒకటవ తరగతిలో70% మాతృభాష,30% హిందీ,రెండవ తరగతిలో50% మాతృభాష, 50% హిందీ,మూడవ తరగతిలో30%మాతృభాషలో70% హిందీలోబోధన ఉండేలా ప్రణాళికలు,పాఠ్యసామగ్రి రూపొందుతున్నాయి.

డిగ్రీ విద్యలో తప్పనిసరి కన్నడ అమలును అడ్డుకున్న హైకోర్టు జాతీయ విద్యావిధానంలో మాతృభాషకు పెద్దపీట వేశారు అనుకుంటుండగానే, 'చదువుల్లో కన్నడ భాషను తప్పనిసరిగా ఎక్కడా చెప్పలేదని' కేంద్ర ప్రభుత్వం కర్నాటక హైకోర్టు ముందు సూచించింది. జాతీయ విద్యావిధానం ప్రకారమే కర్నాటక ప్రభుత్వం 2021-22 విద్యా సంవత్సరం నుండి ఒక తప్పనిసరి విషయంగా డిగ్రీ విద్యార్థులు కన్నడను అభ్యసించాలని కర్నాటక ప్రభుత్వ విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ 'సంస్కృత భారతి' హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు డివిజన్‌బెంచ్ ఈ పిటిషన్ విచారణ సందర్భంగా కేంద్రాన్ని జాతీయ విద్యావిధానంపై వివరణ కోరగా, కేంద్ర ప్రభుత్వం ఎక్కడా జాతీయ విద్యావిధానంలో తప్పనిసరి భాషా బోధన గురించి విధానాలు లేవని తెలిపింది.

తెలుగుభాష పరిరక్షణే తెలుగుసంస్కృతి పరిరక్షణ అని జస్టిస్ దుర్గాప్రసాదరావు గుంటూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో అన్నారు. తెలుగులో మాట్లాడేందుకు కొందరు సిగ్గు పడుతున్నారని. ఇది చాలా ఆవేదనకు గురి చేసే విషయమని ఆయన అన్నారు. ఇంగ్లిష్‌లో మాట్లాడడం అంటే తెలుగులో మాట్లాడడం మానివేయడం కాదు అని తెలుసుకోవాలని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇంజనీరింగ్ ఉద్యోగాల నియామకానికి తెలుగు అర్హత పరీక్షను తీసివేసి, ఆ స్థానంలో ఆంగ్ల అర్హత పరీక్షను ప్రవేశపెట్టింది. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ముందు ఒక పిటిషన్ వచ్చింది. విచారణ జరగవలసి ఉంది.

అమెరికాలోని టెక్సస్ రాష్ట్రంలో ఏప్రిల్ 2, 2022ను తెలుగుభాష మరియు వారసత్వ దినోత్సవంగా ప్రకటిస్తూ అక్కడి గవర్నర్ గ్రెగ్ అబట్ అధికార ఉత్తర్వులు జారీ చేశారు. టెక్సాస్ రాష్ట్రంలో విద్యా, వైద్య, వాణిజ్య, ప్రభుత్వ, కళా రంగాల్లో తెలుగువారు పోషిస్తున్న పాత్ర మరువలేనిదని ఆ అధికార ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగువారికున్న క్రమశిక్షణ, కుటుంబ విలువల పట్ల గౌరవం, వృత్తి పట్ల నిబద్ధత, విద్య పట్ల శ్రద్ధ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. టెక్సాస్‌లో తెలుగు భాష మాట్లాడేవారి సంఖ్య పెరుగుతున్నదని, వారు తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటూనే రాష్ట్ర అభివృద్ధికి మరింత కృషి చేయాలని అధికారిక ప్రకటనలో పిలుపునిచ్చారు.


సింగపూర్‌లో 44 సాంస్కృతికకార్యక్రమాలతో తమిళానికి ప్రచారం లవ్ తమిళ్, స్పీక్ తమిళ్ నినాదంతో సింగపూర్ ప్రభుత్వం తమిళ భాషను ప్రచారం చేస్తూ నెల రోజుల పాటూ 44 కార్యక్రమాల ద్వారా తమిళం మాతృభాషగా ఉన్న జనాభాను గౌరవించనుంది.

ఇకపై తెలంగాణలో కూడా ఆంగ్ల మాధ్యమంలోనే పాఠశాల చదువులు!

వచ్చే విద్యాసంవత్సరం నుంచి తెలంగాణలో 1 నుంచి 8 తరగతుల్లోని విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్యాబోధనను ప్రారంభించనున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శాసనసభలో వెల్లడించారు. 2023-24 విద్యాసంవత్సరంలో 9వ తరగతి, 2024 -25 విద్యా సంవత్సరం నుంచి 10వ తరగతిలో ఇంగ్లీష్ మీడియం విద్యాబోధనను ప్రారంభించనున్నామన్నారు. కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయాల మేరకు విద్యాశాఖకు ఆదేశాలిచ్చామన్నారు. ఇంగ్లీష్ మీడియాన్ని విప్లవాత్మక మార్పుగా సబితా ఇంద్రారెడ్డి అభివర్ణించారు. తాజా పరిస్థితుల్లో ఇంగ్లీష్ మీడియం, హోదాకు చిహ్నంగా మారిందని, ఈ మీడియంలో చదివితేనే ఉద్యోగాలొస్తాయన్న భావన సమాజంలో నెలకొన్నదన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని తల్లిదండ్రులు సైతం కడుపుకట్టుకుని తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియం చదువుల కోసం ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారని.. అందరి ఆకాంక్ష మేరకు ఇంగ్లీష్ మీడియాన్ని సర్కారు స్కూళ్లల్లో ప్రారంభిస్తున్నామన్నారు. ఇందుకోసం ద్విభాషా పుస్తకాలను సిద్ధంచేశామని, ఈ నెల 14వ తేదీ నుంచి టీచర్లకు శిక్షణనివ్వనున్నామన్నారు.



ఇంటర్మీడియట్‌లో ద్వితీయభాషగా సంస్కృతాన్ని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయం ప్రధాన ముఖద్వారం వద్ద 11-04-2022 నుండి మూడురోజుల పాటు విద్యార్థినేతలు, అధ్యాపకులు, నిరసనదీక్షను నిర్వహించిన దృశ్యం. తెలుగుపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 11 డిమాండులను కూడా వీరు ప్రభుత్వానికి అందచేశారు



సంపుటి : 8 సంచిక : 3
అమ్మనుడి
మే 2022

సంపాదక హృదయం

జాతీయభాషల పట్ల తమ విధానాన్ని భాజపాయేతర పార్టీలు ప్రకటించాలి

ఇప్పుడు మన దేశాన్ని పరిపాలిస్తున్న భారతీయ జనతాపార్టీ భాషావిధానం ఏమిటో స్పష్టం అయింది. నిజానికి ఆ పార్టీ పుట్టుక, ఎదుగుదల, సైద్ధాంతికత గురించి అధ్యయనం చేసిన వారికి, కనీసం నిశితంగా పరిశీలిస్తున్నవారికి ఆ పార్టీ ప్రభుత్వం ఏ లక్ష్యంతో పనిచేస్తున్నదో చక్కగా తెలుస్తుంది. అందులో ఆ పార్టీగానీ వారి ప్రభుత్వంగాని, ఆ నాయకులు గాని దాచిపెట్టిందేమీలేదు. కుట్ర అనడానికి వీలులేదు. ఎందుకంటే అది వారి ప్రకటిత సైద్ధాంతికతకు అనుగుణంగానే ఉంది. తమ భాషావిధానాన్ని అమలుపరచే అవకాశాలను వారు వదులుకోరు.

కొత్త జాతీయ విద్యావిధానాన్ని కొంత ఆలస్యంగానైనా బయటకు తెచ్చి, దానిని అమలులోకి తెచ్చేందుకు పట్టుదలగా వారి ప్రభుత్వం కృషిచేస్తున్నది. కొత్త జాతీయ విద్యావిధానం ప్రకారం మాతృభాషలో ప్రాథమిక విద్యను బోధించడం చాలా మంచిపని. అయితే అది తప్పనిసరికాదు. ఈ సంగతిని ఇంకా అర్థం చేసుకోలేని మేధావులు– కర్నాటక హైకోర్టుకు కేంద్రం పంపిన వివరణను తెలుసుకోవాలి.

ఇప్పుడు ఏప్రిల్ 8న ఒక అధికారిక సమావేశంలో భారత హోంమంత్రి అమిత్‌షా మాట్లాడుతూ చాలా స్పష్టంగా చెప్పారు. 'దేశ సమైక్యత సాధనలో అధికారభాష కీలక పాత్ర పోషించేందుకు సమయం ఆసన్నమైంది' అన్నారాయన. ఒక రాష్ట్రానికి చెందిన వారు మరోరాష్ట్రానికి చెందిన వ్యక్తితో మాట్లాడవలసి వస్తే అది భారతీయ భాషై'ఉండాలి'. ఆ భాష హిందీయే అని కూడా ఆయన చెప్పారు. 'ఇంగ్లీషుకు ప్రత్యామ్నాయభాషగా హిందీని ఆమోదించాల'ని ఆయన ఉద్ఘాటించారు. అమిత్‌షా దేశ హోంమంత్రి మాత్రమేకాదు. ప్రధాని మోడీగారి ఆత్మ. ఇద్దరి భావజాలమూ ఒకటే. ఎవరు ఎక్కడ ఏ పాత్రపోషించాలో దానికి తగ్గ విధంగా మాట్లాడతారని అందరికీ తెలిసిన సంగతే. భాజపా విధానాన్నే వారు అమలు చేస్తున్నారన్న వాస్తవాన్ని విస్మరించకూడదు.

హిందీ మాత్రమే కాదు, రాజ్యాంగంలో గుర్తించిన 22 భాషలూ జాతీయ భాషలే అనే ఆచరణ సాధ్యమైన, ప్రజాస్వామిక, మానవీయ, దేశభక్తియుత, సమైక్యతాశీల దృక్పథాన్ని కాదని, హిందీయే జాతీయ ప్రత్యామ్నాయం, హిందీయే మన జాతీయభాష అని అమిత్‌షా ప్రకటిస్తున్నారు. కేంద్రప్రభుత్వ లక్ష్యం ఇదే అని మనం తెలుసుకోవాలి. నిజానికి స్వాతంత్ర్య సమరంలోనూ, స్వతంత్రం తర్వాతా కాంగ్రెస్సూ, ఉత్తరభారత నాయకుల నేతృత్వంలోని పార్టీలూ అందరి అభిమతమూ అదే. కాకపోతే వారు పాము చావకుండా, కర్ర విరగకుండా లౌక్యంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఇప్పుడు పాలిస్తున్న భాజపా– త్వరత్వరగా 'జాతీయ సమైక్యత'ను సాధించాలనీ అందుకు జాతీయ భాషగా హిందీ ఉండాలనే తమ 'అజెండా'ను బలంగా ముందుకు తెస్తున్నారు.

రాజ్యాంగంలోని 22భాషలనూ, ఆ మాటకొస్తే ఇంకాముమ్ముందు ఎనిమిదో షెడ్యూలులో చేరబోయే భాషలనూ జాతీయ భాషలుగా గుర్తించాలనే న్యాయమైన 'డిమాండు' చాలాకాలంగా ఉన్నది. తమిళనాడు రాజకీయ పార్టీలు యీ అంశాన్ని కేంద్రం ముందు బలంగా ప్రతిపాదించాయి కూడా. 2014 ఎన్నికల్లో కేంద్రంలో పాలన భాజపా చేతుల్లోకి పోవడంతో అంతా తిరగబడింది.

బలమైన జాతీయవాద పార్టీ అధికారంలోకి రావడంతో ఇన్నేళ్లుగా లౌకికవాద పార్టీల అసమర్థ విధానాల వల్ల దేశ సమైక్యతకు, రక్షణకు ఏర్పడిన తీవ్రమైన సమస్యలు పరిష్కారం అయ్యేందుకు ఇకనైనా వీలు కలిగిందని సంతోషపడ్డవారికి ప్రజల మాతృభాషల విషయంలో భాజపా ప్రభుత్వ తీరు చూసి ఎంతో మనోవేదన కలుగుతున్నది. దేశ రక్షణ, హిందూత్వ వంటి విషయాల్లో భాజపాను సమర్థించే హిందీయేతర ప్రజల్లోకూడా ఈ విషయంపై ఆ పార్టీపట్ల వ్యతిరేకత పెరుగుతున్నది.

రాజ్యాంగ నిర్మాణ సభలో ఈ అంశం పై తీవ్రంగా చర్చించి, 15 ఏళ్ల వరకు పరిష్కారాన్ని వాయిదావేస్తూ,

సంపాదక హృదయం

కొన్ని ఉపశమన చర్యలు తీసుకున్నారు. 75 ఏళ్లు గడిచిపోయి, ఇప్పుడు ఈ సమస్య కొరకరాని కొయ్యగా తయారైంది. ఈలోపు విదేశీ వలసభాష పెనుభూతమై అన్ని రంగాల్లో దేశమంతటా బలంగా విస్తరించింది. హిందీ అనే దేశీయ వలస భాషకూడా కీలకస్థానాల్లోకి జొరబడి, దేశీయ మాతృభాషలపై పెత్తనం చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడీ దేశీయ వలసభాష దేశభక్తి, సమైక్యత, హిందూత్వ అనే సవాళ్లను ప్రజలపైకి విసురుతున్నది. అధికార భాజపా ఇందుకు నేతృత్వం వహిస్తున్నది ఈ విధానంతో దేశసమైక్యతను సాధించవచ్చునని భాజపా నిర్ణయించుకొంది. ఇందుకు సమయం వచ్చిందని కూడా ఆ పార్టీ నిర్ణయించుకొంది. 'సమైక్యతా సాధనకు అధికార భాష కీలక పాత్ర పోషిస్తుందన్న' మాట నిజమేకాని, యీ దేశంలో హిందీ మాత్రమే అధికారభాషకాదు; రాజ్యాంగం గుర్తించిన, 22 భాషలూ అధికారభాషలే అన్న వాస్తవాన్ని ముందు గుర్తించాలి. రాజ్యాంగం పరోక్షంగా చెప్పింది అదే. ఇప్పుడు హిందీనే జాతీయ అధికార భాష అని రాజ్యాంగ సవరణ చేయగలరా? ఆ ప్రతిపాదనతో అధికారపార్టీ ముందుకు వస్తే 'దేశ సమైక్యత' సాధించాలనే భాజపా లక్ష్యాన్నే అది దెబ్బతీసినట్లు అవుతుంది. దేశ అనైక్యతకు, విచ్ఛిన్నానికి దారితేసేంత తెలివి తక్కువ చర్యకు భాజపా దిగజారుతుందని అనుకోలేం.

ఏది ఏమైనా, ఇప్పుడీ అంశంపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి. దీన్ని ఇక్కడితో విడిచిపెట్టకూడదు. ఇరువైరెండేళ్లుగా మాతృభాషల రక్షణకోసం ప్రపంచమొత్తం మీద చైతన్యం తేవడానికి ఉద్యమ చైతన్యం మెల్లగా విస్తరిస్తున్నది. మానవ జాతి అంటేనే భాషాజాతుల ప్రపంచం. 'జాతి' అనే మాట సాపేక్షికంగా పలు విధాలుగా వాడబడుతున్నప్పటికీ అది భాషాజాతి అనే స్పష్టమైన అర్థంలోనే అంతటా గుర్తించబడుతున్నది. వేల సంఖ్యలో ఉన్న యీ భాషాజాతులు నశించడమంటే ఆ భాషలతో పాటు వారు వారసత్వంగా సంపాదించుకొన్న విజ్ఞానాన్ని, సంస్కృతినీ కోల్పోవడమన్నమాట. ఈ విధ్వంసం ప్రపంచంలో ఎక్కడ జరిగినా దాన్ని ఎదుర్కొనవలసిందే. ఐక్యరాజ్యసమితి(యునెస్కో) యీ విషయాన్ని ఇప్పుడు విస్తృతంగా చర్చలోకి తెచ్చింది. ఇప్పుడు భారతదేశంలో మాతృభాషలు ఎదుర్కొంటున్న సమస్యలు చిన్నవేమీకావు. మన ప్రజల్ని మేల్కొల్పడంతో పాటు, యీ అంశంపై అన్ని వేదికలపై చర్చ జరిగేట్లు చూడాలి.

ఇప్పుడు భారతదేశం మొత్తానికి జాతీయభాషగా హిందీని రుద్దబోయే ప్రయత్నం తక్కిన మాతృభాషలకు గొడ్డలిపెట్టు అవుతుంది. ఇప్పటికే ఆంగ్లభాష పెత్తనానికి ప్రభుత్వాలూ, ఆధిపత్య వర్గాలూ లొంగిపోయిన పరిస్థితుల్లో, జాతీయ భాష పేరుతో హిందీ కూడా ఒక బలమైన జాతీయ ఆధిపత్య వర్గంగా రూపుదిద్దుకొంటే ఇక జరగబోయేది దేశీయ మాతృభాషల అణచివేతే.

ఇప్పుడు ప్రజల మేలుకోరే వారంతా ఉద్యమించాలి. ముందుగా– స్తబ్దుగా ఉన్న మన భాజపాయేతర రాజకీయ పార్టీలకు 5 ప్రశ్నల్ని సంధించడంతో మన పని మొదలుపెడదాం.

1. రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో గుర్తించిన 22 భాషల్నీ జాతీయ భాషలుగా గుర్తించాలన్న ప్రతిపాదనను మీరు ఒప్పుకుంటారా?

2. చట్టసభల్లో, పాలనలో మాతృభాషల వినియోగంపై మీ పార్టీ విధానం ఏమిటి?

3. విద్యాబోధనలో మాతృభాషల వినియోగంపై మీ పార్టీ విధానం ఏమిటి?

4. చట్టసభల్లో, పాలనలో, విద్యారంగంలో ఇంగ్లీష్ వినియోగానికి పరిమితుల విషయంలో మీ విధానం ఏమిటి?

5. ఇంగ్లీష్‌కు హిందీయే ప్రత్యామ్నాయమన్న హోంమంత్రి అమిత్‌షా అభిప్రాయాన్ని మీ పార్టీ సమర్థిస్తుందా?

వెంటనే మన రాజకీయ పక్షాలు ఈ ప్రశ్నలకు తమ సమాధానాలతో ముందుకు రావాలని ఆశిస్తున్నాం. ఈ విషయంపై ఆసక్తి ఉన్న సంఘాలు, వ్యక్తులు ఎవరికి వారే పూనుకోండి. మీకు తోచినట్లు చేతనైనట్లు ఉద్యమించండి.

కేవలం భాజపాను విమర్శించడంతో సరిపెట్టుకోవద్దనీ, తక్కిన పార్టీల అభిప్రాయాలేమిటో ప్రకటించాలి అని కోరుతున్నాం.

సామల రమేష్ బాబు

తేదీ : 29-04-2022

నందివెలుగు ముక్తేశ్వరరావు
9491428078

మేలైన ఆలోచనా విధానానికై అమ్మనుడిలో చదువులే మూలాధారం

మన పిల్లలకు ఇప్పటికీ పాఠం గుర్తు పెట్టుకోవడం, తిరిగి కక్కేయడం, అన్నో ఇన్నో మార్కులు సంపాదించడం లాంటి పాత విద్యావిధానం కావాలా? ఆలోచన, అవగాహన, ప్రశ్నించడం, సృజించడం లాంటి నవతరం శక్తి సామర్థ్యాలు కావాలా? ఇది కావాలంటే తల్లి కడుపులో పడిననాటి నుంచి మనతో కలిసి నడుస్తున్న భాషను– మాతృభాషను– వదులుకో రాదన్నది శాస్త్రీయ, హేతుబద్ధ సూచన.

ఈరోజుల్లో ఒకళ్ళు ఇంకొకళ్ళను గుడ్డిగా అనుకరించడం సర్వ సాధారణం అయిపోయింది. సామాన్య మానవులు ఇతరులను అనుకరించడం వల్ల వచ్చే నష్టం వ్యక్తిగతం, పరిమితం. అదే విధంగా పాలకులు గుడ్డిగా అనుకరిస్తే అందువల్ల వచ్చే నష్టాలను సమాజం మొత్తం అనుభవించాల్సి వస్తుంది. ఇవి అపరిమితంగా, దీర్ఘకాలికంగా ఉండి సమాజ పురోగతిని వెనక్కు లాగుతాయి.

ఒకప్పుడు ఎన్నికలలో గెలవడానికి ఎవరి వ్యూహాలు వారికి ఉండేవి. అప్పుడు నాయకులు ప్రజలతో మమేకం అయి ఉండేవారు. కార్యకర్తలతో సంభాషిస్తూ ఉండేవారు. అందువల్ల ఎన్నికలలో విజయం సాధించడానికి వారి వ్యూహాలు వారికి ఉండేవి. అవి సత్ఫలితాలను ఇచ్చేవి కూడా!

ఈరోజుల్లో పరిస్థితులు మారిపోయాయి. ప్రభుత్వ నిర్వహణ చేపట్టిన రాజకీయ పార్టీలకి ముందుచూపు, దిశానిర్దేశం, వ్యూహ చతురత వంటి లక్షణాలు లోపించాయి. అందువల్ల ఎన్నికలలో గెలవాలంటే ఏ వ్యూహాన్ని అనుసరించాలి అన్న దానికి కూడా ఇతరులను ఆశ్రయిస్తున్నారు. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని కేవలం ఎన్నికలలో గెలవడం ఎలా, అధికారాన్ని కైవసం చేసుకోవడం ఎలా అన్న విషయంలో సలహాలు చెప్పే వ్యూహచతురులు బయల్దేరారు. వీరికి ప్రజల శ్రేయస్సు, ప్రజాబాహుళ్యానికి జరిగే మేలు ఇవన్నీ అనవసరం. అందరికీ నచ్చే విషయాన్ని రాజకీయ పార్టీలకి చెప్పడమే వీరి ధ్యేయం!

ఆ రకంగా ప్రజలందరికీ నచ్చినవని అనుకొంటున్న విషయాలలో ఒకటి దేవతావస్త్రం లాంటి ఆంగ్ల మాధ్యమంలో విద్య. ఇది ఆంధ్రప్రదేశ్‌లో గతంలోనే ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం కూడా ఇదే విషయాన్ని నెత్తికి ఎత్తుకుంది. ఇది నిజంగా ప్రజల మీద, రాబోయే తరం మీద ప్రేమతో చేస్తున్నారా! ప్రజలందరినీ ఆకర్షించే లక్షణం దీనికి ఉంది అని నమ్మి దీనిని ఎజెండాలో చేర్చారా అన్నది ఆత్మావలోకనం చేసుకుంటే తప్ప అర్థమయ్యే విషయం కాదు! ఎలక్షనీరింగ్ అనే ఈ మాయలో పడిన వారిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలే కాదు.. ఢిల్లీ, బెంగాల్ రాష్ట్రాలు కూడా ఇదే దారిలో నడుస్తున్నాయి.

ఈ వ్యూహకర్తలలో అగ్రగామి అయిన ఓ పెద్దమనిషి అన్ని రాష్ట్రాలకు పనికొచ్చే కొన్ని ఫార్ములాలు తయారుచేసుకుని సిద్ధంగా దగ్గర ఉంచుకుంటాడు. చాలా తెలివిగా ఏ రాష్ట్ర నాయకులకైనా ఇదే ఫార్ములా అమ్ముకుంటాడు. అటువంటి వాటిలో 'ఆంగ్ల మాధ్యమంలో విద్య' అనేది ఒక గొప్ప ఆకర్షణీయమైన ఫార్ములా!

నూటనలబై కోట్ల మంది ప్రజల మనోభీష్టాలకు దర్పణం పట్టవలసిన వ్యవస్థలు కేవలం నలుగురైదుగురు రాజకీయ వ్యూహకర్తల పేరుతో వస్తున్న వ్యక్తుల గుప్పిటలోకి వెళ్లడం బాధాకరం, విచారకరం. ఇది ప్రజాస్వామ్యాన్నీ, రాజ్యాంగాన్నీ అపహాస్యం చెయ్యడమే!

ప్రభుత్వం.. విద్యా వ్యవస్థ

భారతదేశంలో ప్రభుత్వానికీ విద్యావ్యవస్థకీ ఉన్న అవినాభావ సంబంధం సున్నితంగా అర్థం చేసుకోవాల్సిన విషయం. భారతదేశం లాంటి ...ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రభుత్వం విద్య పట్ల ప్రత్యేక దృష్టిని సారించవలసిన బాధ్యత ఉంది. వ్యవస్థీకృత విద్యావిధానాన్ని అందించవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, శిక్షణ తరగతులు, పరీక్షలు, మూల్యాంకనం మొదలైన విషయాలు నిర్దిష్టంగా, నిర్దుష్టంగా ఉండేలా చూసుకోవాల్సిందే! ఎందుకంటే విద్య మనకు రాజ్యాంగబద్ధమైన హక్కు! అందువల్ల దీని బాధ్యత ప్రభుత్వాల మీదే ఉంది.

ప్రభుత్వాలు బడులను భౌతికంగా దగ్గర చేయడం తప్ప కాలానుగుణంగా మారవలసిన పాఠ్యప్రణాళికల విషయంలో గాని, ఎటువంటి విద్యను అందిస్తే రేపటి తరం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుంది అన్న విషయంలో దార్శనికతను ప్రదర్శించడంలో గాని చెప్పుకోదగ్గ విజయాలు సాధించింది అని చెప్పలేం!

విద్య ఏం చేస్తుంది? ఏం చేయాలి

విద్య సమాజంలో మౌలికమైన పరివర్తన తీసుకొనివస్తుంది. అలా తీసుకొని రాగలిగినదే నిజమైన విద్య. ప్రజల ఆలోచనా విధానంలో, పరిసరాలు పర్యావరణం మొదలైన విషయాల్లో మేలైన ఆలోచనా దృక్పథాన్ని కలిగించ గలిగినది నిజమైన విద్య! మన విద్య ఎంతవరకు అటువంటి నాణ్యతను సమాజంలో తీసుకొని రాగలుగుతున్నది?

విద్యను అభివృద్ధి హెచ్చుదల కారకం ('డెవలప్మెంట్ మల్టీప్లయర్') అంటారు. భిన్న రంగాలలో ఒకేసారి మెరుగుదలను తీసుకుని రావడం విద్య వల్ల మాత్రమే సాధ్యం. ఉదాహరణకు శిశువు జననం, శిశు మరణాలు, పౌష్టికాహారం, రోగనిరోధక శక్తి మొదలైన

విషయాల్లో ప్రజల్లో గతంలో ఉన్న అవగాహన కన్నా ఇప్పుడున్న అవగాహన ఎక్కువ. ఇది విద్య వల్ల మాత్రమే సాధ్యమైన విషయం. అందువల్ల విద్యాలక్ష్యం ఏమిటంటే విద్యార్థులలో నైపుణ్యాలు పెంచటమే.

అసలు సమస్య ఏమిటి

విద్యారంగాల్లో ఎక్కడ చూపు పెట్టాలో అక్కడ పెట్టకుండా ఏవేవో చేసుకుంటూ పోవడమే ఇప్పుడున్న అసలు సమస్య. అసర్ అనే ఒక సంస్థ గత కొన్ని ఏళ్లుగా విద్యారంగ తీరుతెన్నులపై వరుసగా వార్షిక నివేదికలు ఇస్తూ వస్తోంది. వాటిలో తేలిన విషయం ఏమిటంటే: **దేశవ్యాప్తంగా విద్యార్థులకు కనీస నైపుణ్యాలు లేకుండా పోతున్నాయి; అంటే పిల్లలు రాయలేకపోతున్నారు; చదవలేక పోతున్నారు; అర్థం చేసుకోలేకపోతున్నారు; చిన్న చిన్న లెక్కలు చేయలేకపోతున్నారు. దీర్ఘకాలంపాటు బడులలో చదివి కనీస ప్రమాణాలు ఎందుకు సాధించలేకపోతున్నారు? అన్న విషయం మీద ప్రభుత్వాలు దృష్టి పెట్టడంలేదు. కనీసం ఈ నివేదికలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీన్ని ఒక సవాలుగా స్వీకరించి ఆయా రాష్ట్రాల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరుచుకుందాం అన్న ధోరణి ఎక్కడా కనిపించడం లేదు.**

ఇవన్నీ పక్కనబెట్టి ఆంగ్ల మాధ్యమం అన్న ఒక్క అంశాన్ని తెరమీదకు తీసుకుని వస్తున్నారు. సమాజంలో ఉన్న అన్ని రకాల సమస్యలకు ఇదొక్కటే సర్వరోగ నివారిణి అన్నట్లుగా ఆలోచిస్తున్నారు. **ఆంగ్ల మాధ్యమం నిజంగా అన్ని సమస్యల్ని పరిష్కరించగలదా అన్న విషయంలో మేధావులకు, విద్యారంగ నిపుణులకు రెండవ అభిప్రాయం ఏమీ లేదు! వారందరూ నిర్ద్వంద్వంగా చెప్పే విషయం ఒక్కటే. ఆంగ్ల మాధ్యమం పరిధి చాలా పరిమితం. ఆ పరిమితిని దాటి దాన్ని నెత్తికి ఎత్తుకుంటే అది చేసే నష్టం కూడా అపారం! ఈ విషయాన్ని విద్యావేత్తలు అందరూ ముక్తకంఠంతో చెబుతున్నారు.**

కానీ స్వార్థ ప్రయోజనాలతో విషయాన్ని మసిబూసి మారేడుకాయ చేసి తల్లిదండ్రుల అభిప్రాయాలకు విలువ ఇస్తున్నామంటూ ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం ఒక తరం ఆలోచనా విధానానికి, ఆనందంగా నేర్చుకునే పద్ధతికి అడ్డు కొట్టడమే! ఇది ఎంత ప్రమాదకరం! ఎంత అప్రజాస్వామికం!

ఆత్మపరిశీలన వద్దా!

సుమారు 15 సంవత్సరాల క్రితం ఉన్నపళంగా ఇంగ్లీష్ మీడియంను బడులలో ప్రవేశపెట్టేశారు. వాటిని సక్సెస్ పాఠశాలలు అన్నారు. కనీసం హీనపక్షం ఇప్పటికి పది బ్యాచ్‌ల విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం విద్యను పూర్తిచేసుకుని బయటకు వెళ్లారు. ఈ సక్సెస్ పాఠశాలలలో ఇంగ్లీష్ మీడియం ఎలా నడిచింది? పిల్లలకు అవగాహన, వ్యక్తీకరణ సామర్థ్యాలు ఏమైనా పెరిగాయా? ఉపాధ్యాయులలో బోధన వనరులు గాని, సామర్థ్యాలు గాని, నైపుణ్యాలు గాని పెరిగాయా? పిల్లల్లో ఆలోచనా సామర్థ్యం పెరిగిందా? నేర్చుకుంటున్న సబ్జెక్టు మీద ఆసక్తి, అభిరుచి పెరిగాయా? స్పష్టంగా కొట్టొచ్చినట్టు కనబడే ఫలితాలు ఏమైనా దొరికాయా? వీటి మీద గర్వపడదగిన అధ్యయన బృందాలు, పరిశీలన బృందాలు తిరిగి ఏమైనా నివేదికలు ఇచ్చాయా? ఏమైనా విద్యా ప్రమాణాలు పెరిగాయా? పాలనా యంత్రాంగం దగ్గర వీటిమీద చెప్పుకోదగ్గ, ప్రకటించుకోదగిన ఒక్క 'నివేదిక' కూడా లేదు. వాస్తవానికి ఇది బ్రహ్మాండమయిన వైఫల్యంగా ఎన్సీఈఆర్టీ, ఏ ఎస్ సి ఆర్ తేగేసి చెప్పాయి. లోపాలను ఎత్తి చూపించాయి. **కొన్ని పక్షులు వెలుతురు చూడలేవు. వాటి పుట్టుకే అంత! మన పాలనా యంత్రాంగాలు కూడా అలాగే ప్రవర్తిస్తాయి. రాజుగారి లేని వస్త్రాలను కొనియాడకపోతే మన సమస్యలు మనవి. ఇప్పటికీ మొండిగా వాదించే వాళ్ళు ఉంటే వాళ్లకి ఈ ప్రశ్నలు సరిపోతాయి.**

1. మనం ప్రభుత్వ బడులలో ఇంగ్లీష్ మీడియం పెట్టినా బోలెడంత ఊదర గొట్టినా ప్రైవేటు కార్పొరేటు పాఠశాలలలో అప్పులో సొప్పులో చేసి పిల్లలను తల్లిదండ్రులు ఆ బడులలో కొనసాగిస్తున్నారు ఎందుకు?

2. మండల స్థాయి నుంచి, డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులు ఎవరూ (ఆఖరికి విద్యాశాఖ అధికారులు కూడా) మన ఇంగ్లీష్ మీడియం పాఠశాలలలో ఎందుకు చేర్చడం లేదు?

3. గత పది పదిహేను ఏళ్లలో ఇంగ్లీష్ మీడియం జవాబు పత్రాలను కొన్నింటిని *రాండం శాంప్లింగ్‌*లో తీసుకొని *కంటెంట్* మరియు *ప్రజెంటేషన్* ఎంత దారుణంగా ఉన్నాయో ఎవరైనా పరిశీలించవచ్చు. ఇది సంబంధిత వర్గాలు బహిరంగంగానే చూడవచ్చు.

అయినా – పిచ్చి కుదిరింది రోకలి తలకు చుట్టమంటున్నట్లు ప్రతి ప్రభుత్వ అధినేత నేను ఇంగ్లీష్ మీడియంనే పెడతాను.. ఉద్ధరిస్తాను అనే మాట్లాడతాడు. దీనికి ఒకే ఒక్క కారణం విద్యావేత్తలలో వైజ్ఞానిక నిష్ఠ (ఎకడమిక్ ఇంటిగ్రిటీ) లేకపోవడం!

మీ తెలుగు వాళ్ళు మాట్లాడేది ఒకటి– రాసేటప్పుడు వేరేగా రాస్తారు ఎందుకు? అని అన్న స్కూల్ ఇన్స్పెక్టర్ మాటలో సత్యాన్ని అర్థం చేసుకునేందుకు, అర్థమైన దానిని లోకానికి అందించడానికి జీవితాన్ని ధారపోసిన గిడుగు రామ్మూర్తి లాంటి అధ్యాపకులు పుట్టిన గడ్డ మీద మనమూ పుట్టాం! ఆయనకు వారసులుగా సత్యాన్వేషణ కోసం గొంతు విప్పలేకపోతున్నాం!

ఆత్మవంచన వద్దు

ప్రజలు కోరుకుంటేనే ఇస్తున్నాము అంటున్న ప్రభుత్వాలు నిజంగా ప్రజలు కోరుకుంటున్నవి అన్నీ ఇస్తున్నారా? ప్రజలు ముఖ్యంగా మహిళలు మద్యనిషేధం కోరుకున్నారు. దాన్ని అమలు చేయగలిగారా? ప్రజలు మౌలిక వసతులైన మంచినీరు, మెరుగైన వైద్యం, రక్షణ, సమాన అవకాశాలు మొదలైనవి కోరుకుంటున్నారు. ఇటువంటివి కల్పించగలుగుతున్నారా?

ఇవేవీ లేకుండా ఆంగ్ల మాధ్యమం మీద ప్రేమ ఒలక పోయడం నిజంగా ప్రజల మీద ప్రేమతోనా? వారి వారి స్వార్థ ప్రయోజనాల కోసమా! పాలకులారా ఆత్మవిమర్శ చేసుకోండి!!

వాస్తవం ఇదీ!

2020 నుంచి నూతన జాతీయ విద్యావిధానం అమలులోకి

తరువాయి 18వ పుటలో....

డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్
93948 10088

తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి " ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్"కల్పిస్తే తెలుగు మాధ్యమంలో చేరేవారి సంఖ్య పెరుగుతుందా ??

ఒక మిత్రుడు అడిగిన పై ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు:

'భాషాభిమానానికి , ప్రాంతీయాభిమానానికి తమిళనాడు' పెట్టింది పేరు. అటువంటి తమిళనాడులో 2010వ సంవత్సరంలో, అక్కడి రాష్ట్ర ప్రభుత్వం తమిళ మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 20 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసింది. (PSMT చట్టం -2010).

ఒక విధానం (లేదా) ఒక చట్టం యొక్క ప్రభావం , ఫలితాలు, పర్యవసానాలు తెలియటానికి కొంతకాలం పడుతుంది. తమిళనాడు లోని తమిళ మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 20% రిజర్వేషన్ కల్పిస్తూ చేసిన చట్టం (PSTM యాక్ట్ 2010) 11 సంవత్సరాలుగా అక్కడ అమలు జరుగుతున్నది.

2010 లో ఇంగ్లీష్ మీడియంలో చదివే పాఠశాల విద్యార్థుల శాతం 33.28% గా ఉండగా, PSTM చట్టం 11 ఏళ్ల అమలు తర్వాత ... (2021 లో) ఇంగ్లీష్ మీడియం లో చదువుతున్న పాఠశాల విద్యార్థుల శాతం 61.88% కు పెరిగింది. (గణాంకాల పట్టిక ఫోటో జత చేశాను).

భాషాభిమానం, ప్రాంతీయాభిమానం మెండుగా ఉన్న తమిళనాడులో ఎటువంటి ప్రభావం చూపని ఈ " మాధ్యమం ఆధారిత రిజర్వేషన్ విధానం" తెలుగు రాష్ట్రాలలో ప్రభావం చూపుతుందా అని మీరే విజ్ఞతతో ఆలోచించండి! **విన్నపం:** వాస్తవాల ఆధారంగా అభిప్రాయాలు ఏర్పరచుకుంటే, సమాజంలో సరైన దిశగా , సరైన సమయంలో మార్పులు సాధ్యమవుతాయి.

సరైన సమాధానాలు రావాలంటే సరైన ప్రశ్నలు వేసుకోవాలి

'తెలుగు రాష్ట్రాలలో ఇంగ్లీష్ మీడియం విస్తరించడానికి గల కారణం ...." సర్వీస్ రంగంలో ఉద్యోగాలు ఎక్కువగా రావటం వలన, తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియంలో చేర్పించడానికి ఇష్టపడుతున్నారు ?? అనేది ఒక వాదన .

ఈ వాదనలోని నిజానిజాలు నిగ్గు తేల్చడానికి "ఆంధ్రప్రదేశ్ , తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలోని 1987 నుండి 2020 వరకు 10 వ తరగతి (మార్చి - ఏప్రిల్ నెల లో జరిగే) పబ్లిక్ పరీక్షల్లో పాస్ అయిన వారి శాతాన్ని , ఇంగ్లీష్ మీడియం లో చేరిన విద్యార్థుల శాతాన్ని పట్టికగా వేశాను.

ప్రశ్న -1 :-. సర్వీస్ రంగం (సాఫ్ట్వేర్ రంగం) విస్తృతమయ్యి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా రావటం వలన దక్షిణాది రాష్ట్రాలలో పాఠశాల దశలో ఇంగ్లీష్ మీడియంలో చేరే వారి సంఖ్య పెరిగింది ??? పై ప్రశ్న నిజమేనా ??

జవాబు :- భారత దేశంలో సర్వీస్ రంగం బాగా ఎక్కువగా అభివృద్ధి చెందింది 'బెంగుళూరు' .... కర్నాటక లో. సర్వీస్ రంగం వలన, ఇంగ్లీష్ మీడియం లో చేరడం పెరిగితే " దక్షిణాదిన కర్ణాటక లోని పాఠశాల దశలో ఇంగ్లీష్ మీడియం చదివే వారి శాతం అత్యధికంగా ఉండాలి! కానీ వాస్తవానికి అది దక్షిణాదిన అత్యల్పంగా ఉంది (2020 గణాంకాల ప్రకారం కర్ణాటకలో పాఠశాల విద్యార్థులలో ఇంగ్లీష్ మీడియం లో చదివేవారు 30% మంది మాత్రమే). నిజానికి తమిళనాడు , ఆంధ్ర - తెలంగాణ , కేరళ లలో 55% నుండి 65% వరకు పాఠశాల విద్య ఇంగ్లీష్ మీడియంలో జరుగుతుంది.

ప్రశ్న - 2 : తెలుగు వారికి భాషాభిమానం లేదు . అందుకే ఇంగ్లీష్ మీడియంలో చేరుతున్నారు ?

జవాబు :- ఇదే అసలు కారణం అనుకుంటే ... తమిళనాడు, కేరళలలో ఇంగ్లీష్ మీడియం మన తెలుగు రాష్ట్రాల కన్నా తక్కువ ఉండాలి... కానీ వాస్తవానికి అలాలేదు. (పట్టిక చూడండి)

ప్రశ్న - 3 :- ఇంగ్లీష్ మీడియం పెరగటానికి ముఖ్యకారణం ఏమిటి?

జవాబు :- పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో " మాస్ కాపీయింగ్ ద్వారా అత్యధిక శాతం విద్యార్థులు పాస్ అవ్వటం మరియు ఒట్టిగా పాస్ అవ్వటం మాత్రమే కాకుండా ... జవాబు పత్రాలు దిద్దేటప్పుడు, ఉపాధ్యాయులు inflation of marks/ grades ద్వారా 'అత్యధిక మార్కులు వేయటం ' వలన, తల్లిదండ్రులు " ఇంగ్లీష్ మీడియం లో, ఇంగ్లీష్‌లో సైన్స్ - లెక్కలు - సోషల్ పాఠాలు చెప్పినా కూడా, బట్టీ పట్టాల్సిన అవసరం లేకుండా .. పిల్లలకు బాగా అర్థం అవుతున్నాయని నమ్ముతున్నారు .

నిజానికి ప్రభుత్వాలు, ఉపాధ్యాయ వర్గం, ప్రభుత్వ/ ప్రైవేట్ పాఠశాలలు కలిసి తల్లిదండ్రులను మోసం చేస్తూ " వారిని తప్పుడు నిర్ణయాలు చేసే విధంగా, అసంబద్ధ - అశాస్త్రీయ నమ్మకాలు ఏర్పరచుకునే విధంగా ప్రోత్సహించారు, ప్రేరేపించారు".

4. పాఠశాల విద్య మాతృభాష లో జరగాలి అనేది శాస్త్రీయ సత్యం మరియు చారిత్రక వాస్తవం మరియు విద్య - ఉపాధి అవకాశాల్లో అసమానతలు రూపుమాపటానికి ఇది ఎంతో అవసరం.

మరి అటువంటిది " ప్రైవేట్ పాఠశాలల్లో మాతృభాష మాధ్యమం పెట్టమని ఎందుకు అడగరు? " అని కొద్దిమంది ప్రశ్న ??

జవాబు :- ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ లోని ప్రైవేట్ పాఠశాలల్లో కూడా తెలుగు మీడియం , ఇంగ్లీష్ మీడియం సమాంతరంగా నడిచేవి . ఎప్పుడైతే మాస్ కాపీయింగ్ , marks inflation ద్వారా (చదివినా - చదవక పోయినా) అధికమార్కులు రావటం మొదలయ్యిందో .. అప్పటి నుండి ప్రైవేట్ పాటశాలల్లో తెలుగు మాధ్యమం పూర్తిగా తగ్గిపోయి, ఇంగ్లీష్ మాధ్యమం అనేది ఒక కొత్త నియమంగా మారింది. (DISE డేటా ఆధారంగా వేసిన రెండవ పట్టిక చూడండి)

వాస్తవాల ఆధారంగా అభిప్రాయాలను ఏర్పరచుకోగలరని మనవి

తమిళనాడు విద్యాసంవత్సరవారీగా ఆంగ్లమాధ్యమంలో నమోదు%

వ.సం	విద్యాసంవత్సరం	ఆంగ్ల మాధ్యమంలో నమోదు %
1.	2002	12.94%
2.	2003	16.15%
3.	2004	18.47%
4.	2005	18.31%
5.	2007	21.14%
6.	2008	25.51%
7.	2009	28.54%
8.	2010	33.28%
	ది 07/09/2010న తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం, తమిళ మీడియంలో చదువుకున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 20% రిజర్వేషన్ కల్పిస్తూ PSTM (People Studied in Tamil Medium) చట్టం చేసింది	
9.	2011	35.85%
10.	2012	35.80%
11.	2013	38.84%
12.	2014	40.47%
13.	2015	42.45%
14.	2016	46.76%
15.	2017	50.29%
16.	2018	58.35%
17.	2019(2018-19)	60.53%
18.	2020(2019-20)	61.59%
19.	2021(2020-21)	61.88%

* తమిళమీడియంలో చదువుకున్న విద్యార్థులకు 20% రిజర్వేషన్ కల్పించిన తర్వాత కూడా ఇంగ్లీష్ మీడియంలో చేరే విద్యార్థుల శాతం పెరిగింది. 2010లో 33.28%గా ఉన్న ఇంగ్లీష్ మీడియం ఎన్రోల్మెంట్, 2021వ సం.రానికి 61.88%కి పెరిగింది

** 2002 నుండి 2018 వరకు గణాంకాలు DISE డేటాలోనివి. 2019 నుండి 2021 వరకు డేటా మద్రాస్ హైకోర్టుతీర్పులోనిది

S.No	Year	% of Pvt. Scl.in A.P.	% of Medium wise Enrolment in Pvt. schools in A.P.	
			Telugu	English
1	2004-05	31	45	55
2	2005-06	33.3	46.26	53.73
3	2006-07	33.5	37.31	62.68
4	2007-08	37.14	37.17	62.38

ఈ వ్యాసంలో రచయిత వెలిబుచ్చిన అభిప్రాయాలను, ఇచ్చిన సమాచారాన్ని శ్రద్ధగా పరిశీలించి మీ అభిప్రాయాలను, వ్యాఖ్యలను, స్పందనను తెలిపితే రానున్న సంచికలో ప్రచురిస్తాము.

– సంపాదకుడు, అమ్మనుడి

Relation between inflated SSC results and increase in the English Medium Enrolment (1987 to 2020)

Dr. Srinivas Guntupalli .

S.No	Academic Years	ANDHRA PRADESH		TAMILNADU		KERALA		KARNATAKA		MAHARASTRA		GUJARAT	
		SSC Pass percentage (March-April)	Percentage of English medium enrolment	SSC Pass percentage (March-April)	Percentage of English medium enrolment	SSC Pass percentage (March-April)	Percentage of English medium enrolment	SSC Pass percentage (March-April)	Percentage of English medium enrolment	SSC Pass percentage (March-April)	Percentage of English medium enrolment	SSC Pass percentage (March-April)	Percentage of English medium enrolment
1	1987-90	31.42 %		50.90 %		49.56 %		44.85 %		40.84 %		56.29 %	
2	1991-95	40.07 %		64.66 %		51.77 %		52.72 %		47.16 %		55.43 %	
3	1996-2000	46.71 %		64.23 %		52.35 %		53.99 %		51.61 %		51.86 %	
4	2001-05	70.87 %	13.48 %	77.80 %	15.85 %	58.62 %	7.05 %	64.24 %	7.38 %	58.72 %	5.46 %	60.70 %	0.65 %
5	2006-10	76.88 %	24.08 %	81.08 %	25.35 %	86 %	16.33 %	72.68 %	10.78 %	79.21 %	10.72 %	62.42 %	2.96 %
6	2011-15	88.32 %	40.21 %	88.80 %	38.67 %	94.52 %	37.94 %	81.25 %	17.85 %	80.03 %	16.55 %	68.97 %	7.18 %
7	2016-18 & 2019-20	93.67 %	54.52 %	94.15 %	51.80 %	96.93 %	58.62 %	75.93 %	29.03 %	87.41 %	24.67 %	67.56 %	10.49 %

వెన్నెలకంటి రామారావు
9550367536

భాషామీమాంస

భాషను శ్రమ(క్రమం) సృష్టించింది. శ్రమక్రమంలోనే (మానవుల సహకార, సమిష్టి కార్యకలాపం) భాష పురుడు పోసుకుంది. మనిషికి-ప్రకృతికి మధ్య సంబంధాలు, మనుషుల మధ్య పరస్పర సంబంధాలకు సంబంధించిన అనుభూతులను, వస్తుగత అంశాల చలన నియమాల అనివార్య సమాచార వినిమయ అవసరాల కోసం శబ్ద సంకేతాల వ్యవస్థ అంటే భాష ఎవరి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా వస్తుగతంగా రూపొందింది. భాష అంటేనే ప్రపంచాన్ని గురించిన మానవ సాధారణీకరణ క్రమం. అది మనుషులకు మాత్రమే ప్రత్యేకం, విశిష్టం.

మనసులోని భావనను బహిర్గతపరిచే ఉమ్మడి భావ వినిమయ సాధనమే భాష. 'చైతన్యం ఎంత పురాతనమైనదో, భాష కూడా అంతే పురాతనమైనది' అని ఒక పాశ్చాత్య తత్వవేత్త వ్యాఖ్యానించారు. నరవానరాల నుంచి మనిషి ఆవిర్భావ క్రమానికి సమాంతరంగా భాష ఆవిర్భవించింది. భావ వినిమయం అనేది సైగలస్థాయి నుంచి శబ్ద సంకేతాల వ్యవస్థ అంటే భాషగా అవతరించింది. మనిషి అవసరాలు, అభిప్రాయ వ్యక్తీకరణలో చోటుచేసుకున్న ఉత్సాహం, ఉత్సుకత, భావోద్వేగాల సమ్మేళనం మాటల ఆవిర్భావానికి దారితీసింది. మనిషిగా ఉన్నత స్థాయికి జరిగిన పరిణామానికి భాష ఒక మైలురాయిగా నిలుస్తుంది. భాష ఎలా పుట్టిందనడానికి నిర్దిష్టమైన వివరణ, సమగ్ర సిద్ధాంతమేదీ లేదు. వివిధ మౌలిక ఊహలపై ఆధారపడి భాషపుట్టుక విషయంలో విభిన్న సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. భాషను మనుషులు ఉద్దేశపూర్వకంగా, చైతన్యయుతంగా రూపొందించుకున్నారా? భాషను ఎవరైనా కనిపెట్టారా? స్వీయాత్మకమైనదా? లేదా అది మానవుల ఉమ్మడి అవసరాలు, కార్యకలాపాల పర్యవసానంగా, ఎవరి ఇష్టాయిష్టాలు, సంకల్పాలతో పనిలేకుండా వస్తుగతంగా ఆవిర్భవించిందా? సమిష్టి అవసరాల నేపథ్యంలో భాష పాదార్థికంగా ఉద్భవించిందా? అనే అంశాలపై మేధావులు మల్లగుల్లాలు పడుతున్నారు.

భాష పుట్టుక-కథనాలు:

భాష పుట్టుకపై వివిధ కథనాలున్నాయి. మానవ పూర్వ జీవ జాతుల్లోని భాషపూర్వ వ్యవస్థల పరిణామం పర్యవసానంగా ఇప్పుడున్న భాషలు ఆవిర్భవించాయి గానీ, భాషలు ఇప్పుడున్నట్లుగా నేరుగా ఆవిర్భవించలేదని కొన్ని సిద్ధాంతాలు చెబుతున్నాయి. వీటిని 'అవిచ్ఛిన్నత' ఆధారిత భాషాసిద్ధాంతాలుగా – పరిగణిస్తారు. అందుకు భిన్నంగా, జంతువుల్లోని సమాచార వినిమయ వ్యవస్థకు కొనసాగింపుగా, పరిణామంగా భాషలు ఆవిర్భవించలేదని, అవి మానవుల ప్రత్యేక, విశిష్ట అంశంగా ఉనికిలోకి వచ్చాయని కొన్ని సిద్ధాంతాలు చెబుతున్నాయి. నరవానరాల నుంచి నరులుగా పరిణామం చెందే క్రమంలో, పరివర్తనా కాలంలో భాషలు ఆవిర్భవించాయని. సాంస్కృతికంగా, పరస్పర చర్యాప్రతిచర్యల ద్వారా భాష నేర్చుకున్నారని కొందరు భాషావేత్తలు భావిస్తున్నారు. వీరి భావాల్ని 'విచ్ఛిన్నత' ఆధారిత భాషా సిద్ధాంతంగా పరిగణిస్తున్నారు. అదే విధంగా, నోమ్ చోమ్‌స్కీ తదితర భాషావేత్తలు 'ఉత్పాదక దృక్పథం' అనే విచ్ఛిన్నత ఆధారిత భాషా సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నారు. దాని ప్రకారం, ప్రధానంగా జన్యువుల కారణంగా మనిషి అంతర్గతంగానే భాష రూపొందుతుందని చోమ్ స్కీ భావన. 'అవిచ్ఛిన్నత' ఆధారిత, 'విచ్ఛిన్నత' ఆధారిత ('ఉత్పాదక దృక్పథం') అని రెండు ప్రధాన భాషా సిద్ధాంత స్రవంతులు ఉనికిలో ఉన్నాయి. రూసో, హెర్డర్, హమ్ బోల్ట్, చార్లెస్ డార్విన్ వంటి ఇతర 'అవిచ్ఛిన్నత' ఆధారిత భావజాలవేత్తలు సంగీతం నుంచి భాష ఏర్పడిందని భావిస్తున్నారు. ఎగువ రాతియుగం విప్లవంలోని ఆధునిక హోమోసెపియన్ నర వర్గంలో ఒక లక్ష సంవత్సరాలలోపు (రమారమి 60,000–1,00,000 ఏళ్ళు మధ్యకాలంలో) భాష అభివృద్ధి చెంది ఉంటుందని శాస్త్రవేత్తల అంచనా. ఫలానా సందర్భంలో భాష ఆవిర్భవించిందని స్థూలంగా అంచనా వేయగల్గినా, అది ఎలా ఆవిర్భవించి పరిణామం చెందిందనే విషయంలో ఏకాభిప్రాయం లేకుండా పోయింది. భాష జీవ సంబంధమైనా పర్యవసానమా, లేక సామాజిక పర్యవసానమా అనే విషయంలో భాషా శాస్త్రవేత్తల మధ్య వివాదం కొనసాగుతోంది.

గత 'అమ్మనుడి' సంచికలో ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావుగారి ప్రసంగ పాఠాన్ని చదివాను. అందులో.. 'నరవానరం ఆధునిక మానవుడిగా వికాసం చెందక ముందు అంటే ఇంకా భాష వికాసం పొందకముందు ఆ నరవానరం శరీరంలోని జీవకణాల్లో ఒక జన్యువు, ఎఫ్.పి.2 (ఫోర్క్ హెడ్ బాక్స్ పి2 ప్రోటీన్... భాషా వికాసానికి మూలమైనది) జన్యువు ఒకటి ఉండేది. ఉన్నట్టుండి అది ఒక మార్పుకు (ఉత్పరివర్తనానికి)లోనైంది.... అలా ఎఫ్.పి. 2 జన్యువులో ఆనాడు అంటే సుమారు లక్ష ఏళ్ళక్రితం ఉన్న ఒక జన్యువులో ఉత్పరివర్తనం (మ్యుటేషన్) జరగటం వలన మనకు 'భాష' సంక్రమించింది. అంతకు ముందు భాష లేదా అంటే ఉంది. అయితే అది మానవ భాష వంటి లక్షణాలను కలిగి ఉన్నది కాదు'. అని వివరించారు. అయితే ఈ భావన చోమ్స్కి స్కీ ప్రతిపాదించిన జన్యు ఆధారిత (ఉత్పాధక దృక్పథం) విచ్ఛిన్నత' భాషా సిద్ధాంతంలోనిదే. ఫోర్క్ హెడ్ బాక్స్ ప్రొటీన్ పి 2 (ఎఫ్ఓఎక్స్ పి 2) అనే ప్రొటీన్ మెదడు, గుండె, ఊపిరితిత్తులు జీర్ణవ్యవస్థల్లో వ్యక్తమవుతుంది. ఎఫ్.పి. 2 జన్యువు వెన్నెముక గల ప్రాణులన్నిటిలోను ఉంటుంది. ముఖ్యంగా

పక్షుల అరుపులకు ఈ జన్యువే కీలకం. ఈ జన్యువుపై మనుషుల భాష, మాటల అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ఈ జన్యువులో ఉత్పరివర్తనం(మ్యుటేషన్) జరిగితే మాట, భాషల వైకల్యం సంభవిస్తుంది. అలాంటి ఎఫ్.పీ. 2 జన్యువులో సంభవించిన ఉత్పరివర్తనం వల్లే మనుషులకు భాష అనేది ఒక అవయవంగా సంక్రమించిందని ఉమామహేశ్వరరావు గారు పొరపాటున రాసారు. ఆయన మానవ శరీరంలో సంభవించిన జన్యు మార్పులే భాష ఆవిర్భావానికి కారణమనే 'అవిచ్ఛిన్నత' ఆధారిత భాషా సిద్ధాంతాన్ని ఒకవైపు చెబుతున్నారు. మరోవైపు సైగలు, శబ్దాలతో జంతువులలో జరిగే సమాచార వినిమయాన్ని కూడా ఒకరకమైన భాషగా పరిగణిస్తున్న 'అవిచ్ఛిన్నత' ఆధారిత భాషావేత్తల సిద్ధాంతాన్ని కూడా (అలాంటి వినిమయం కొనసాగింపే ఆ తర్వాతి కాలంలో మానవుల భాషగా రూపొందింది) తన వాదనతో అనాలోచితంగా జతచేయడం ఎంతవరకు సమంజసం? అదీ కాకుండా తొలినాళ్ళ మానవ సమూహం వలసల కారణంగా, భాషా వినిమయం తగ్గిపోవడంతో వేర్వేరు ప్రాంతాలలోని భాషలు వేర్వేరు భాషలుగా విభజించబడ్డాయి... అని ఆయన సూత్రీకరణ కూడా ప్రామాణికంగా లేదు. భాష పుట్టుక అంతర్గత శారీరక వ్యవహారమైనట్లయితే సామాజికంగా ఆది పోషిస్తున్న పాత్రను ఎలా అర్థం చేసుకోవాలి?

శారీరకమా? సామాజికమా? :

మెదడు కార్యకలాపం శారీరకమైనప్పటికీ, దాని పర్యవసానమైన 'చైతన్యాన్ని' సామాజిక అంశంగా పరిగణిస్తాము. అలాగే భాషావ్యవహారం శారీరక సంబంధమైనదిగా పైకి కనపడుతున్నప్పటికీ, మాట, భాష పుట్టుక, వాటి కార్యకలాపం సామాజిక సంబంధమైన అంశంగానే పరిగణించడం శాస్త్రీయమైనది. విడి విడి వ్యక్తుల అనుభూతుల్లో, ప్రత్యక్ష-పరోక్ష అనుభవాల్లో సంతరించుకున్న సమాచారాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చే సాధనంగా భాష వ్యవహరిస్తుంది. అంటే నిర్దిష్ట మానవ సమూహంలో అవతరించిన శబ్ద సంకేతాల వ్యవస్థలోని ప్రతి నిర్దిష్ట మానవ సమూహంలో అవతరించిన శబ్ద సంకేతాల వ్యవస్థలోని ప్రతి శబ్ద సంకేతంలో (మాటలు, పదాల్లో) నిర్దిష్టమైన, ఖచ్చితమైన, సమిష్టి ఆమోదయోగ్యమైన భావ ముద్రలు, భావనలు ఇమిడి ఉంటాయి. దాంతో చుట్టూతా ఉన్న ప్రపంచం (ప్రకృతి + సమాజం) అంతస్సంబంధాల్ని, సారాన్ని, అనుసంధానాల్ని సంబంధిత మానవ సమూహంలోని సభ్యులందరికి అర్థంచేయించే సమన్వయ, సంచయన సాధనంగా భాష పనిచేస్తుంది. అంటే భావ ప్రసార సాధనంగా, జ్ఞాన సంచయన భాండాగారంగా, సాంస్కృతిక కొనసాగింపు మాధ్యమంగా భాష వ్యవహరిస్తుంది. ఆయా భాషాజాతీయుల ఉమ్మడి అస్తిత్వానికి, వ్యక్తీకరణకు ప్రతీకగా భాష నిలుస్తుంది. చైతన్యం లాగానే భాష కూడా సమిష్టి కార్యకలాపంలో జనించి, వ్యక్తుల ద్వారా వ్యక్తమవుతుంది.

తానున్న ప్రపంచానికి(ప్రకృతి+సమాజం) చెందిన అనుభూతులను, వస్తుగత చలన నియమాలను సాధారణీకరించడంలో మనిషికి, జంతువుకు ప్రధాన తేడా ఉందని శాస్త్రాలు చెబుతున్నాయి. మాట, భాష అనేది కేవలం శబ్ద సంకేతం రూపంలో భావ వినిమయమే కాదు, ప్రపంచాన్ని సాధారణీకరించే క్రమం, మానవజ్ఞాన నిక్షిప్త సాధనం కూడా. మనిషికి ప్రపంచపు అనుభూతులను సాధారణీకరించవలసిన అవసరం మరే జంతువుకు లేనివిధంగా ఎందుకు అలవడింది? పక్షులు ఎగరగలవు, జింకలు కాళ్ళతో వేగంగా పరిగెత్తగలవు, పులులు బలమైన పంజాలతో వేటాడగలవు...... ఇలా జంతువులన్నీ ఆహార సంపాదన, ఆత్మరక్షణ కొరకు ఏదోఒక అవయవ విశిష్టతను, ప్రత్యేకతను కలిగి ఉంటాయి. మనిషికి మాత్రం మెదడు తప్ప ఏ ఆహార సంపాదన, ఆత్మరక్షణ కోసం ప్రత్యేకించి వినియోగించగల విశిష్ట అవయవం ఏదీ లేదు. ఈ నేపథ్యంలో అంతర్గత శారీరక లక్షణాలను అధిగమించి, తమ ఉనికిని కాపాడుకోవడం (ఆహారం, ఆత్మరక్షణల విషయంలో) కోసం మానవులు సమిష్టి, సామూహిక కార్యకలాపాలను నిర్వహించడం ద్వారా తమ అస్తిత్వాన్ని నిలుపుకున్నారు. మానవుల అస్తిత్వం, ఉనికి వారి మధ్య నెలకొన్న సహకార, సమిష్టి కార్యకలాపాలలోనే ఉంది. సహకార, సమిష్టి కార్యకలాపం ద్వారానే వానరుడు, నరవానరుడు, నరుడుగా పరిణామం జరిగింది. మానవులు నిర్వహించే సహకార, సమిష్టి కార్యకలాపాన్ని 'శ్రమ' గా పరిగణిస్తారు. శ్రమ అంటే విడివిడి వ్యక్తులు చేసే కార్యకలాపంగా భావించడం కద్దు, అయినప్పటికీ రాజకీయార్థశాస్త్రపరంగా ఆ అవగాహన తప్పు. నిర్వహిస్తున్న కార్యకలాపం విడివిడి వ్యక్తుల ద్వారా జరుగుతున్నట్లు పైకి కనపడుతున్నప్పటికీ, సమాజంలోని లేదా మానవులు నిర్వహించే ఏ ఒక్క ఉత్పత్తి గానీ (అది ఎంత ప్రాథమికమైనప్పటికీ) వ్యక్తిగతంగా కాక సమిష్టిగా, సామాజిక కార్యకలాపంలో అంతర్భాగంగానే సాగుతుంది. సమిష్టి, సహకార కార్యకలాప నిర్వహణ (శ్రమ) ద్వారానే వానరుడు నరుడిగా అవతరించాడు. మానవ అస్తిత్వం ఆ శ్రమలోనే ఉంది. అయితే ఇక్కడ మనం ఒక విషయాన్ని గమనించాలి. సహకార, సమిష్టి కార్యకలాపం నిర్వహిస్తున్న మానవ సమూహం ఆహార సంపాదన విషయంలోను, ఆత్మరక్షణ విషయంలోనూ పరస్పరం సమన్వయంతో, పరస్పరం సమాచార వినిమయంతో వ్యవహరించ వలసి ఉంటుంది. అందుకు తన చుట్టూతా ఉన్న ప్రపంచానికి చెందిన అనుభూతులన్నిటినీ శబ్ద సంకేతాల రూపంలో సాధారణీకరించడం (దృశ్య తదితర ఇంద్రియానుభూతుల కంటే శబ్దం మెరుగైనది) అనివార్యమైంది. తమ భావాలను ఇతరులతో పంచుకోవడం, అనుభవాలను నిక్షిప్తం చేసుకొని తర్వాతి సందర్భాలలోను, తరాలకు అందించడంలోను భాష కీలక పాత్ర పోషించింది. మానవ అస్తిత్వమైన సమిష్టి, సహకార కార్యకలాపం (శ్రమ) సజావుగా సాగాలంటే భాషను రూపొందించుకోవడం అత్యవసరం. భాషను శ్రమ(క్రమం) సృష్టించింది. శ్రమక్రమంలోనే (మానవుల సహకార, సమిష్టి కార్యకలాపం) భాష పురుడుపోసుకుంది. మనిషికి-ప్రకృతికి మధ్య సంబంధాలు, మనుషుల మధ్య పరస్పర సంబంధాలకు సంబంధించిన అనుభూతులను, వస్తుగత అంశాల చలన నియమాల అనివార్య సమాచార వినిమయ అవసరాల కోసం శబ్ద సంకేతాల వ్యవస్థ అంటే భాష ఎవరి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా వస్తుగతంగా రూపొందింది. భాష అంటేనే ప్రపంచాన్ని గురించిన మానవ సాధారణీకరణ క్రమం. అది మనుషులకు మాత్రమే ప్రత్యేకం, విశిష్టం. జంతువులు చేసే శబ్దాలు, సైగలు వగైరా రూపంలోని

కేవలం వ్యవహారిక ప్రజల భాషగా మాత్రమే భాష అని అనుకోవడం అశాస్త్రీయం. ఒక భాష అభివృద్ధి చెందడం, సుస్థిరంగా ఉండడం అంటే ఎంతమంది ఆ భాషలో మాట్లాడుతున్నారన్నది ప్రమాణం కాదు. ఒక భాషలోని సహజ భాష, పరిభాష (కృత్రిమ భాష) అనే అంశీభూతాలు ఏ మేరకు తగురీతిలో అభివృద్ధి చెందుతున్నాయన్నది అసలు విషయం.

సమాచార వినిమయంలో 'సాధారణీకరణ' ప్రక్రియ ఉండదు కాబట్టి వాటిని భాషగా గుర్తించడం అశాస్త్రీయం.

సుమారు 10 లక్షల ఏళ్ళ క్రితం, పాత రాతి యుగం చివర్లో ఆదిమ మానవుడు అంటే 'నియాండర్తాల్' మానవుడు అవతరించాడు. ఆ కాలంలోనే రాతి పనిముట్లు కూడా రూపొందాయని పలు పురావస్తు తవ్వకాలు తెలియజేస్తున్నాయి. రాతి పనిముట్లతో సమిష్టి, సహకార కార్యకలాపం(శ్రమ) నిర్వహించడం ద్వారా జంతువుల మందగా ఉన్న నరవానర సమూహం సామాజిక సమూహంగా ఆవిర్భవించడానికి, భాష ఆవిర్భావానికి దారితీశాయి. ఆ తర్వాత పాత రాతియుగపు మధ్య దశలో నియాండర్తాల్ మానవులు పెద్ద జంతువులను సామూహికంగా వేటాడిన అవశేషాలు కూడా లభ్యమైనాయి. మనిషి సామాజిక పరిణామ క్రమంలో, అతని జీవన విధానం, కార్యకలాపాలు, ఆలోచనాధోరణి దాదాపు పూర్తిగా అతను ఏ రకం పర్యావరణం, ఏ రకం సమాజంలో జీవిస్తున్నాడో దానితో నిర్ణయించబడతాయి. దాన్ననుసరించి, శ్రమ, సమాజం, పర్యావరణం, ప్రత్యేకించి మనిషి ఆలోచనా ధోరణి (చైతన్యం) ఆవిర్భావంతోపాటు మెదడు, దాంతోపాటు మొత్తం నాడీ మండల నిర్మాణంలోను, విధుల్లోను ప్రధానమైన మార్పులు జరిగాయి. జంతువులో కానరాని ఈ మార్పులు మనిషిలో ప్రత్యేక విశిష్ట లక్షణాలను కలిగి ఉంటాయి.

ఒక శిశువుకు నాడీ మండలం అవసరమే అయినప్పటికీ, చైతన్యానికి తగినంత స్థితి కలిగి ఉండదు. ఎందుకంటే మానవ సమాజానికి దూరంగా పెరిగే శిశువు చైతన్యం జంతువు చైతన్య స్థాయికి (ప్రవృత్తుల స్థాయి) మించి పెరగదు. ఆ శిశువు ఆ సమూహంలోని ఇతరులతో పరస్పర సంసర్గంలో ఉన్నప్పుడే అతనికి చైతన్యంగానీ, ఆ భాషగానీ అబ్బుతుంది. అమ్మనుడి తల్లి గర్భంలోనే శిశువుకు అలవడుతుందని కొందరు తప్పుగా భావిస్తున్నారు. భాష కచ్చితంగా సామాజికమైనది. ఆదిమమానవుల సంయుక్త కృషి ఫలితంగా ఒక పాదార్థిక సామాజిక అంశంగా భాష ఉనికిలోకి వచ్చింది. ఉమ్మడి కృషి ద్విముఖమైనది. జంతువులకు వలె ఏ అవయవ విశిష్టతలు విడి వ్యక్తుల చేయడానికి అసంభవమైన ఆహార సంపాదన, ఆత్మరక్షణ కార్యకలాపాన్ని అది సాధ్యం చేసింది. అంతే కాకుండా విడి విడి వ్యక్తులు సంతరించుకున్న సమాచారం, అనుభవం అందరికీ అందుబాటులోకి వచ్చేటట్లు, తర్వాతి సందర్భాలకు, తర్వాతి తరాలకు అందించేందుకు నిక్షిప్త సాధనంగా భాష (శబ్ద సంకేతాల వ్యవస్థ) వినియోగంలోకి వచ్చింది. సమాచారం అందరికీ అందుబాటులోకి రావాలంటే అది ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేట్లు ఉండాలి. ఒకే రకమైన వస్తువులను, ఒకే రకమైన పరిస్థితుల్లో దర్శించినప్పుడు మాత్రమే, విభిన్న వ్యక్తులు కొంచెం ఇంచుమించుగా ఒకే రకమైన ఇంద్రియగ్రాహ్యమైన అనుభూతులను, భావనలను పొందడం సాధ్యం. దర్శించే పరిస్థితులు గణనీయంగా విభేదించినపుడు, విభిన్న వ్యక్తుల ఇంద్రియ గ్రాహ్య భావ ముద్రలు కూడా అలాగే విభేదిస్తాయి. అయితే, శబ్ద సంకేతమన్నది, ఒక రకం వస్తువులకు ఉమ్మడిగా వర్తించడమే కాకుండా, ఉమ్మడి కృషిలో నిమగ్నమై ఉన్న వారందరికీ కూడా ఉమ్మడిదిగా వ్యవహరిస్తుంది. ఒక శబ్ద సంకేతం ద్వారా అందజేయబడిన సమాచారం (సంకేతం) కేవలం అనుభూతిగా మాత్రమే ఉండదు. అది ఒక భావన, ఒక సాధారణ భావంగా వినిమయంలో ఉంటుంది. 'ప్రతి మాటా (భాషణం)... ముందే, సాధారణీకరిస్తుంది' అని ఒక పాశ్చాత్య మేధావి వ్యాఖ్యానించాడు. అంటే వస్తుగత ప్రపంచాన్ని భాష ముందుగానే సాధారణీకరిస్తుంది గానీ, అది కేవలం ఇంద్రియానుభూతి కానేకాదు. ఉదాహరణకు చెట్టు అనే పదం దాని నిర్దిష్టమైన ఎత్తు, చుట్టుకొలత, ఆకారం, పత్రసముదాయం, నిలువు, అడ్డం తదితర విషయాలను ప్రస్తావించదు. అయినప్పటికీ, మొత్తం మీద చెట్లకు ఉమ్మడిగా ఉండే విశిష్ట లక్షణాలను ప్రతిబింబించే సంకేతంగా 'చెట్టు' అనే పదం ఉంటుందన్నది విదితమే. శబ్ద సంకేతం రూపంలోని భౌతిక విషయం లేనిదే ఏ భావనలు గాని, భావాలు గానీ ఉత్పన్నం కావు. వానరుడు నరుడుగా మారే పరిణామక్రమంలో శ్రమకు సమాంతరంగా భాష కూడా అత్యంత కీలకపాత్ర పోషించినట్లుగా పరిగణించవచ్చు. **అందువల్ల భాష అనే అంశం శారీరకమైనదిగా కాక, సామాజికమైనదిగా గుర్తించాలి.**

నిర్జీవ, జీవ వైవిధ్యత; భాషా వైవిధ్యత:

ప్రకృతిలో అంతర్భాగంగా ఉన్న నరవానరాలకు భాష అవసరం లేదు. ప్రకృతి నుంచి తమ అవసరాలు తీర్చుకునేందుకు అనివార్యంగా, సహకార సమిష్టి కార్యకలాప (శ్రమ) క్రమంలో నరవానరాలలో దేహాత్మక మార్పులతోపాటుగా, భాష, చైతన్యం ఉద్భవించడంతో సామాజిక మానవులు ఆవిర్భవించారు. ఆఫ్రికా ఖండంలో ఏర్పడిన తొలి మానవ సమూహం ఆహారం, ఆత్మరక్షణ కోసం ఖండాంతరాలకు వలసలబాట పట్టింది. దాంతో భిన్న పర్యావరణాలలో బతక వలసిన నేపథ్యంలో ఆహారం, ఆత్మ రక్షణ కోసం ఆ ప్రాంతంలోని నిర్జీవ, జీవ వైవిధ్యతలతో వ్యవహరించవలసిన సందర్భంలో అందుకు తగిన భావ వినిమయ సాధనాన్ని అంటే శబ్ద సంకేతాల వ్యవస్థను (భాషను) ఆయా మానవ సమూహాలు రూపొందించుకోవలసి వస్తుంది. పర్యవసానంగా భిన్న పర్యావరణాల (నిర్జీవ, జీవ వైవిధ్యతలు)తో అక్కడి మానవ సమూహానికి ఏర్పడిన సంబంధాలకు అనుగుణంగా, ఉత్పత్తి తీరును బట్టి వాళ్ళ మధ్య సామాజిక సంబంధాలు ఏర్పడినాయి. దాంతో అందుకనుగుణమైన సామాజిక సంబంధాల గురించిన భాష కూడా రూపొందుతుంది.

పర్యావరణం, సామాజిక శ్రమల ప్రేరణతోనే మానవుల భాష, చైతన్యాలు అభివృద్ధి చెందాయి. అంటే భిన్న ప్రాంతాల పర్యావరణాల పునాదిపైన మానవ భాషలు ఉనికిలో ఉన్నాయి. ప్రపంచంలోని ఉష్ణమండల ప్రాంతంలో, మరీ ముఖ్యంగా దక్షిణార్ధగోళ ప్రాంతంలో

జీవవైవిధ్యం మెండుగా ఉంటుంది. దాంతో మొత్తం 7 వేలకు పైచిలుకు ప్రపంచ భాషలలో 60 శాతం భాషలు దక్షిణార్ధ గోళ దేశాలల్లోనే ఉన్నాయి. న్యూగినియా, ఇండోనేషియా దేశాలు భూగోళంలోని 'మహా జీవ వైవిధ్యం' గల (మెగా బయోడైవర్సిటీ) ప్రాంతాలుగా పేరెన్నిక గలవి. పర్యవసానంగా ప్రపంచ భాషల్లో 25 శాతం దాకా ఈ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఇండియాలో కూడా మహా జీవవైవిధ్య ప్రాంతాలు ఉండడంతో ఇక్కడ కూడా 380 భాషలు వాడుకలోకి వచ్చాయి. పర్యావరణం పునాదిగా సాగే ఒక నిర్దిష్ట మానవ సమూహపు సహకార, సమిష్టి కార్యకలాపాల (శ్రమ) ప్రభావంతో శబ్ద సంకేతాల వ్యవస్థ అంటే భాషలు అంకురించాయి. ఒక రకం వస్తు సముదాయానికి ఉమ్మడిగా వర్తించడమే కాకుండా, సంబంధిత మానవ సమూహానికి ఉమ్మడిదై ఉండే శబ్ద సంకేతాల వ్యవస్థగా భాష నిలుస్తుంది. ఒకానొక నిర్దిష్ట శబ్ద సంకేతాల వ్యవస్థ (భాష) ద్వారా అనుబంధితులైన మానవ సమాజం ఒక భాషాజాతిగా ఉనికిలోకి వస్తుంది. దాంతో ఆ సమూహ సభ్యుల మధ్య నిర్దిష్టమైన శబ్ద సంకేతాల వ్యవస్థతో కూడిన పాదార్థిక సంబంధాలు నెలకొన్నట్లే. వైవిధ్యభరిత పర్యావరణాల ప్రతిఫలనంగా మానవ సమూహాలు వైవిధ్యభరిత భాషాజాతులు ఉనికిలోకి వచ్చాయి.

సహజ భాష : పరిభాష:

ఒక నిర్దిష్ట పర్యావరణంలో మనుగడలో ఉన్న సమాజంలోని భౌతిక, బౌద్ధిక ఉత్పత్తి వ్యవహార కార్యకలాపాల అవసరాలకనుగుణంగా వ్యక్తుల చైతన్యానికి, సంకల్పానికి అతీతంగా వస్తుగతంగా ప్రజల మధ్య ఏర్పడే 'శబ్ద సాంకేతిక వ్యవస్థ'ను భాష (సహజ భాష) అని పిలుస్తారు. భూగోళంలో పర్యావరణ వైవిధ్యానికి అనుగుణంగా వివిధ భాషలు ఉనికిలోకి వచ్చాయి. దృగంశాల (పైకి కనిపించే దృశ్యమాన ప్రపంచం) వాస్తవికత నుంచి ప్రపంచ (ప్రకృతి+సమాజం) అంతర్గత నియమాల అంతస్సారంలోకి మనిషి జ్ఞానాభివృద్ధి క్రమం లోతుగా కొనసాగే కొద్దీ అనంతమైన సాపేక్ష సత్యాలు ఉనికిలోకి వస్తుంటాయి. ఈ నిరంతరాయమైన జ్ఞానాభివృద్ధి క్రమంలోని వైవిధ్యాలను అర్థం చేసుకునేందుకు వీలుగా నరికొత్త పారిభాషిక పదాలు రూపొందించుకోవాల్సి ఉంటుంది. దాంతో సాధారణ వ్యవహారిక భాష పునాదిగా వివిధ విజ్ఞానశాస్త్ర రంగాల్లో అందుకు అవసరమైన పారిభాషిక పదజాలం ఏర్పడుతుంది. ఆయా సమాజాలలోని ఉత్పత్తి కార్యకలాపానికి అనుబంధంగా సాగే శాస్త్ర సాంకేతికాభివృద్ధిలో భాగంగా అభివృద్ధి చెందే శాస్త్రాల అవసరాల కోసం పుట్టుకొచ్చే పద సంపద, భాషలను 'పరిభాష'లు (కృత్రిమ భాష) అని అంటారు. దృగంశాల పునాదిగా సాగే సామాజిక వ్యవహారాల కోసం మనుషులు వినియోగించే వ్యావహారిక భాషను 'సహజ భాష' అని పిలుస్తారు. ఈ సహజ భాష పునాదిగా వివిధ శాస్త్రాల పారిభాషిక పదజాలంతో 'కృత్రిమ భాష/ పరిభాష రూపొందుతుంది. రెండూ అవిభాజ్యమైనవి. పరస్పర పూరకమైనవి. సమాజాలు సాధించిన అభివృద్ధి స్థాయిని, తీరుని బట్టి ఆ రెండింటి వికాసాలుంటాయి.

ఒక జాతీయ భాషలోని సహజభాష, పరిభాషలు రెండూ పరస్పర ఆశ్రితాలు, పరస్పరం ప్రభావితం చేసుకుంటూ కొనసాగుతాయి. ఆచరణ, జ్ఞానం ఎలా అవిభాజ్యమైనవో ఇవి రెండూ ఒక భాషలో అంతర్భాగాలు. వ్యావహారిక భాష ప్రజలదని, సాహిత్యం, విజ్ఞాన శాస్త్రాల భాష ఉన్నత వర్గాలవారిదని సూత్రీకరించడం పొరపాటు. సహజ భాషల పునాదిగానే పరిభాషలు ఉద్భవించినప్పటికీ అవి తిరిగి సహజ భాషల అభివృద్ధికి దోహదం చేస్తాయి. సహజ భాషలకు సామాన్య ప్రజలు కర్తలైతే పరిభాషలకు మేధావులు, శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు, సాహిత్యవేత్తలు ప్రధాన కారకులు. సహజ భాష, పరిభాషలు రెండూ సమాజాభివృద్ధికి అవసరమే. రెండు భాషలూ ప్రజల భాషలే. సహజ భాష, పరిభాషల్ని అంశీభూతాలుగా ఉన్న వ్యవస్థగా మాత్రమే ఒక భాషను అర్థం చేసుకోవాలి. అంతేగాని, కేవలం వ్యావహారికమైన ప్రజల భాషను మాత్రమే భాష అని అనుకోవడం అశాస్త్రీయం. ఒక భాష అభివృద్ధి చెందడం, సుస్థిరంగా ఉండడం అంటే ఎంతమంది ఆ భాషలో మాట్లాడుతున్నారన్నది ప్రమాణం కాదు. ఒక భాషలోని సహజ భాష, పరిభాష (కృత్రిమ భాష) అనే అంశీభూతాలు ఏ మేరకు తగురీతిలో అభివృద్ధి చెందుతున్నాయన్నది అసలు విషయం. ఒక భాషలోని ఈ రెండు అంశీభూతాల సంతులిత అభివృద్ధి కుంటుపడితే అది గిడసబారి, జీవ లక్షణం కోల్పోయి ప్రజల సాంస్కృతిక, వైజ్ఞానిక అవసరాలను తీర్చడంలో నిరుపయోగమవుతుంది. దాంతో క్రమంగా అది పరాయీకరణ పొంది, అంతరించే దిశగా ప్రయాణిస్తుంది లేదా అవశేషంగా కొనసాగుతుంది. ఈ పరిస్థితి సదరు భాషాజాతీయుల అస్తిత్వాన్ని అంతర్ధానం చేస్తుంది. **ఈ నేపథ్యంలో భాషోద్యమకారులు తెలుగు భాష అంతరిస్తుందని ఆందోళన చెందడం సమంజసమే. ఇప్పటికే ఆ క్రమం ఆందోళనకర స్థాయికి చేరుకుంది.**


భాష వస్తుగతమైనది. దాని పరిరక్షణ కోసం ఉద్యమం వస్తుగత డిమాండ్లతో కూడుకొని ఉండాలి. సామాజికాభివృద్ధితో భాషాభివృద్ధి (తెలుగు తదితర) ముడిపడి ఉంటుంది. అందుకు అనుగుణంగా సహజ భాష, పరిభాషల అభివృద్ధికి దోహదం చేసే భాషా విధానం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉంది. అందుకు భిన్నంగా వాడుకలో లేని తెలుగు పదాలను వివిధ భాషా అవసరాలకు వినియోగించే పరభాషా పదాలకు ప్రత్యామ్నాయంగా వినియోగించేందుకు ప్రయత్నించడం, అలాంటి డిమాండ్లతో ఉద్యమించేందుకు ప్రయత్నించడమూ నీడతో యుద్ధం చేయడమే. అదే సమయంలో తెలుగు భాషకు సంబంధించి స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక అత్యున్నత వ్యవస్థను ఏర్పరచి, భాషావ్యవహారాలను పరిష్కరించేందుకు, ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త పరిభాషను సూచించేందుకు, మాండలికాలతో సహా తెలుగు పదజాల నిఘంటువును తయారు చేయడం, అంతర్జాలంలో తెలుగును పెంపొందించడం వంటి ప్రయత్నాలు కూడా తెలుగు భాషాజాతి భాషా సమస్యను మౌలికంగా పరిష్కరించలేదు. భాషలోని వివిధ మాండలికాల మధ్య అంతర్గత ప్రజాస్వామ్యం పునాదిగా ప్రపంచంలోని వివిధ భాషల నుంచి ఆదానప్రదానాలు చేపట్టే విధంగా తెలుగు భాషావిధానం అమలులోకి రావాలి. అందుకు అనుగుణమైన సామాజిక, రాజకీయార్థిక విధానాన్ని అమలు చేసే పాలకులతో కూడిన సామాజిక వ్యవస్థ తప్పనిసరి షరతు అవుతుంది. కుల, వర్గ, ప్రాంత, జెండర్ అస్తిత్వాలకు అతీతంగా తెలుగు భాషోద్యమం వికసించాలి.

ముఖచిత్రం

కరణం కళ్యాణకృష్ణ కుమార్
98484 28978

బ్రిటీష్ వెన్నులో చలిపుట్టించిన
చీరాల-పేరాల ఉద్యమానికి వందేళ్ళు పూర్తి

బ్రిటీషు ప్రభుత్వపు వెన్ను విరిచిన ప్రజా ఉద్యమం సహాయ నిరాకరణోద్యమం 1920 సెప్టెంబరు 4 న మొదలై 1922 ఫిబ్రవరిలో ముగిసింది. 1919 మార్చి 21 నాటి రౌలట్ చట్టానికి, 1919 ఏప్రిల్ 13 న జరిగిన జలియన్‌వాలా బాగ్ ఊచకోతకూ నిరసనగా సంపూర్ణ స్వరాజ్యం కోసం మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెస్ బ్రిటీషు ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చెయ్యాలని పిలుపునివ్వడంతో ఉద్యమానికి బీజం పడింది. ఇది గాంధీ పెద్ద ఎత్తున ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన మొట్టమొదటి ఉద్యమంగా పేరొందింది. సహాయ నిరాకరణ మొదలుపెట్టి విజయం వైపు అడుగులు వేయించి, గాంధీ ఆలోచనకు ఊతమిచ్చిన ఉద్యమం దుగ్గిరాల నేతృత్వంలోని చీరాల పేరాల ఉద్యమం. ఇది 21 ఏప్రిల్ 1921 న ప్రారంభమై మార్చి 1922 వరకూ కొనసాగింది.



సహాయ నిరాకరణ ఉద్యమనేత
చీరాల పేరాల ఉద్యమ నిర్మాత
దుగ్గిరాల గోపాలకృష్ణయ్య

దేశ స్వాతంత్ర్య చరిత్రలో అదో ఉజ్వల ఘట్టం. సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన చరిత్ర. దేశం స్వాతంత్ర్యానికి నమూనాగా ఎగసిపడిన జనజ్వాల. ఆనాటి ప్రభుత్వం ఊహించని ప్రజాచైతన్యం. అదే బ్రిటీష్ వాదుల వెన్నులో నిశ్శబ్దంగా చలి పుట్టించిన చీరాల-పేరాల ఉద్యమం. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య సారథ్యంలో 11 నెలలు బ్రిటీష్ ముష్కరుల నిర్బంధాలకు ఎదురొడ్డి సాగిన దేశంలోనే ప్రత్యేక సహాయ నిరాకరణోద్యమం. ఒకరా, ఇద్దరా! ఏకంగా 13,500 మంది గ్రామస్తులు రెండు గ్రామాలు ఖాళీ చేసి, పిల్లలు, పశువులతో సహా ఊరికి దూరంగా పాకలు వేసుకుని కాలం వెళ్ళదీశారు. ఒకరివెనుక ఒకరుగా బండెనక బండి గట్టి సాగిన ఆ పాదయాత్ర ఓ మహా సంకల్పానికి నాంది పలికింది.

అది 1919 వ సంవత్సరం. ఆంధ్ర రాష్ట్రంలోని నేటి బాపట్ల జిల్లాలోని చీరాల ప్రాంతంలో ప్లేగు వ్యాధి ప్రబలింది. పంచాయితీలుగా ఉన్న చీరాల, పేరాల గ్రామాలను కలిపి ఒక మునిసిపాలిటీగా చేస్తే ప్లేగు వ్యాధికి మందులు అధికంగా అందుబాటులోకి వస్తాయని నమ్మబలికి మునిసిపాలిటీగా చేయాలని ప్రతిపాదించింది ప్రభుత్వం. దీంతో అప్పటివరకూ సుమారు రూ. 4000 పన్నులు చెల్లిస్తున్న రెండు గ్రామాల ప్రజలు ఏకంగా రూ. 40000 పైగా చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తడంతో, ఆ నిర్ణయం ప్రజలకి ఆశనిపాతంలా తగిలింది. వారి గ్రామ పంచాయితీలను విలీనం చేసి మునిసిపాలిటీ చేయడాన్ని ప్రజలు మూకుమ్మడిగా వ్యతిరేకించారు. పన్నులు చెల్లించేదే లేదని తెగేసి చెప్పేశారు. బ్రిటీష్ అధికారుల ఒత్తిడి అధికమవ్వసాగింది. కాగా, అప్పటికే చీరాలలో నివాసం ఏర్పరచుకున్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య కాంగ్రెస్‌లో పేరొందిన నాయకునిగా ఎదుగుతున్నారు. 1921 ఏప్రిల్ 19 న తిలక్ నిధి కోసం పర్యటనలో భాగంగా చీరాల చేరుకున్న మహాత్మా గాంధీ దృష్టికి చీరాల-పేరాల పంచాయితీ ప్రజల కష్టాన్ని తీసుకెళ్ళారు గోపాలకృష్ణయ్య. పంచాయితీల అభివృద్దే దేశాభివృద్ధికి మూలమని, వాటిని పన్నుల కోసం విలీనం చేయడం, ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడం ప్రభుత్వ దుర్నీతికి సాక్ష్యం అని తెలిపారు. దీనిపై స్పందించి, "ఊర్లో ఉంటూ పన్నులు చెల్లించకపోవడం భావ్యం కాద"న్న గాంధీజి, కొన్ని ప్రతిపాదనలను దుగ్గిరాల ముందుంచారు. అప్పటికే ఉద్విగ్నిడైన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వాటిలో 'పురత్యాగానికే' సై అన్నారు. చీరాల పేరాల ప్రజలు దేశభక్తితో తొణికిసలాడుతున్నారని, దేశం కోసం తమని త్యాగం చేసుకోవడానికైనా వెనుకడుగేయని చీరాల - పేరాల వాసులు, 'పురత్యాగానికి' సంసిద్ధులవుతారని గాంధీజీకి విన్నవించారు.

అయితే ఒక్క షరతుని విధించారు గాంధీజీ. **"బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సహాయ నిరాకరణ చేపట్టాలన్నది కాంగ్రెస్ నిర్ణయం. పురత్యాగమనే సహాయ నిరాకరణ విజయవంతమైతే, అది కాంగ్రెస్ విజయం అని, విఫలమైతే అది దుగ్గిరాల వైఫల్యంగా ప్రచారం కావలసి ఉంటుంది"** అని చెప్పారు గాంధీజీ. చీరాల పేరాల వాసులని ఒక త్రాటిపైకి తేవడానికి మానసికంగా సిద్ధమైన దుగ్గిరాల ఆ నిమిషం నుంచి విజయమో వీరస్వర్గమో అన్న రీతిలో ప్రజలను చైతన్యదీప్తులుగా ఉద్యమానికి సిద్ధం చేశారు. అప్పటికే దేశసేవలో తరిస్తున్న ఆయన స్థాపించిన స్వచ్ఛంద సంస్థ 'రామదండు' దుగ్గిరాల సంకల్పానికి కాగడాగా నిలిచింది. రావుబహద్దూర్ రావుల లోకనాథం, వైశ్యరత్నగా

పేరొందిన ఊటుకూరు వెంకటేశ్వర్లు గుప్త, నూనె పానకాలు గుప్త వంటి అనేక మంది ప్రముఖులు ఆర్థికంగా చేయూత నిచ్చి ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచేందుకు సిద్ధమయ్యారు. ఊహించని 'పురత్యాగంతో' రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యంలో వెలుగు ఒక్కసారిగా సన్నగిల్లింది.

ఆనాడు దుగ్గిరాలవారు చేపట్టబోయే ఉద్యమం, భారతదేశంలో తమ రాజ్యాధికారాన్ని పెకిలించే ఆయుధమని ఊహించని బ్రిటీష్ దొరలు- వేగుల సమాచారాన్ని తేలికగా తీసిపారేశారు. ఒక్కసారిగా 1921 ఏప్రిల్ 21 న ప్రజలంతా తట్ట, బుట్ట సర్దుకున్నారు. చిన్నారులని చంకకి చీరతో బిగించారు. రామదండు యువతంతా దారిపొడవునా రక్షణగా నిలిచారు. వందేమాతరం, మహాత్మా గాంధీకి జై, దుగ్గిరాలయ్యకు జై అంటూ దండు కదిలింది. రెండు గ్రామాల వాసులు, పదమూడువేల పై చిలుకు (అప్పటి గ్రామ రికార్డుల ప్రకారం) ప్రజల గర్జన లండన్‌లోని బ్రిటీష్ పార్లమెంటుని తాకింది. పేరాల గ్రామ పొలిమేర దాటిన తర్వాత బాపట్ల రహదారికి కుడివైపున గోపాల కృష్ణయ్యతో పాటు రెండు గ్రామాల ప్రజలందరూ పాకలు వేసుకున్నారు. రెండు మంచినీటి బావులని తవ్వుకున్నారు. ' గోపాలకృష్ణయ్యకు ఇష్టదైవం శ్రీరాముని పేరిట 'రామనగర్' అని నామకరణం చేశారు. అంతే అక్కడే మకాం వేశారు. (మరో వైపు చీరాలలో కొంతభాగం ప్రజలు జాండ్రపేట దాటిన తరువాత వేటపాలెం సమీపంలో పాకలు వేసుకున్నారు. దానిని కూడా రామనగర్ అనే పిలుస్తారు.)

అక్కడి ప్రజల అవసరాల కోసం దుగ్గిరాల వారు నడుం బిగించారు. ఊరు ఊరు తిరిగి స్వాతంత్ర్య కాంక్ష రగిలే అద్భుతమైన ప్రసంగాలను చేశారు. వాటి ద్వారా సేకరించిన సొమ్మును రామనగర్‌లో నివాసముంటున్న ప్రజలకు అందించేవారు. ఈ క్రమంలో దీక్షలో ఉన్న వారిని తిరిగి గ్రామాల్లోకి పంపించడం ప్రభుత్వాధికారులకి కనాకష్టంగా మారింది. అంతా అహింసాయుత ఉద్యమం. ఎన్ని రకాలుగా బెదిరించినా ఉద్యమ వీరులు కదల్లేదు, మెదల్లేదు. ఆకలేసినా బాధకలిగినా పంటి బిగువనే కాలం వెళ్ళదీశారు. దుగ్గిరాలవారు సభలకు వెళ్ళేటప్పుడు వీరందరికీ అండగా దుగ్గిరాలవారికి నమ్మినబంటుగా పేరొందిన గౌస్‌బేగ్ ఉండేవారు. గ్రామాల్లో దొంగలు పడ్డారు. అన్నీ దోచుకునిపోయారు. అయినా చలించక మొక్కవోని దీక్షను విజయవంతంగా నెలలు నెలలు కొనసాగించారు చీరాల పేరాల వాసులు. ఉద్యమాన్ని నీరుగార్చడానికి శతవిధాలా ప్రయత్నం చేశారు అధికారులు. దుగ్గిరాలయ్యను బరంపురం సమావేశంలో ప్రసంగించి తిరిగి వస్తుండగా అరెస్ట్ చేసి, తిరుచినాపల్లి జైలుకి తరలించారు.

ఉద్యమాన్ని ఉధ్రుతలూగిస్తూ, పన్నులు చెల్లించే ప్రసక్తే లేదని అడ్డం తిరిగిన, అందరినీ ప్రతిరోజూ చైతన్యపరుస్తున్న మరో 12 మందిని కూడా అరెస్ట్ చేశారు పోలీసులు. అందులో ఒక మహిళ ఉండటం విశేషం. ఆమె పేరు రావూరి అలివేలు మంగతాయారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో తొలి రాజకీయ మహిళా ఖైదీ ఆమె. (నేటి తరానికి, మహిళా ఉద్యమకారులకి సైతం ఆమె గురించి ఏమీ తెలియకపోవడం విచారించవలసిన సంగతి!). పన్నెండుమందిని బాపట్ల కోర్టుకి తరలిస్తుంటే దారి పొడవునా హారతులు, నీరాజనాలు పట్టారు. చీరాల పేరాల ఉద్యమంలో అది మరో మహత్తర ఘట్టం. ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారిని అరెస్టు చేయడంతో ఏర్పడిన నాయకత్వ లేమిని అదనుగా తీసుకొని, రామనగర్‌ని ఖాళీ చేయించారు పోలీసులు. **అలా 11 నెలలు ఏకబిగిన ఒకే ప్రాంతంలో కొనసాగిన మొదటి అహింసాయుత, సహాయ నిరాకరణ ఉద్యమంగా (చీరాల పేరాల టాక్స్ యాజిటేషన్) చీరాల-పేరాల ఉద్యమం చరిత్ర పుటలకెక్కింది.**

బ్రిటీషు ప్రభుత్వపు వెన్ను విరిచిన ప్రజా ఉద్యమం సహాయ నిరాకరణోద్యమం 1920 సెప్టెంబరు 4 న మొదలై 1922 ఫిబ్రవరిలో ముగిసింది. 1919 మార్చి 21 నాటి రౌలట్ చట్టానికి, 1919 ఏప్రిల్ 13 న జరిగిన జలియన్‌వాలా బాగ్ ఊచకోతకూ నిరసనగా సంపూర్ణ స్వరాజ్యం కోసం మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెస్ బ్రిటీషు ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చెయ్యాలని పిలుపునివ్వడంతో ఉద్యమానికి బీజం పడింది. ఇది గాంధీ పెద్ద ఎత్తున ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన మొట్టమొదటి ఉద్యమంగా పేరొందింది. సహాయ నిరాకరణ మొదలుపెట్టి విజయం వైపు అడుగులు వేయించి, గాంధీ ఆలోచనకు ఊతమిచ్చిన ఉద్యమం దుగ్గిరాల నేతృత్వంలోని చీరాల పేరాల ఉద్యమం. ఇది 21 ఏప్రిల్ 1921 న ప్రారంభమై మార్చి 1922 వరకూ కొనసాగింది. అ

---

10 వ పుట తరువాయి...

వచ్చింది. దేశం మొత్తం మీద బోధన భాషా చిత్రాన్ని పరిశీలించింది. బోధన శాస్త్రాలు, విద్యావేత్తలను సంప్రదించింది. ఫలితార్థంగా ప్రాథమిక విద్యా స్థాయిలో విధిగా మాతృభాషే ఉండాలని చెప్పింది. ఇంటి భాష, ప్రాంతీయ భాష, మాతృభాషల స్థానాలను బేరీజు కట్టి మాతృభాషలోనే విద్యాబోధన ఉండాలని .. ఇంకా చెప్పాలంటే.. అన్ని మాతృభాషలకు పెద్ద పీట వేసింది. దేశం అవసరాలను, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ సూచన చేసింది. అర్థం కావడం, ఆలోచన చేయడం, ప్రశ్నించడం, సృజనాత్మకంగా దర్శించడం, ప్రదర్శించడం, అనుభూతి చెందడం అన్నీ కావాలని ...ఇవే 21వ శతాబ్దపు నైపుణ్యానికి పునాదులు.. ఈ పునాదుల మీదే భావిభారత మహాసౌధం నిలబడుతుంది అని నూ.జా.వి.వి చెప్తోంది.

మన పిల్లలకు ఇప్పటికీ పాఠం గుర్తు పెట్టుకోవడం, తిరిగి కక్కేయడం, అన్నో ఇన్నో మార్కులు సంపాదించడం లాంటి పాత విద్యావిధానం కావాలా? ఆలోచన, అవగాహన, ప్రశ్నించడం, సృజించడం లాంటి నవతరం శక్తి సామర్థ్యాలు కావాలా? ఇది కావాలంటే తల్లి కడుపులో పడిననాటి నుంచి మనతో కలిసి నడుస్తున్న భాషను- మాతృభాషను- వదులుకో రాదన్నది శాస్త్రీయ, హేతుబద్ధ సూచన.

ఇది చారిత్రక సన్నివేశం. ముందు రోజులకు అప్పటి ప్రపంచపు సవాళ్లకు పిల్లలను సంసిద్ధం చేయాలి. దానికి మాతృభాషే మూలాధారం. ఏలుకొనేవారికి ఈ మాత్రం అర్థమైతే చాలు!

వ్యాసకర్త సంయుక్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో భాష, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా, నల్గొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు

సి.వి. క్రిష్ణయ్య
93965 14554



ఎవరు తెలివి గలవారు?! 7

జరిగిన కథ:
కోతి సహాయంతో అడవిలో బడి పెట్టుకొన్నారు జంతు పక్షిజనాలు. అడవిలో పిల్లలకు అనేక మానసిక శారీరక అనారోగ్య సమస్యలు వచ్చాయి. తొలకరి వానలు కురవడంతో అడవిలో మొలకల పండుగ వచ్చింది. ఈ పండుగ సందర్భంగా అడవిలో ఆనందంగా ఆటల ప్రదర్శనలు జరిగాయి.

పరీక్షలు-మార్కులు

బడిపెట్టి నాలుగు నెలలయింది. పెంపుడుకోతి పిల్లలకు పరీక్షలు పెట్టాలి సిద్ధంగా ఉండండి అని ఉపాధ్యాయులకు చెప్పింది. ఉపాధ్యాయులు పిల్లలకు వారంరోజుల్లో పరీక్షలుంటాయని చెప్పారు. బాగా చదువుకొని రావాలని, లేకపోతే మార్కులు రావని, మార్కులు రాకపోతే తాట వలుస్తామని భయపెట్టారు. టీచర్లకు కూడా భయం పట్టుకొంది. తాము చెప్పేవిషయంలో మార్కులు రాకపోతే తాము బాగా చెప్పలేదనే నిందమోయాలని భావించి, పిల్లల మీద మరింత వత్తిడి పెంచారు. కొందరు ఉపాధ్యాయులు పరీక్షల్లో వచ్చే ప్రశ్నల్ని పిల్లలకు తెలియజేసి వీటిని నేర్చుకొని రమ్మని చెప్పారు.

పిల్లల్లో హడావుడి మొదలయింది. కదలకుండా ఇంట్లో కూర్చుని చదువుకోవడం మొదలుపెట్టారు. అటూ ఇటూ తిరుగుతూ చదివిందే చదువుతూ ఆందోళన పడుతున్నారు. తల్లిదండ్రులు ఏదైనా పనిచెపితే మాకు పరీక్షలంటూ కోప్పడుతున్నారు. ఎంత చదివినా గుర్తుండడం లేదని తల్లిదండ్రుల మీద విసుక్కుంటున్నారు. ఈ పరీక్షలేమిటో అడవి జనాలకు తెలియదు. కాని మనుషుల దగ్గర పెరిగిన పెంపుడు జంతువులకు పెంపుడు పక్షులకు తెలుసు. పెంపుడుపిల్లి, పెంపుడు కుక్క మిగిలిన తల్లితండ్రులను పిల్చి అందరినీ తీసుకుని బడికివచ్చారు.

బడిలో హెడ్మాష్టర్ని టీచర్లను ఈ పరీక్షలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు పిల్లలు ఏమి చదువుకొన్నారో ఎవరు చదువుతున్నారో ఎవరు చదవడం లేదో, ఎవరు తెలివిగలవారో, తెలియాలి గదా! అని జవాబిచ్చారు.

ఈ మాటలు విన్న పెంపుడు కుక్కకు కోపం వచ్చింది. "ఉపాధ్యాయులు నిరంతరం పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. పిల్లలతో కలిసి ఉంటున్నారు. పిల్లల్ని ప్రశ్నిస్తున్నారు. పిల్లలు చదువుతున్నారో లేదో ఎవరు ఎలాంటివారో ఉపాధ్యాయులకు తెలియదా? అని కుక్క ప్రశ్నించింది. హెడ్మాష్టరు ఉపాధ్యాయులవైపు చూసాడు. ఉపాధ్యాయులు ఏమి చెప్పాలో తెలియక హెడ్మాష్టరు వైపు అయోమయంగా చూసారు. హెడ్మాష్టరు గారు నీళ్లు నములుతూ, ఎలా తెలుస్తుంది.. పరీక్షలు పెట్టి మార్కులేస్తే గదా తెలిసేది అని జవాబిచ్చారు.

ముసలి ఆవు తల అడ్డంగా ఊపి "ఈ పరీక్షలతో వచ్చే అనర్థాలేమిటో అవి ఎంత తీవ్రంగా ఉంటాయో మీకు తెలియదు. మనుషుల దగ్గర పెరిగిన మాకు తెలుసు. గతంలో కోతి చెప్పిందని పిల్లల మధ్య ఆటల పోటీలు పెట్టబోయారు. పోటీలు ఎంత ప్రమాదమో మీకు వివరించాను. ఈ పరీక్షలు కూడా పోటీల వంటివే. వీటివల్ల ఎవరు తెలివిగలవారో ఎవరు తెలివితక్కువవారో తెలుసుకోలేరు. ఎవరు ఎంత గుర్తుపెట్టుకొన్నారో తెలుస్తుంది. పక్కవాళ్లను చూసి రాస్తారు. పరీక్షల్లో రాబోయే ప్రశ్నలు ముందుగానే తెలుసుకోడానికి మోసాలకు పాల్పడతారు. ఉపాధ్యాయులు కూడా వత్తిడికి గురి అవుతారు. పరీక్షల్లో ఇచ్చే ప్రశ్నలు చెప్పేస్తారు. తమ పిల్లలకు తక్కువ మార్కులు రాకూడదని తల్లిదండ్రులు పిల్లల్ని బాగా చదవమని వత్తిడికి, భయానికి గురి చేస్తారు. ఈ భయం వల్ల ఎంత చదివినా అర్థంగాదు. గుర్తు ఉండదు. తెలివి గలవారైనప్పటికీ పరీక్షల్లో రాయలేరు. మార్కులు సరిగా రావు. తనకంటే ఎందులోనూ చురుకుగా లేని వారికి మార్కులు ఎక్కువ వస్తాయి. అవమానం కల్గుతుంది. సిగ్గుపడతారు. చదువు, బడి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరిమీదా అసంతృప్తి కల్గుతుంది. కోపం వస్తుంది. చివరకు ఈ పరీక్షలను అందరూ కలిసి ఒక నాటకంగా తయారు చేస్తారు! అని చెప్పింది ఆవు.

నాటకమా? అదెలా? అంటూ ప్రశ్నించారు హెడ్మాష్టరుగారు. ఈ ప్రపంచంలో ఎవరూ తెలివి తక్కువ వారు కాదు. తెలివిలేనివారు అనిపించుకోడానికి ఇష్టపడరు. ఎవరికి ఎంత వరకు తెలుసో ఎవరు తెలివితక్కువ వారో పరీక్షలు పెట్టి మార్కులు వేసి తేల్చేస్తామంటే ఎవరూ ఒప్పుకోరు. మార్కులు ఎక్కువ తెచ్చుకొనే మార్గాలు అన్వేషిస్తారు. హెడ్మాష్టరు తమ బడిలో పిల్లలకు ఎలాగైనా మంచి మార్కులు వస్తే చాలనుకొంటారు. టీచర్లు తమ సబ్జక్టులో బాగా వస్తేచాలనుకొంటారు. పిల్లలు ఏదోవిధంగా మార్కులు సంపాదించుకొంటారు. ధర్మమార్గంలో నడిచే విధంగా ఉండాలని కోరుకోరు. పరీక్షల్లో మార్కులు అవినీతి మార్గంలో సంపాదించడం తప్పు అనే ఆలోచనే రాదు. అందుకే చివరకు పరీక్షలను ఒక నాటకంగా మార్చుతారు. అందరూ కలిసి తమను తాము మోసం చేసుకొంటారు. పిల్లల్ని దొంగలుగా బుద్ధిహీనులుగా



మారుస్తారు. మానవుల్లో ఉండే విశిష్టగుణం ఆలోచించడం. హేతుబద్ధంగా ఆలోచించడం. ఈ ఆలోచనలే ఆగిపోయినవి ఈ పరీక్షలవల్లా, ఈ చదువుల వల్లా. విద్యార్థులకు ఎందుకూ పనికిరాని సర్టిఫికేట్లు ఇచ్చిపంపిస్తారు. వాటితో ఎలా బ్రతకాలో తెలియదు. ఇలాంటి చదువులా మనం కోరుకున్నది? అని అడిగింది ఆవు.

ఆయితే పరీక్షలు ఏ పద్ధతిలోనూ మంచిదికాదా? పద్ధతిగా నీతిగా పెడితే సరిపోతుంది కదా అని ప్రశ్నించారు ఉపాధ్యాయులు. మొదట పద్ధతిగానే మొదలవుతాయి. తరగతిలో వంద మంది ఉంటే ఒకడికి తొంభై మార్కులు వస్తాయి. మిగిలిన వాళ్లంతా వాడికంటే తెలివి తక్కువ వారని అర్థమేగాదా! ఆటల మాదిరే ఒక్కడిని గెలిపించి తొంభైతొమ్మిదిమందిని ఓడించడం అర్థం లేని పని. పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చినవారు, పరీక్షలు తప్పినవారు, బడికి వెళ్లనివాళ్లు, ఎంతో మంది గొప్ప కళాకారులుగా, శాస్త్రవేత్తలుగా, ప్రముఖులైన వ్యక్తులుగా ఎదుగుతున్నారు. ఎన్నో రోజులు చదివిన చదువు ఒక్కరోజులో ఒకటి రెండు గంటల్లో పెట్టే పరీక్షలతో తెలివి తేటలను కొలవలేము. పిల్లల్ని అంచనా వేయాలంటే ప్రతినిత్యం వారితో మాట్లాడేటప్పుడు, ప్రశ్నించినప్పుడు, వారిని గమనిస్తూ అంచనా వేయాలి. ఉపాధ్యాయులు పిల్లల్ని నిరంతరం అంటిపెట్టుకొని ఉండాలి. చదువుల్లోలేని అనేక ఇతర కార్యక్రమాల్లో పిల్లలు ఎలా పాల్గొంటున్నారో గమనించాలి. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి వ్యక్తిత్వానికి, సమయస్ఫూర్తికి, సేవా గుణానికి, సమస్యా పరిష్కారానికి అన్నిటికీ మార్కులు వెయ్యాలి. ఈ మార్కులన్నీ పిల్లలకు చెప్పకూడదు. అని వివరించింది ఆవు.

అయితే పరీక్షలు మార్కులు లేకపోతే పిల్లలకు భయం ఉండదు గదా. చదువరు గదా. బాగా చదివేవాళ్లు. చదవనివాళ్లు అందరూ ఒక్కటే అయిపోతారు గదా– అని ప్రశ్నించారు ఉపాధ్యాయులు. ఈ ప్రశ్నలతో ఆవుకు కోపం వచ్చింది. మీరు ఇప్పటి వరకు నేను చెప్పిన విషయాలు అర్థం చేసుకోలేదు. పిల్లలు భయం వల్లనే చదువడం లేదు. చదువనేది భయంతో నేర్చుకొనేది కాదు. తెలివి బలవంతంగా సంపాదించుకోలేరు. అది ఆసక్తిగా ఆనందంగా జరగాలి. మీరు చెప్పే చదువుల్లో ఆనందం లేదు. అది ఆసక్తిగా ఆనందంగా జరగాలి. ఈ చదువులో ఆనందం లేదుగాబట్టి, భయం ఉంటుందిగాబట్టి, బలవంతం ఉందిగాబట్టి దీనికి పిల్లలు వ్యతిరేకంగా స్పందిస్తున్నారు. అంటే నేర్చుకోవడాన్ని ప్రతిఘటిస్తున్నారు. బడిలో లేని వారికి ఎవరు పరీక్షలు పెట్టి మార్కులు వేస్తున్నారు? జీవితంలో ఎవరికివారే పరీక్ష పెట్టుకొంటారు. కాబట్టి పరీక్షలు నీతిగా జరిపినా ఈ పరీక్షలు పరీక్షలే గాదు. పరీక్షల వల్ల అనర్థాలే గాని మంచి జరగదు. అని ఆవు చెప్పింది.

పెంపుడు కుక్క కల్పించుకొన్నది ఇలా అన్నది “మా యజమానికి ఒక కొడుకు ఉన్నాడు. అతనికి లెక్కలంటే బాగా ఇష్టం. మా యజమాని కొడుకుని డాక్టర్ని చేయాలనుకొన్నాడు. సైన్సు చదవమన్నాడు. చాలా రోజులు తండ్రీ కొడుకుల మధ్య వాదులాట జరిగింది. చివరకు కొడుకు ఇంటి నుండి పారిపోయాడు. మా యజమాని అతని భార్య చాలా రోజులు దిగులుతో మంచం పట్టారు. కొడుకు గొప్పచదువులు చదివి పేరుప్రఖ్యాతులు సంపాదించాడు. అతని గొప్పతనాన్ని పత్రికల్లో చూసి తాము చేసిన తప్పు తెలుసుకొని కొడుకు దగ్గరకు వెళ్లి తమను క్షమించమని ఇంటికి రమ్మని పిలిచారు. అయినా ఆ కొడుకు ఇంటికి రాలేదు. తల్లిదండ్రులను వ్యతిరేకించి ఇంటి నుండి పారిపోయి తమకు ఇష్టమైన చదువులు చదివే విద్యార్థుల కోసం ఆయన కృషి చేస్తున్నాడని తెలిసింది. ఈ పరీక్షల వల్ల పిల్లలు ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. మన గోమాత చెప్పినట్లు పరీక్షలు పెట్టకండి అని చెప్పింది కుక్క.

మన బడిలో ఇక పరీక్షలు ఉండవని హెడ్మాష్టరు గారు ప్రకటించారు. ఈ విషయం తెలుసుకొన్న పిల్లలు ఆనందంగా ఎగిరి గంతులు వేసారు.

చదువులు భయపెట్టడానికి కాదు. చదువులు ధైర్యం కోసం... జ్ఞానం కోసం...

తరువాయి సంచికలో: శిక్షలు–బహుమానాలు

అమ్మనుడిలో విద్యాబోధనతోనే ఆర్థిక ప్రగతి–
ప్రజల భాషలో పాలనతోనే ప్రజాస్వామ్య సుస్థిరత

ఆచార్య వెలమల సిమ్మన్న
94406 41617

వ్యాకరణం : అధ్యయనం - బోధన

"వ్యాక్రియంతే శబ్దాః అనేన ఇతి వ్యాకరణమ్"

శబ్దాల పుట్టుకను, ఏర్పాటును వివరించి చెప్పుతుంది కాబట్టి వ్యాకరణం అనేపేరు వచ్చింది -పతంజలి

భాష:

సృష్టిలో అన్ని జీవరాసుల్లోనూ మానవుడు గొప్పవాడు. ప్రపంచంలో ఏ ఇతర జీవికి లేని గొప్పతనం మానవుడికి వుంది. ఒక్క మానవుని మాత్రమే వరించిన వరం భాష. వాగ్యంత్రంలో లోపం వున్న మానవులు తప్ప, అందరికీ భాషించే శక్తి వుంటుంది. భాషకి మూలం ధ్వని. ఇతర ప్రాణులకు కూడా ధ్వనులు చేసే శక్తి వున్నా ఆ ధ్వనులు మానవుడు చేసే ధ్వనులతో విభేదిస్తాయి. ఇతర ప్రాణులు చేసే ధ్వనులు పరిమితం. మానవుడు చేసే ధ్వనులు అపరిమితం. పైగా ఎంతో వైవిధ్యంతో వుంటాయి.

ప్రతి మానవుడు ఏదో ఒక భాషను లేదా పలు భాషల్ని మాట్లాడతాడు. ప్రతి మనిషికి భాష వచ్చి, మాట్లాడి, అర్థం చేసుకొనే శక్తి సహజంగా వున్నా, పుట్టిన వెంటనే భాష రాదు. మానవుడు పుట్టినది మొదలు, అవ్యక్తమైన ధ్వనులు చేస్తూ పెరుగుతున్న కొద్దీ ఇంట్లో, పరిసరాల్లోని వ్యక్తులు చేసే ధ్వనులు వింటూ, వాటి భావాల్ని గ్రహిస్తూ, ఆ ధ్వనుల్ని అనుకరిస్తూ మాట్లాడటాన్ని నేరుస్తాడు. వయస్సు పెరిగే కొద్దీ భావాల్ని ఇతరులకు చెప్పి, ఇతరులు వ్యక్తీకరించిన భావాల్ని అర్థం చేసుకోగల శక్తిని పొందుతాడు. **అందుకే భాష అభ్యాసం వల్ల అలవడుతుంది. అంతేకాదు అభ్యాసం ద్వారానే బలపడుతుంది కూడా.**

భాషాశాస్త్రవేత్తలు భాషను వారి వారి దృక్కోణాల నుండి వివిధ రకాలుగా నిర్వచించారు. ఆ నిర్వచనాలు అన్నీ ఇంచు మించు భాషా ప్రయోజనాలు గూర్చి చెబుతున్నట్లు వుంటాయి. ఏ ఒక్క నిర్వచనమూ సమగ్రం కాకపోయినా, అవి భాషాస్వరూపాల్నీ లక్షణాన్నీ అర్థం చేసుకోవడానికి ఎంతగానో తోడ్పడతాయి. భాష నిత్యజీవితంలో ఉపయోగపడే శబ్ద జాలంతో మానవుడికి అలవడుతుంది. మానవుడికి భాష శరీరం అయితే, భావం ఆత్మ వంటిది. అందువల్ల భాషను 'భావ వాహిక' అని అంటారు.

వ్యాకరణం:

భాష ఏర్పడిన తర్వాతే వ్యాకరణం ఏర్పడుతుంది. భాష ప్రవర్తించే నియమాలే వ్యాకరణ కర్తలు గమనించి వ్యాకరణం రాస్తారు. ఇది భాషను గమనించకుండా ఎవరూ శాసిస్తూ రాసేది కాదు. ప్రతి భాషా ఒక నిర్దిష్ట వ్యవస్థను కలిగివుంటుంది. ప్రతి భాష కొన్ని విధి విధానాలతో ప్రవర్తిల్లుతూ వుంటుంది. వాటిని గమనించి రాసిన అంశాలే వ్యాకరణం. భాషలో కాలానుక్రమంలో కొన్ని మార్పులు కూడా వస్తుంటాయి. వాటిని వ్యాకరణంలో కలుపుకొంటూ పోవాలి. అంతేకాని ఒకసారి వ్యాకరణం రాసి దాని ప్రకారమే భాష శాశ్వతంగా నడవాలనుకోవడం అజ్ఞానం. తెలుగు బోధించే అధ్యాపకుడికి తప్పని సరిగా వ్యాకరణం తెలిసి వుండాలి.

భాషాశాస్త్రం:

భాషాశాస్త్రం స్వరూపాన్ని బాగా అర్థం చేసుకోవాలంటే దానికి ఇతర శాస్త్రాలతో సంబంధం కూడా తప్పనిసరిగా తెలుసుకోవాలి. ఒక సమాజంలో వున్న వ్యక్తులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధాలు కలిగి వుంటారు. అదే విధంగా సమాజంలో ఉత్పన్నమైన భాష, సమాజ సంబంధమైన ఇతర శాస్త్రాలతో సంబంధాలు కలిగివుంటుందన్న మాట.

భాషాశాస్త్రానికి పుట్టినిల్లు భారతదేశం. భాషను అభివర్ణించే శాస్త్రాన్ని 'భాషాశాస్త్రం' అంటారు. భాష పరిణామ శీలం కలిగినటువంటిది. వ్యవహారంలో సజీవంగా వుంటుంది. ఇలాంటి దీని స్వరూప స్వభావాల్ని పూర్వాభిప్రాయాల మీద ఆధారపడకుండా, కేవలం పరిశీలనే ముఖ్యంగా నిర్ణయించే శాస్త్రాన్ని 'భాషాశాస్త్రం' అని అంటారు.

వ్యాకరణం-భాషాశాస్త్రం :

భాషను విశ్లేషించి ప్రదర్శించేది వ్యాకరణం. విశేషంగా వ్యుత్పత్తిని కలిగించేది వ్యాకరణం. భాషలో వర్ణ నిర్మాణం, పదనిర్మాణం, వాక్యనిర్మాణం లాంటి వివిధ స్థాయిలో వున్న నియమాల్ని తెలిపేది వ్యాకరణం.

"లక్ష్య లక్షణే వ్యాకరణమ్" అని పతంజలి నిర్దేశం. లక్ష్యాన్ని సేకరించుకొని వాటిని వేరు వేరు వర్గాలుగా వర్గీకరించి, వాని లక్షణాల్ని నిర్ధారించుటయే వ్యాకరణం కర్తవ్యం. భాషాశాస్త్రానికి ఇదే ప్రధాన కర్తవ్యం. అంటే భాషాశాస్త్రానికి వ్యాకరణ శాస్త్రానికి ముడి పదార్థం ఒక్కటే. రెండు శాస్త్రాలూ భాషను ఆశ్రయించి వుంటాయి. ఈ రెండింటికి సామ్యం వుంది. ఈ సామ్యాన్ని పురస్కరించుకొనే, భాషాశాస్త్రవేత్తలు భాషాశాస్త్రాన్ని వర్ణనాత్మక వ్యాకరణం, చారిత్రక వ్యాకరణం, తులనాత్మక వ్యాకరణం అని మూడు విధాలుగా వర్గీకరించడం జరిగింది. మొత్తం సారాంశం ఏమంటే వ్యాకరణ శాస్త్రానికీ భాషాశాస్త్రానికీ విడదీయరాని పరస్పర సంబంధం వుంది.

ఒక భాషకు వున్న విధి విధానాల్ని క్షుణ్ణంగా పరిశీలించి వాటి నన్నింటిని విపులంగా వివరిస్తూ రాసేదే వ్యాకరణం. గ్రాంధిక భాషలో వున్న విధివిధానాల్ని చక్కగా విశ్లేషించి పరవస్తు చిన్నయసూరి 'బాలవ్యాకరణం' రాశారు. ఇది సంప్రదాయ వ్యాకరణం. దీన్నే 'వర్ణనాత్మక వ్యాకరణం' అని కూడా అంటారు.

వ్యాకరణం- అధ్యయనం- బోధన

వ్యాకరణం ప్రత్యేకాంశంగా బోధించవలసిన అవసరం లేదని కొందరు అజ్ఞానుల వాదన. ఈ వాదన సరైనది కాదు. సూత్రాన్ని విద్యార్థులు చిలుక పలుకులవలె నేర్చుకొంటున్నారు. ఒక రకంగా

వ్యాకరణం అర్థం కావడం లేదని ఎక్కువ మంది విద్యార్థులు వాపోతున్నారు.
నా ఉద్దేశంలో విద్యార్థికి వ్యాకరణం అర్థం కాకపోవడానికి ప్రధాన కారణం అధ్యాపకుడు మాత్రమే.
మనం చెప్పే వ్యాకరణం విద్యార్థికి అర్థం కాలేదంటే మనం వ్యాకరణం బోధించడానికి పనికి రామన్నమాట.
వ్యాకరణాన్ని కావ్యంలాగ, ప్రబంధంలాగ, పురాణంలాగ, ఎక్కువ మంది అధ్యాపకులు పాఠం చెపుతున్నారు–
ఈ పద్ధతి నూటికి నూరుపాళ్ళు తప్పు. బోధనలో పెనుమార్పులు రావాలి.

చెప్పాలంటే బట్టీ పడుతున్నారు. సూత్రంలో ఏముందో తెలియక పోయినా 'రుక్కు' పెడుతున్నారు. ఇది మంచిపద్ధతి కాదు. ఆ సూత్రంలోని అర్థాన్ని ప్రత్యేకాంశాల్ని విద్యార్థులు చెప్పలేకపోతున్నారు. ముఖ్యంగా ఇచ్చిన ఉదాహరణాలు సూత్రానికి ఏవిధంగా సమన్వయం జరుగుతుందో గ్రహించలేక పోతున్నారు. ఇది విచారించదగ్గ విషయం. దీనికి కారణం ఉపాధ్యాయుడు కూడా. అధ్యాపకుడు సరైన బోధనా పద్ధతుల్ని అవలింబించక పోవడం వల్లే వ్యాకరణం విద్యార్థులకు అర్థం కావడం లేదు. ఉపాధ్యాయుడు భాషాబోధనలో భాగంగా వ్యాకరణం కూడా బోధించవలసి వుంటుంది. దానికి బోధనా పద్ధతులు వుంటాయి. అధ్యాపకులు తప్పనిసరిగా వ్యాకరణబోధనా పద్ధతుల్ని అనుసరించి బోధించాలి. వ్యాకరణ అధ్యయన విధానం తెలుసుకోవాలి.

పూర్వం అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ 'బాలవ్యాకరణం' 'ప్రౌఢ వ్యాకరణం' రెండూ సామాన్య పేపర్‌గా వుండేవి. అంటే జనరల్ పేపర్‌గా వుండేవి. క్రమక్రమంగా 'బాలవ్యాకరణం' ఒక్కటే వుంది. తర్వాత 'బాలవ్యాకరణం'లోని కొన్ని పరిచ్ఛేదాలకు మాత్రమే పరిమితమైంది. కొన్ని విశ్వవిద్యాలయాల్లో జనరల్ పేపర్‌గా కాక, ఆప్షనల్ పేపర్‌గావుంది. కొన్ని విశ్వవిద్యాలయాల్లో ఇతర సబ్జెక్టుతో కలిసి వ్యాకరణంవుంది. కొన్ని విశ్వవిద్యాలయాల్లో పూర్తిగా తీసేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యాకరణం చెప్పలేక సిలబస్‌లో పేపర్ లేకుండా చేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య. విశ్వవిద్యాలయాల్లో ప్రస్తుతం వ్యాకరణం పరిస్థితి, గతి– ఇది. ఒకటి రెండు విశ్వవిద్యాలయాల్లో బాల, ప్రౌఢ వ్యాకరణాలు రెండూ పూర్తిగా వున్నాయి. సంతోషం.

వ్యాకరణం అర్థం కావడం లేదని ఎక్కువ మంది విద్యార్థులు వాపోతున్నారు. నా ఉద్దేశంలో విద్యార్థికి వ్యాకరణం అర్థం కాకపోవడానికి ప్రధాన కారణం అధ్యాపకుడు మాత్రమే. మనం చెప్పేది కారణం విద్యార్థికి అర్థం కాలేదంటే– మనం వ్యాకరణం బోధించడానికి పనికి రామన్నమాట.

వ్యాకరణాన్ని కావ్యంలాగ, ప్రబంధంలాగ పురాణంలాగ, ఎక్కువ మంది అధ్యాపకులు పాఠం చెపుతున్నారు– ఈ పద్ధతి నూటికి నూరుపాళ్ళు తప్పు. బోధనలో పెనుమార్పులు రావాలి.

మా గురువులు, వాళ్ళ గురువులు, ఇలాగే పాఠాలు చెప్పారు కాబట్టి మేము కూడా ఇలాగే పాఠాలు చెప్పుతామని అజ్ఞానంగా కొందరు వాదిస్తున్నారు. వ్యాకరణం 'శాస్త్రం'. శాస్త్ర ప్రకారం వ్యాకరణం చెప్పాలి. ఆధ్యాపకులు వ్యాకరణం చెప్పే పద్ధతి మార్చుకోవాలి.

ఎన్నో సంవత్సరాల నుంచి వ్యాకరణాన్ని 'శాస్త్రం'లా ఎక్కువ మంది అధ్యాపకులు పాఠం చెప్పడం లేదు. వ్యాకరణం శాస్త్రంలా చెప్పాలనే అవగాహన ఎక్కువ మంది అధ్యాపకుల్లో లేదు. కావ్యగానంలా, పురాణ పఠనంలా, పద్యం తర్వాతి పద్యం చదివి, వివరించినట్లు, సూత్రం తర్వాత సూత్రం చదివి చెప్పకూడదు. ఆ పద్ధతి మంచిది కాదు. ప్రతి పరిచ్ఛేదాన్ని విషయానుగుణంగా వర్గీకరిస్తూ ఎక్కడికక్కడ విశ్లేషణాత్మకంగా, పరిశీలనాత్మకంగా అవసరమైతే విమర్శనాత్మకంగా, తులనాత్మకంగా, విశదీకరించి, విడమరిచి మరీ చెప్పాలి. అప్పుడే విద్యార్థికి అర్థమవుతుంది.

సూత్రంలో ఏమివుందో, సూత్రప్రయోజనం ఏమిటో? దాని పరమార్థం ఏమిటో? చిన్నయసూరి ఆ సూత్రం అక్కడే ఎందుకు చెప్పాడో అన్నీ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విపులంగా అధ్యాపకుడు చెప్పాలి.

బి.ఏ.లో ప్రత్యేకంగా తెలుగు చదువుకొన్నవారికే వ్యాకరణం అర్థమవుతుంది, జనరల్ తెలుగు చదువుకొన్న వాళ్ళకు వ్యాకరణం అర్థం కాదని బుర్రలేని కొంత మంది అధ్యాపకులు వాదిస్తున్నారు. ప్రతిభ అధ్యాపకుడికి వుండాలి. విద్యార్థికికాదు. ఇద్దరికీ వుంటే ఇంకా మంచిది. విద్యార్థికి వ్యాకరణం రాదు కాబట్టి క్లాసుకి వస్తాడు. అధ్యాపకుడికి వ్యాకరణం వచ్చు కాబట్టి బోధించడానికి తరగతి గదికి వెళతాడు. నేర్చుకోవడానికి విద్యార్థి వస్తాడు. బోధించడానికి అధ్యాపకుడు తరగతి గదికి వెళతాడు. ఇద్దరికీ వున్న ప్రధాన భేదం ఇది. ఈ విషయాన్ని ఆధ్యాపకుడు గమనించకపోతే ఎలా? అధ్యాపకుని వాదనలో పసలేదు. పాఠం చెప్పలేని అధ్యాపకుని అజ్ఞానంతో కూడుకొన్న వాదన ఇది.

అసలు విషయం ఏమంటే అధ్యాపకుడు విద్యార్థికి అర్థమయ్యే విధంగా బోధించాలి కానీ, స్పెషల్ తెలుగు చదివాడా, జనరల్ తెలుగు చదివాడా, అని అధ్యాపకుడు వితండ వాదం చేయకూడదు. అధ్యాపకుడు బాగా అర్థమయ్యే విధంగా పాఠం చెప్పడమే తన పని. పాఠం చెప్పలేని అధ్యాపకుడు ఇలాంటి కుంటి సాకులు, పనికిమాలిన వాదనలు చేస్తాడు. ఆ వాదనలకు విలువ లేదు.

అధ్యాపకులు కొంతమంది మాకు వ్యాకరణంలో 90% మార్కులు వచ్చాయి. మా గురువులకు 100% మార్కులు వచ్చాయని గుడ్డిగా వాదిస్తున్నారు. ఇక్కడ మనం చర్చించవలసింది మార్కులు గురించి కాదు. అధ్యాపకుడు వ్యాకరణాన్ని 'శాస్త్రం'లా బోధించాడా? లేదా? ఇక్కడ మనం వ్యాకరణం బోధించే పద్ధతి గూర్చి మాటలాడుతున్నాం. మార్కుల గూర్చి కాదు. ఆ విషయాన్ని అధ్యాపకులు గమనించాలి. డొంక తిరుగుడుగా మాటలాడకూడదు. అడ్డదిడ్డంగా వాదిస్తే అటు విద్యార్థికీ ఇటు అధ్యాపకుడికీ ఇద్దరికీ ప్రయోజనం వుండదు. ఎవ్వరికీ పనికిరాని విద్య.

మరికొంత మంది అధ్యాపకుల వాదన మరోలా వుంది. మేము బాలవ్యాకరణాన్ని చివరి నుండి మొదటి సూత్రం వరకు తిరగేసి

అప్పచెప్పగలమని డాంబికాలు పలికి మరీ వాదిస్తున్నారు. తలతిక్క వాదన అంటే ఇదే. ఇక్కడ మొదటి సూత్రం నుంచి చెప్తూతున్నావా? చివరి సూత్రం నుంచి చెప్తుతున్నావా? అనేది చర్చకాదు. అధ్యాపకుడు వ్యాకరణాన్ని విద్యార్థికి అర్థమయ్యే విధంగా శాస్త్ర పద్ధతిలో చెప్తూతున్నాడా? లేదా? అనేది ప్రశ్న. సూత్రం కంఠస్థం చేసి ఒప్ప చెప్పడం, వల్లె వేయడం ముఖ్యమైన విషయంకాదు. వ్యాకరణం అధ్యయన విధానం కూడా అదికాదు. సూత్రంలో ఏంవుందో విద్యార్థికి విడమరచి చెప్పాలి.

వ్యాకరణం పాఠం చెప్పేటప్పుడు నల్లబల్ల(బ్లాక్‌బోర్డు)ను తప్పనిసరిగా అధ్యాపకుడు ఉపయోగించాలి. వ్యాకరణం బోధించేటప్పుడు నల్లబల్లను ఉపయోగించని అధ్యాపకులు ఎందరో ఉన్నారు. ఈ రకమైన అధ్యాపకులే ఎక్కువగా మనకి కన్పిస్తారు. ఈ విషయం మన అందరికీ తెలిసిందే. ఇక్కడ నేను కొత్తగా చెప్పేది ఏమీలేదు.

అధ్యాపకుడు తన 35 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో వ్యాకరణం బోధించేటప్పుడు ఎప్పుడైనా కనీసం ఒకరోజు అయినా 'నల్లబల్లను' ఉపయోగించాడా? అనేది ప్రశ్న. దానికి సరైన జవాబులేదు. ఈ విషయంపై అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ, డిగ్రీ కాలేజీల్లో నిశితంగా వాకబు చేశాను. అక్కడక్కడ అప్పుడప్పుడు వుందని సమాచారం. అది కూడా పద్ధతిగా లేదని తెలుస్తుంది.చాలా బాధపడదగ్గ విషయం.

'నల్లబల్లను' ఉపయోగించకుండా అధ్యాపకుడు వ్యాకరణం బోధిస్తున్నాడంటే, అధ్యాపకుడు వ్యాకరణాన్ని బోధించడానికి అర్హుడు కాడన్నమాట. అంటే బోధించడానికి పనికి రాడన్నమాట. అన్నమాట కాదు. ఉన్నమాట ఇది. అధ్యాపకుడు వ్యాకరణాన్ని 'శాస్త్రం'లా పాఠం చెప్పలేదన్నమాట. చెప్పలేక పోవడం కాదు, అధ్యాపకుడికి వ్యాకరణం బోధించడం రాదన్నమాట.

ఒక అధ్యాపకుని వల్ల ప్రతి సంవత్సరం 40 మంది విద్యార్థులు వ్యాకరణం అర్థం కాక చాలా బాధపడుతున్నారు. సంవత్సరానికి 40 మంది విద్యార్థులు × 35 సంవత్సరాలు సర్వీస్. మొత్తం 40×30= 1400 మంది. విద్యార్థులు ఒక అధ్యాపకునివల్ల .... ఇది న్యాయమా? ధర్మమా? అని వ్యాకరణాన్ని 'శాస్త్రం'లో బోధించలేని అధ్యాపకులు ఆలోచించాలి. విద్యార్థికి శాస్త్రం అబ్బలేదంటే శాస్త్రం ఫెయిలైనట్లు కాదు. దాన్ని బోధించేవారికి ఆ శాస్త్రం గూర్చి ఎంత తెలుసో పరీక్షించుకోవాలి.

అయిపోయింది ఏదో అయిపోయింది. ఇకనైనా వ్యాకరణాన్ని 'శాస్త్రం'లా అధ్యాపకులందరూ తప్పని సరిగా బోధించాలి. విద్యార్థులకు మేలు చేయాలి. కలకాలం మీ పేరు చెప్పుకొనే విధంగా విద్యార్థులకు పాఠాలు బోధించాలి.

'వ్యాకరణం' బోధించడం రాకపోతే మరో సబ్జెక్టు చెప్పుకోవాలి. మీకు నచ్చింది, విద్యార్థికి మీరు చెప్పగలిగింది, ఏదో ఒకటి చెప్పండి. మీకు గౌరవ ప్రదంగా వుంటుంది. విద్యార్థి కూడా స్ఫూర్తి చెందుతాడు.

చివరకు తేలిన సారాంశం ఏమంటే వ్యాకరణాన్ని 'శాస్త్రం'లా బోధించాలి. మేథమెటిక్స్‌లా, కంప్యూటర్‌లా, చక్కగా సుబోధకంగా విపులంగా బోధించాలి.

నేను, డాక్టర్ గుమ్మా సాంబశివరావు గారు వ్యాకరణాన్ని 'శాస్త్రం'లా బోధించాలనే ఉద్దేశంతో 'బాలవ్యాకరణం–శాస్త్రీయ వ్యాఖ్యానం' రాశాం.

శబ్ద స్వరూపాన్ని ప్రామాణికంగా వ్యాకరణం వివరిస్తుంది. సాహిత్యశాస్త్ర నిర్మాణానికి, భాషా పరిశోధనాత్మక రచనలకు, నిఘంటు నిర్మాణం మొదలైన వాటికి వ్యాకరణం తప్పనిసరి. వ్యాకరణం వల్ల ఎన్నో ప్రయోజనాలు వున్నాయి. అవి తెలుసుకోలేక కొంతమంది వితండవాదం చేస్తున్నారు. అందులో పసలేదు. వారివాదన అజ్ఞానానికి పరాకాష్ఠ.

'రక్షోహాగమ లఘ్వసందేహాః ప్రయోజనమ్'

శబ్దాల అర్థాలను కాపాడడం, దాని స్వరూపాన్ని వివరించడం, శాస్త్రీయ పద్ధతిలో వుండడం వీలైనంత క్లుప్తంగా చెప్పడం, సందేహాలు రాకుండా చెప్పడం, వ్యాకరణం ప్రయోజనం.

–పతంజలి

కవిత

అమ్మపాలు

ఆలూమగలు సృష్టిలో....
అమ్మానాన్నలుగా మారడం
సృష్టిలో పరమాద్భుతం,
బిడ్డకు తల్లి కావడం
స్త్రీ జన్మకు సార్ధకత,
అది ఇంటికే పెద్ద పండగ,
ప్రతి శిశువు ఆగమనం
ఒక అద్భుతమే,
సర్వజగతికీ సార్వభౌమత్వం
సైతం
అమ్మఒడితో సమానం కానేరదు,
పాలు ఇచ్చిన తల్లికి తాగిన బిడ్డకూ
పరమానంద సంధాన సేతువు
అమ్మపాలు,
అమ్మపాలకు విలువ కట్టడం అసాధ్యం,
అవి అమూల్యమైనవే కావు
అతి పవిత్రమైనవి కూడా,
బిడ్డ పుట్టేసరికే అమ్మపాల
రూపంలో ఆహారం సిద్ధంగా
ఉండటం
సృష్టిలో పరమాద్భుతం"

రాయవరపు సరస్వతి
7989665525

డా॥ పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

నానాటికి తీసికట్టుగా వ్యవసాయ వారసత్వం

ప్రచారంలో కొత్త పోకడలు.

మన రాష్ట్రాలలో, భూమి అడవి విద్యను ప్రభుత్వం నుంచి లాక్కున్న గిరిజనులు, తమ జ్ఞానాన్ని కూడా పుస్తకరూపంలోకి తెస్తున్నారు. వారి నాయకత్వంలో సంస్కృతి, వ్యవసాయరంగంలో తప్పక ప్రముఖపాత్ర వహిస్తుంది. శాస్త్రవేత్తలను దారికి తెస్తుంది.

మెతుకు సీమలోని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డి.డి.యస్) చిరకాలంగా తృణధాన్యాల సాగుమీద అవగాహన కల్పిస్తూ, వాటి రుచుల

Deccan Development Society

ప్రచారానికి జహీరాబాద్‌లో ఎత్నిక్ కేఫ్, పాతవిత్తనాల పండుగలు, యఫ్.యమ్ రేడియో కేంద్రం, నడుపుతుంది. స్థానిక కార్యకర్తలకు వీడియో చిత్రీకరణలో తర్ఫీదు ఇచ్చింది. రాష్ట్రమంతా విత్తనాల సేకరణను ప్రోత్సహించింది. అనేక ప్రచురణలు తెచ్చింది. కొంతకాలం 'పచ్చశాల' బడి నడిపింది. కృషి విజ్ఞానకేంద్రాన్ని నిర్వహిస్తున్నది.

ఈ సంస్థ స్ఫూర్తితోనే అరకులోయలో విత్తనసేకరణకు పూనుకున్నట్లు సంజీవని సంస్థ సంచాలకులు దేవుళ్ళు చెప్పుకున్నారు. అక్కడే పనిచేసి, నేడు విశాఖ జిల్లాలో గల వికాస స్వచ్ఛంద సంస్థ సంచాలకులుగా ఉన్న కిరణ్ సక్కరి తూర్పుగోదావరి మన్యంలో వంగడాలమీద పరిశోధనకు డాక్టరేట్ పొందారు. అంతకుముందు ఉత్తరాంధ్ర మన్యంలో కందిసాగు మీద వీరి పుస్తకాన్ని ఇక్రిసాట్ ప్రచురించింది.

పాలేకర్, మహారాష్ట్రలోని అకాడెమి ఆఫ్ సైన్సెస్ వంగడాల సేకరణను ప్రస్తావిస్తారు(పుట 412). ఆయన




పండిస్తున్నారు(పుట 346) ఆయన పట్టించుకోని గిరిజన వారసత్వాన్ని, ఈ మన వాళ్ళ కృషిని గుర్తుచేస్తుంది. ఆయన అనుయాయి విజయరాం డి డి యస్ పనిచేస్తున్న ప్రాంతంలో వ్యవసాయం చేస్తూ దేశవాళి విత్తనాలన్నీ తన దగ్గర దొరుకుతాయి అని ప్రకటిస్తున్నారు. గో ఆధారిత వ్యవసాయానికి 'కొత్త' ఆధ్యాత్మికతను జోడిస్తున్నారు. ప్రకృతిని నమ్ముకున్న రైతు జీవితం ఏరువాక దగ్గర నుంచి పండుగ పబ్బాలతో ముడిపడినదే. వాళ్ళకు బోధించటం తాతకు దగ్గులు నేర్పటమే.

కేంద్రప్రభుత్వం పాలేకర్ పద్ధతులను దేశమంతా విస్తరించే సందర్భంలో, ప్రపంచ ఆహార సంస్థ గుర్తింపు పొందిన ఒడిస్సా, తమిళనాడులతో, మన రాష్ట్రాలలో ఇంతకాలంగా జరిగిన కృషికి పోలికలేమిటో, రాయల్ కమిషన్ ఆఫ్ అగ్రికల్చర్ రిపోర్ట్ (1928) వచ్చి వందేళ్ళు నిండుతున్న సందర్భంగా అధ్యయనం చేస్తే బాగుంటుంది. 'ఆంధ్రదేశంలో పలుతావుల్లో వ్యవసాయ విధానం ఉన్నత ప్రమాణాలు సాధించింది. వరివ్యవసాయం సమగ్రత్వాన్ని అందుకుంది. పెక్కు వ్యవసాయ సామెతల విజ్ఞానం పలుపరిశోధనలకు నిలబడి నిజమైన విజ్ఞానంగా నిరూపించుకుంటుంది' (తెలుగు సామెతలు జనజీవనం పుట82.) అని నొక్కి చెప్పిన కమిషన్ మాటలు గుర్తుంచుకోవాలి.(Royal Commission of agriculture in India. p.14) .

హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ గారి సంస్థే, సతత హరిత విప్లవం పేరుతో ఈ వనరుల పరిరక్షణ, వారసత్వం మీద పనిచేస్తున్నది గాని వారి పద్ధతులలో మార్పు లేదు. శాస్త్రజ్ఞులు ఏ ఎండకు ఆ గొడుగు పడతారు.

ఋతువులు, పంటలు, వంటలు, పండుగలు, పాటలు, నమ్మకాలు, ఆచారాలు కేవలం వ్యవసాయానికే కాదు గ్రామీణ వృత్తులన్నింటా సంస్కృతి పెనవేసుకున్నది. ఫార్మర్స్ ఫస్ట్ ఉద్యమం వివిధ దేశాల్లో బహుముఖంగా




జరుగుతున్న కృషిని విత్తనాలు పంటలు, వంటలు, పండుగలు – వీటిలోగల రైతాంగం ప్రణాళికలను ఉదహరించింది. సమాచారం రాబట్టేందుకు ఈ ఉద్యమం చూపించిన పద్ధతి, పి అర్ ఏ (participatory rural appraisal)ను వ్యవసాయ విస్తరణలో ముక్తసరిగా ,మొక్కుబడిగా


Honey Bee

పాటిస్తూ వచ్చారు. 1980లలో ఉమ్మడి వనరుల యాజమాన్యంలో జాతుల పాత్రను అధ్యయనం చేసిన అనిల్ గుప్తా ఫార్మర్స్ first బృందంలో ఒకరు. ' హనీ బీ నెట్ వర్క్' ద్వారా గ్రామీణుల సృజనాత్మకతను గుర్తిస్తున్నారు. శోధ యాత్రలు నిర్వహిస్తున్నారు. ఆయన సహచరులు విజయ షెర్రీ చాంద్ వగైరాలు రైతుల పరిశోధనలను గ్రంథస్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో దాగి ఉన్న ఈ సంస్కృతిలో ప్రణాళిక, ఇప్పటికీ గిరిజన ప్రాంతాలలో బలంగా కనిపిస్తుంది. అక్కడ ఆగస్ట్ సెప్టెంబర్‌లలో కొర్రకొత్త నుండి కందికొత్త దాకా ప్రతి పంట పరువుకు వచ్చిన తరువాత ఊరంతా కలిసి పండుగ చేసి తింటారు.'రండో చేరి పాండుగులార, భోంచేయ రండో' అని పాటలు పాడుతూ, ఆటలాడుతూ దేవతలను ఆహ్వానిస్తారు. కల్లు గీసేముందు చెట్టుపండుగ, అడవిలో మామిడిపండ్లు ఏరబోయే ముందు మామిడి కొత్త, పనసలకు పనసబాసలు



ఉన్నాయి. గిరిజనులు తాటిముంజలు తినరు. ముంజలు పండ్లుగా, బుర్రగుంజు. తేగలుగా ముందు ముందు వాడుకుంటారు. మామిడి పండులో జీడిని కుమ్మి రొట్టె వేసుకుంటారు. పెంకమీద వేపిన సురువులు మంచి నంజకం. మామిడిమీద మొలిచిన కొక్కులతో కాచిన చారు చాలా రుచి. **'కుండన వండింది అంబలి–పెంకున వేపినది సురువులు, దూబలో ఆవించింది**



పిట్టు' అని నానుడి. గిరిజనులలోగల ఈ దూరదృష్టిని, పంటల వంటల పండుగల వైవిధ్యాన్ని, ప్రకృతి ఆరాధనను అందరికీ తెలియచేయవలసి ఉంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ వారి 'ప్రధానోపాధ్యాయుల కరదీపిక–గిరిజన సంస్కృతి' ఇందుకు పనికొస్తుంది.

తెలంగాణాలో రొట్టె ,రాయలసీమలో రాగి ముద్ద, గిరిజన ప్రాంతాలలో అంబలి



మీద మక్కువ ఎక్కువ. నంది పైపుల యస్ పి వై రెడ్డిగారి ఒక్కరూపాయికే జొన్న రొట్టె పిలుపు, వాటి వాడకం పెంచింది. అదే సమయంలో స్వగృహ పిండివంటలు, కర్రీ పాయింట్‌లు విస్తరించి గిరాకీ పెంచాయి. రోటి పచ్చళ్ళు, ఉలవచారు ఇలా ఈ పిచ్చి పెరుగుతుంది. గిరిజనుల ఒకనాటి కరువు తిండ్లు ఈవేళ అయిదు నక్షత్రాల తిండ్లుగా అవతారమెత్తుతున్నాయి.

మన రాష్ట్రాలలో, భూమి అడవి విద్యను ప్రభుత్వం నుంచి లాక్కున్న గిరిజనులు, తమ జ్ఞానాన్ని కూడా పుస్తకరూపంలోకి తెస్తున్నారు. వారి నాయకత్వంలో సంస్కృతి, వ్యవసాయరంగంలో తప్పక ప్రముఖపాత్ర వహిస్తుంది. శాస్త్రవేత్తలను దారికి తెస్తుంది.

కవిత

కళ్లద్దాల జీవనయాత్ర!

కళ్లద్దాల జీవనయాత్రలో
కదిలిపోయే దృశ్యాల చెంత
అనాయాసంగా ఉబికే
కన్నీటి చెలిమలే
కలతచెందే చరమాంకమంతా!
అంతర్ బాహ్యలోకాల్లో
నిట్టనిలువునా కూరుకపోయి
మోకాళ్లు కూడా మాట వినవు చివరికి,
అంతిమంగా నిర్వికారంగా
అంతరంగంలో తీక్షణంగా
మెరిసే కళ్లు.......
కుట్రలు కుత్సితాలను
ఛేదించే లేజర్ కిరణాల్లో
కుడిఎడమల స్ఫటికాలలో
నడయాడే–
చీకటి వెలుగుల దృశ్యం!

నిఖిలేశ్వర్
91778 81201

కవిత

పాపాయి గొంతు

- ఎండ్లూరి సుధాకర్



నా తెలుగు తల్లీ!
నేనమ్మా నీ పిండాన్ని
మాతృగర్భంలోంచి
మాట్లాడుతున్న
ఈ జాతి గండాన్ని
భాషా భారతంలో
బాధాతప్త అక్షరాన్ని
ఉమ్మనీటి కన్నీటిలో
చెమ్మగిల్లే దుఃఖితురాల్ని

అన్నమైనా అమృతమైనా
అమ్మలాగే ఉంటుంది నాకు
నా ఆకారమంతా
'అ' కారంలోనే కనబడుతుంది చూడు
దయలేని తల్లిదండ్రులారా
నన్ను భ్రూణహత్య చేస్తారా
నా కంఠనాళం కోస్తారా
ఆడపిండాన్ని
అమృతభాండాన్ని

అమ్మా! నన్ను చెత్తకుండీలో వేయొద్దు
నన్ను మురికికాల్వలో తోయొద్దు
నా భాషనూ
నా శ్వాసనూ
నులిమేయకమ్మా
నన్ను వెలివేయకమ్మా
అమ్మా! నన్ను లాలించమ్మా
నీ భాషాశిశువుని ప్రేమించమ్మా
నా పేగుకి
తెలుగు ముడివేయమ్మా!
నా కోసం
జోలపాట పాడకమ్మా
ఈ నవమాసాలైనా
నేనొక ఉద్యమంగా రూపుదాల్చాలి
అమ్మా! నన్ను జీవించనివ్వు
నన్ను తెలుగులో భాషించనివ్వు
నిన్ను కలకాలం పోషించనివ్వు
నీ పురిటి నొప్పుల్ని పూజించనివ్వు
ఇంగ్లీషు మందులు మింగీ మింగీ
నా నోరంతా ఆ కంపే
పరాయితిండి మెక్కీ మెక్కీ
చివరికి కూల్చుకున్నాను నా కొంపే
అన్నంరుచీ
అచ్చ తెనుగు రుచీ
అచ్చంగా ఒకటే కదామ్మా !
అమ్మా! నీ కడుపులో చల్లగా కూచున్నాను
నీ పొట్టలో చద్దిబువ్వలా ఒదిగున్నాను
ఆ విదేశీ పానీయాలు మానేయమ్మా
ఆ విషజ్వాలలు నాదాకా రానీయకమ్మా
పోతపాలు
పోతభాష
దేహానికీ చేటు
దేశానికీ చేటు
పేగు కాలి పెద్దమాటలంటున్నాను
ప్రేమతో మన్నించమ్మా!
అమ్మా! రేపు నన్ను
ఏ కాన్వెంటులో చదివిస్తావు?
ఎన్ని లక్షలు పోసి
నాకో భాషాబలిపీఠం నిర్మిస్తావు
నేను పుట్టకముందే
దరఖాస్తుల పడిగాడ్పులు కాస్తావు

అమ్మా! నన్నప్పుడే
కిండర్ గార్డెన్ జైలుకి పంపొద్దు
నా నిద్రాపుష్పం
పూర్తిగా వికసించక ముందే
మొగ్గలోనే నన్ను లేపి
నా గుండెలమీద గుదిబండ మోపొద్దు
అమ్మా! నన్ను కాసేపు వేపచెట్టునీడలో
అడుకోనీ
తాతయ్య చేతికర్రకు తీగలా చుట్టుకోనీ
ఒక పూటంతా తూనీగలు పట్టుకోనీ
సీతాకోక చిలుకలతో స్నేహంగా మాట్లాడనీ
వానలో తడిసి
మట్టిలో మురిసి
గడ్డివాములమీద దొర్లనీయమ్మా
రెల్లుపూల పరుపుపై పొర్లనీయమ్మా
నాన్నల బడిలో
అమ్మల ఒడిలో
హాయిగా చదవనీయమ్మా
నన్ను చంక దింపకమ్మా
దయచేసి నన్ను చంపకమ్మా
వందల కొద్దీ
మందల కొద్దీ
పసి పిల్లల్ని
వాహనాల్లో జంతువుల్లా కూరుతువుంటే
వాళ్లంతా కబేళాలకు
తరలిపోతున్నట్టే వుంటుందట కదమ్మా
బయట చెప్పుకుంటుంటే
భయం భయంగా వింటుంటే
నా నెత్తురు ఆవిరైపోతూ వుంటుంది
నా ఊపిరి గొట్టం ఉక్కిరి బిక్కిరై పోతూంది.
అమ్మా!
ఆ రంగులదయ్యం పీక పిసుకుతావా
ఆ టీవీ గదిలోంచి ఆరుబయటికొస్తావా
నన్ను తోటలోకి తీసుకెళ్లు
కొత్తకోకిలపాట వినాలి
చైత్రమాసపు ఉగాదిగాలి పీల్చాలి.
ఆకాశం కింద నువ్వు నిలబడ్డప్పుడు.
అన్ని వైపుల నుంచి
నీ లోపల నుంచి
నేను నా మాతృభాష వినాలి.
లేగదూడనై నీగర్భ ప్రాంగణంలో
చెలగి చెంగనాలు తీయాలి
నా గంతులు నీ పులకింతలు కావాలి

అమ్మా! నన్ను బతకనీయమ్మా
భాషా భ్రూణహంతకుల నుంచి
నన్ను కాపాడుకోమ్మా
నా భవిష్యత్తు కోసం లెక్కలు కట్టొద్దు
నా జన్మ మీకు చిక్కులు తేవద్దు
నా జననం మీలో చిచ్చులు రేపొద్దు
నన్ను మాతృదేశంలో ఉండనీయమ్మా
అక్షర పిండమై అమ్మకడుపులో
పెరగనీయమ్మా
నన్ను దిక్కులేని అమెరికాకి పంపొద్దు
నన్ను ఐరోపా ఖండానికి ఎగుమతి
చేయొద్దు
నన్నొక వ్యాపార వస్తువుని చేసి
ప్రపంచ మాయల ఫకీరుకి అమ్మొద్దు
నన్ను ఇంగ్లీషు యముడికి బలిపెట్టొద్దు
చెట్లు మాట్లాడే దేశంలో
నన్ను పచ్చగా బతకనీయండి
గడ్డిపోచకూడా పౌరుషంగా నిలబడే
ప్రదేశంలో
నన్ను స్వేచ్ఛగా ఎదగనీయండి
అమ్మలాంటి భూమి మీద
అన్నానికి కరువా?
చింతకాయల కొమ్మ
చెట్టుతల్లికి బరువా!
నన్ను త్వరగా కనమ్మా
నా పేగు కేక వినమ్మా
తీరిక లేదని తిరస్కరించకమ్మా
నగరాల్లో ఉద్యోగంకోసం
వేగంతో
ఉద్వేగంతో
బండినడిపేటప్పుడు భద్రం తల్లీ
నీ కడుపు గూటిలో
లేత గువ్వలా కూర్చునే వున్నాను.
ఊపిరి తిత్తుల్ని కాల్చుతున్న
నగర ధూమ భాషాకాలుష్యాన్ని
నేను కూడా పీల్చుతూనే వున్నాను.
భాషను కాపాడుకోవడం
బిడ్డను కాపాడుకోవడం తెలియని
బండలోకంలో
బలైపోతున్నది రేపటి శిశువులే కదా!
నువ్వు ఇంటి పట్టునే వుండమ్మా
నీ కడుపుకొమ్మకు
కోతిపిల్లనై అంటుకొని వుంటాను

నువ్వు తలారా స్నానం చేసి
చందమామో బాలమిత్రో
పలనాటి వీరచరిత్రో
నా గుండె చెవిలోకి చదువుతు వుంటే
నేను ఊ కొడుతూ వింటాను
జానపదాలో
వేమన పద్యాలో
నువ్వు కంఠంలోంచి
నా లోపలికి పంపుతుంటే
నేను నీ కడుపు గడపలో కూర్చుని
వల్లె వేస్తుంటాను
నీ వల్లే నా కబ్బిందని
లేమల్లె గొంతుతో లోకానికి చాటుతాను
అమ్మా! నాకు 'పోకిరి' పాటలు కాదు
పోరాట గీతాలు నేర్పించు
నాకు ధనం భాష కాదు
జనం భాష నేర్పించు
నా తాత ముత్తాతల కథలు వింటాను
జంబూద్వీప జాబిల్లి మీద
నా జాతి కిరణాల తిరణాల చూస్తాను
'తెలుగమ్మను కనిపెట్టుకొని కాపాడుతున్న
మాదిగల' పాదాలు కడుగుతాను
నా తెలుగు మూలవాసుల
కాళ్లకు మొక్కుతాను
ఎన్ని జన్మలెత్తినా, ఎత్తకున్నా
ఈ జన్మకు మాత్రం
తెలుగు పాపాయినై పుడతాను
తెలుగు తేజాన్నై పెరుగుతాను
ఎవరైనా రేపు
నా ప్రాచీనతని ప్రశ్నిస్తే
అమ్మనీ
అమృతాన్నీ
ఆకాశాన్నీ చూపిస్తాను.
(ఈ కవితకు స్ఫూర్తి నిచ్చిన తెలుగు పెద్దలు
డా॥ సామల రమేష్‌బాబు,
శ్రీ సింగమనేనినారాయణ,
శ్రీ స.వెం. రమేశ్ గార్ల వ్యాసాలకు
కృతజ్ఞతలతో)

కొన్నేళ్ల కిందట ఎండ్లూరి సుధాకర్ కలంలోంచి జాలువారిన యీ కవిత త్వరలో వెలువడనున్న ఆయన కవితల సంపుటి 'స్వప్నదేశం'లోంచి... కీర్తిశేషులు సుధాకర్ గారిని గుర్తు చేసుకొంటూ.....

–సంపాదకుడు

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

భాష ప్రమాదంలో ఉందని ఎలా గుర్తిస్తారు?-4
భాష పట్ల వ్యక్తులకున్న అభిప్రాయాలు, ప్రభుత్వాల విధానాలు.

(గత సంచిక తరువాయి.....)

గత మూడు సంచికలలో భాష అంతరించిపోయేందుకు కారణమైన పలు కారణాలను పరిశీలించాము. మొదటి ఆరు కారణాలలో చేరని ప్రభుత్వ విధానాలకు సంబంధించిన కారణం ఈ సంచికలో చర్చించనున్నాము. అంటే మన భాషాభిమానులు, భాష కోసం పాటుపడే వారెందరో ప్రభుత్వ విధానాల మార్పుతో భాషకు దుర్దశ లేదా మహర్దశ కలుగుతుందని నమ్ముతున్నారు. అందులో కాస్త నిజమున్నా, భాషను ఎలుగెత్తి చాటేది, లేదా దూరం చేసుకుని చంపేసేది ఆ భాషా సముదాయంలోని వ్యక్తులే. ప్రభుత్వాల విధానాల వలన భాషకు పెద్దగా ఒరిగేదేమీ లేదని చెప్పటమే ఈ అంశాన్ని చివరాఖరున చర్చించటానికి కారణం.

విధానపరంగా, ప్రభుత్వ సహకారం ద్వారా హిందీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా గత 80 ఏళ్ళుగా రాజకీయ నాయకులు ఎంత పట్టం కట్టినా, అల్పసంఖ్యాక భాషలెన్నిటినో సారూప్యత వలన హిందీలోకి కలిపేసుకున్నా, హిందీ పరిస్థితి తెలుగుకన్నా మెరుగ్గా ఏం లేదు. హిందీ భాషీయులు హిందీ లిపి కన్నా, ఆంగ్ల(రోమన్) లిపిలోనే ఎక్కువ వ్యవహరిస్తున్నారు. అధికాధికంగా ఆంగ్ల, పంజాబీ, మొ॥ భాషా పదాలను అసహజంగా చొప్పిస్తున్నారు కూడా.

అందువలన ఒక భాష మనుగడ, ప్రోత్సాహం లేదా వెలి అనేవి ఆ భాష మాట్లాడే వ్యక్తులే చేస్తారు తప్ప ప్రభుత్వ విధానాల స్థానం ఇందులో నామమాత్రమే.

పెత్తనంలేని అల్ప సంఖ్యాక భాషలపై అధిక సంఖ్యాక భాషా సమూహాల అజమాయిషీ సహజంగానే ఉంటుంది. అది ప్రాంతీయ స్థాయిలో అయినా, జాతీయ స్థాయిలో అయినా. అధిక సంఖ్యాకులు కాబట్టే హిందీ వారు మనం వారి ప్రాంతాలకు వెళితే మనని హిందీలోనే మాట్లాడమని నిలదీస్తారు, మన ప్రాంతాలకు వచ్చినా వారితో మనం హిందీలోనే వ్యవహరించాలని దబాయిస్తారు.

ఒక ప్రభుత్వం నిర్ణయించుకునే భాషా విధానం, ఆ ప్రభుత్వం అధీనంలో ఉన్న భాషా సమూహాలను తమ తమ మాతృభాషలను కాపాడుకునేలా చేయవచ్చు, లేదా తమ మాతృభాషలను వెలివేస్తూ ప్రభుత్వం విధానపరంగా అధికార భాషగా గుర్తించే భాష వైపుకు మారేలా చేయవచ్చు. అంటే మాతృభాషల పట్ల ఆయా వ్యక్తి సమూహాల అభిప్రాయాలను ప్రభుత్వ విధానాలు బలంగా ప్రభావితం చేస్తాయనమాట.

బహుభాషా సముదాయాలను పాలించే ప్రభుత్వాల విషయానికి వస్తే, అధిక సంఖ్యాక సముదాయాలు అల్పసంఖ్యాక భాషా సముదాయాల కన్నా తమ భాష ఆ ప్రభుత్వం పాలించే రాష్ట్రాన్ని/దేశాన్ని కలిసికట్టుగా ఉండేలా చేస్తోందని నమ్మిస్తాయి.

ఒకే ప్రభుత్వం కింద పలు భాషలు అధిక సంఖ్యాక సమూహాలుగా ఉన్నపుడు ఒక భాషా సముదాయానికి, మరొక భాషా సముదాయానికి ఘర్షణ ఉంటుంది. ఇందువలన భాషల వైవిధ్యం ఉన్న సముదాయాలు దేశాన్ని/రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేస్తాయని. దేశాన్ని ఒక్కటిగా ఉండనివ్వవని ఒక భావన ప్రబలంగా ఉంది. ఈ అపోహకు సమాధానంగా రాజకీయ నాయకులు కనిపెట్టిన ఆయుధమే ఒక ప్రభుత్వం కింద ఉన్న ప్రజలందరూ ఒకే భాషను మాతృభాషగా, అధికార భాషగా, వ్యవహార భాషగా స్వీకరించాలనే వాదన.

ప్రభుత్వానికి ఒకే భాషను ప్రజపై రుద్దాలన్న భావన వచ్చాక ఆ భాషను పలు విధాలుగా ప్రజలు విరివిగా వాడేలా చట్టాలు చేస్తుంది. కొన్ని ప్రదేశాలలో ప్రజలు తమ మాతృభాషలో వ్యవహరించలేని పరిస్థితి ఎదురవుతుంది. అలా ఒక భాషా సముదాయం మొత్తం తమ భాషను విడిచి ప్రభుత్వం సూచించిన భాషను తమ భాషగా బలవంతంగా స్వీకరించే పరిస్థితి ఏర్పడుతుంది.

అంటే విధానపరంగా ప్రభుత్వాలు భాషలను మెరుగుపరచగలవు, లేదా మటుమాయం చేయగలవనమాట.

ఒక దేశ ప్రభుత్వం ఒకటికన్నా ఎక్కువ భాషా సముదాయాలను పాలిస్తున్నపుడు, విధిగా ఒక భాషా విధానాన్ని కలిగి ఉంటుంది. ఒక కొసన అలాంటి ప్రభుత్వ విధానం అన్ని భాషల్లో ఒక భాషను మాత్రమే అధికార భాషగా గుర్తించి మిగితా భాషలను పట్టించుకోకపోవచ్చు. లేదా మరో కొసన ఆ దేశంలో మాట్లాడే అన్ని భాషలకు సమానంగా అధికార హోదా ఉండవచ్చు. చట్టపరంగా భాషలు సమానంగా గుర్తించినా భాషలు దీర్ఘకాలం ఆరోగ్యంగా మనగలవని చెప్పలేము.

7. భాషల పట్ల ప్రభుత్వాలకు, సంస్థలకు ఉన్న అభిప్రాయాలు, విధానాలు. (అధికారిక హోదా, వాడకం కలుపుకొని)

ప్రభుత్వాలు మరియు సంస్థలు భాషల పట్ల ఆంతరంగిక అభిప్రాయాలు, బాహ్య విధానాలు కలిగి ఉంటాయి. ఇవి భాష బలాబలాలను నిర్దేశిస్తాయి.

సమాన సహకారం (5) : ఆ దేశ ప్రభుత్వం దేశంలోని అన్ని భాషలను దేశపు సొత్తుగా, ఆస్తిగా భావిస్తుంది. చట్టాల ద్వారా అన్ని భాషలకు రక్షణ కలిగిస్తారు. వివిధ అధికారిక విధానాల ద్వారా అన్ని భాషల ప్రచార ప్రసారాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.

ఎక్కువ తక్కువ సహకారం (4) : అధిక సంఖ్యాక భాషల పట్ల

ఒక విధంగా, అల్ప సంఖ్యాక భాషల పట్ల మరో విధంగా ప్రభుత్వ విధానం ఉంటుంది. కొన్ని దేశాల్లో ప్రభుత్వం అధిక సంఖ్యాక భాషలనే గుర్తించి, అల్ప సంఖ్యాక భాషలను విస్మరిస్తుంది. కొన్ని దేశాల్లో అల్ప సంఖ్యాక భాషలకు అధిక చట్టాలు చేసి అధిక సంఖ్యాక భాషలకు అలాంటి చట్టాలను వర్తింప చేయక ఆ అధిక సంఖ్య ఉన్న భాష అల్ప సంఖ్యాక భాషగా మారేలా చేస్తుంది. సాంస్కృతిక, వ్యక్తిగత ప్రదేశాల్లో అల్పసంఖ్యాక భాషలను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ పాఠశాల్లో అధిక సంఖ్యాక భాషలకే ప్రాధాన్యత ఇవ్వవచ్చు.

పరోక్ష మార్పిడి (3) : ప్రభుత్వం అల్పసంఖ్యాక భాషలను నేరుగా విధానపరంగా కాపాడక పోవడం వలన అధికసంఖ్యాక భాష పెత్తనం వచ్చి, అధిక సంఖ్యాక భాషీయులు అల్ప సంఖ్యాక భాషీయులను పెద్ద భాషలో మాట్లాడి చిన్న భాష వాడకాన్ని తగ్గించేలా చేస్తారు.

ప్రత్యక్ష మార్పిడి (2) : ప్రభుత్వం అధిక సంఖ్యాక భాషల పక్షంలో విధానాలు రూపొందించి. అల్ప సంఖ్యాక భాషల వాళ్ళని పెద్ద భాషను నేర్చుకునేలా చట్టాలు చేస్తుంది. చిన్న భాషల్లో మాట్లాడడాన్ని/వ్యవహరించడాన్ని ప్రభుత్వం ప్రోత్సహించదు.

బలవంతపు మార్పిడి (1) : ప్రభుత్వం కేవలం ఒక పెద్ద భాషనే అధికారభాషగా ప్రకటించి, చిన్న భాషలను కనీసం గుర్తించకుండా, వాటిని ప్రోత్సహించకుండా చట్టాలు, విధానాలు చేస్తుంది.

నిషేధం (0) : చిన్న భాషల వాడకం అన్ని ప్రభుత్వపరమైన చోట్లా నిషేధిస్తారు. వ్యక్తిగత స్థాయిలో భాష మనుగడలో ఉండవచ్చు. 8.

సహకార స్థాయి	స్థాయి సంఖ్య	భాష పట్ల అధికారిక అభిప్రాయం
సమాన సహకారం	5	చిన్నా పెద్దా అన్ని భాషలకు రక్షణ ఉంది
ఎక్కువ తక్కువ సహకారం	4	చిన్న భాషలకు గుర్తింపు ఉండి, చట్టాల ద్వారా రక్షణ ఉంది. భాష వాడకం పట్ల ఒక రకమైన హెచ్చుతగ్గుల భావన ఉంది. వ్యక్తిగత స్థాయిలో భాష వాడకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.
పరోక్ష మార్పిడి	3	చిన్న భాషలకు రక్షణ కల్పించే చట్టాలు/విధానాలు లేవు. పెద్ద భాష అన్ని ప్రభుత్వ పరమైన ప్రదేశాల్లో, ఇంటి బయట వాడుకలో ప్రబలంగా ఉంది.
ప్రత్యక్ష మార్పిడి	2	ప్రభుత్వమే చిన్న భాషా సముదాయాలను పెద్ద భాషా సముదాయాల్లో కలిసిపోవాలని చట్టాలు, విధానాలు రూపొందిస్తుంది. చిన్న భాషలకు రక్షణ లేదు.
బలవంతపు మార్పిడి	1	పెద్ద భాష అధికార భాషగా, ప్రభుత్వ పరంగా చట్టాల్లో, విధానాల్లో గుర్తించిన ఏకైక భాషగా చెలామణి అవుతుంది. చిన్న భాషలను ప్రభుత్వం గుర్తించదు, కాపాడదు.
నిషేధం	0	చిన్న భాషల వాడుకపై నిషేధం.

భాష పట్ల ఆ భాషా సముదాయ సభ్యుల వ్యవహారం, అభిప్రాయం

ఒక్కో భాషా సముదాయంలోని వ్యక్తికి తన భాషంటే ఒక్కో రకమైన అభిప్రాయం ఉంటుంది. భాష పట్ల ఆ వ్యక్తి వ్యవహరించే తీరు ఈ అభిప్రాయాన్ని బట్టి ఉంటుంది.

ఏ వ్యక్తికి కూడా తన భాషంటే తటస్థ అభిప్రాయం ఉండదు.

కొందరు మాతృభాషను సముదాయానికి, అస్తిత్వానికి ముఖ్యమని భావించి నానా విధాలా భాష ప్రచార ప్రసారానికి తోడ్పడతారు. కొందరు ఎలాంటి ప్రచారం చేయకపోయినా, కేవలం భాషను ఒక భావ ప్రకటన ఉపకరణంగా వాడుకుంటారు. కొందరికి తమ భాషలో మాట్లాడాలంటే సిగ్గు, అందువలన భాష ప్రచార ప్రసారానికి తోడ్పడరు. మరికొందరికైతే తమ మాతృభాష పట్ల ఏహ్య భావన ఉండి, మాతృభాషలో వ్యవహారాన్ని అసహ్యించుకుని, ఎక్కడా తమ మాతృభాషను వాడరు.

మాతృభాష పట్ల సముదాయంలోని వ్యక్తుల అభిప్రాయం బావుంటే ఆ సముదాయ అస్తిత్వానికి మాతృభాష ఒక ముఖ్యమైన కారణంగా చూస్తారు. కుటుంబ సంప్రదాయాలకు, పండుగలకు, సముదాయపరమైన కార్యక్రమాలకు ఉన్న సంప్రదాయ ప్రాముఖ్యతను ఆ సముదాయ వ్యక్తులు భాషకు కూడా ఆపాదించుకుంటారు. ఒకవేళ తమ మాతృభాష ఆర్థికపరమైన ఉన్నతికి సహకరించక, పెద్ద సమాజంలో భాగం అవటాన్ని అడ్డుకుంటుంది అంటే ఆ సముదాయ సభ్యులు తమ మాతృభాష పట్ల చెడు అభిప్రాయం కలిగి ఉంటారు.

భాష పట్ల వ్యక్తుల అభిప్రాయం – అది బావున్నా, తటస్థంగా ఉన్నా, బాగోకపోయినా – వివిధ రంగాల్లో భాష వాడాకాన్ని ప్రభుత్వ విధానాలే నిర్దేశిస్తాయి. వ్యక్తిగత అభిప్రాయంతో సంబంధం లేకుండా ప్రభుత్వ చట్టాల వలన, విధానాల వలన, సామాజిక నడవడికల వలన పలు రంగాల్లో భాష వాడుక పెరగవచ్చు, తగ్గవచ్చు.

చాలా సందర్భాలలో వేరే దారులు కనిపించక, భవిష్యత్తుపై సరైన అవగాహన లేక వ్యక్తులు తమ మాతృభాషలను కాదని పెద్ద భాషలను

స్థాయి సంఖ్య	భాష పట్ల ఆ భాషా సముదాయ సభ్యుల వ్యవహారం, అభిప్రాయం
5	సముదాయంలోని సభ్యులందరూ భాషకు విలువ ఇస్తారు. ప్రచార ప్రసారం చేస్తారు.
4	సముదాయంలో ఎక్కువ శాతం వ్యక్తులు భాష ప్రచారం, ప్రసారం చేస్తారు.
3	సముదాయంలో ఎందరో వ్యక్తులు భాష ప్రచారం, ప్రసారం చేస్తారు. అయితే కొందరికి భాష ప్రచార ప్రసారాలు పట్టవు. భాషపై మంచి అభిప్రాయం లేని వారు కొందరు భాష కనుమరుగవటానికి సైతం ఇష్టపడతారు.
2	సముదాయంలో కొందరు వ్యక్తులు భాష ప్రచారం, ప్రసారం చేస్తారు. అయితే కొందరికి భాష ప్రచార ప్రసారాలు పట్టవు. భాషపై మంచి అభిప్రాయం లేని వారు కొందరు భాష కనుమరుగవటానికి సైతం ఇష్టపడతారు.
1	సముదాయంలో చాలా తక్కువ వ్యక్తులు భాష ప్రచారం, ప్రసారం చేస్తారు. అయితే కొందరికి భాష ప్రచార ప్రసారాలు పట్టవు. భాషపై మంచి అభిప్రాయంలేని వారు కొందరు భాష కనుమరుగవటానికి సైతం ఇష్టపడతారు.
0	సముదాయంలో ఎవరికీ భాషపై మంచి అభిప్రాయం లేదు. భాష కనుమరుగవటానికి సైతం ఇష్టపడతారు. అందరూ వేరే పెద్ద భాషను తమ మాతృభాషగా స్వీకరిస్తారు.

స్వీకరిస్తారు. వీరికి కనిపించే రెండే ఎంపికలు – ఒకటి నీ మాతృభాషను స్వీకరించి నిరుద్యోగిగా ఉండిపో లేదా రెండు నీ మాతృభాషను వదిలేసి పెద్ద భాషను స్వీకరించి జీవితంలో మంచి ఉపాధి అవకాశాలు పొందు – అని.

కానీ, నిజానికి మాతృభాషలో తన అస్తిత్వాన్ని ఉంచుకుంటూ, పెద్ద భాషను నేర్చుకున్న వారే – అంటే – రెండు భాషలనూ నేర్చుకుని, వాడుకొని, వ్యవహరించి, కాపాడుకునే వారే జీవితంలో మెరుగైన స్థానాలకు చేరతారు.

రెండు భాషా సముదాయాల మధ్య సంఖ్యాపరమైన వ్యత్యాసం ఉన్నపుడు, చిన్న భాష వారు రెండు భాషల్లో మాట్లాడతారు, పెద్ద భాష వారు పెద్ద భాషలో మాత్రమే మాట్లాడతారు. మెల్లిగా అందరూ పెద్ద భాష మాత్రమే మాట్లాడే పరిస్థితి రావచ్చు. లేదా చిన్న భాష వారు భాషా పెత్తనాన్ని ఎదుర్కొని, తమ మాతృభాషను పదిలం చేసేలా సమూహ సభ్యులను ప్రోత్సహించే ఉద్యమాన్ని లేవనెత్తవచ్చు.

ఇలాంటి భాషాపరమైన ఉద్యమం ఆ ఉద్యమం జరుగుతున్న సామాజిక పరిస్థితులను, భాషాపరమైన సామాజిక కొలతలను దృష్టిలో ఉంచుకొని జరగాలి. స్థూలంగా ఈ కింది మూడు వర్గాలుగా భాషోద్యమాలను వర్గీకరించవచ్చు.

1. భాషను తిరిగి బ్రతికించుకోవటం : చాలా కాలంగా పరిమితంగా ఉన్న భాషను ఒక సముదాయానికి పూర్తి వ్యవహార భాషగా తిరిగి అందించడం. ఉదాహరణకు : ఇజ్రాయెల్ దేశ స్థాపన తరువాత హీబ్రూ భాషను తిరిగి ప్రవేశపెట్టడం, ఐర్లాండ్ లో గ్యాలిక్ భాషను తిరిగి ప్రవేశ పెట్టడం.

2. భాషను పటిష్టపరచడం : పలు రంగాలలో అంతకు ముందు వ్యవహారంలో లేను చిన్ని భాషను పెద్ద భాష స్థానంలో కొత్తగా వాడడం. ఇప్పటికే వాడుక ఉన్న రంగాలలో ఇంకా ఎక్కువ వ్యవహారం జరిగేలా భాషను పటిష్టపరచడం. ఉదాహరణకు : ఇంగ్లిష్ స్థానంలో వెల్ష్ భాష.

3. భాషను యథాతథంగా ఉంచడం : పరాయి పెద్ద భాష మెల్లిగా పలు రంగాలలో చొచ్చుకొస్తుంటే, అందుకు సమానంగా ఈ చిన్న భాషను సంభాషణల్లో, రాతల్లో ప్రాదేశికంగా, లేదా దేశ స్థాయిలో వాడుకునేలా చేయటం. ఉదాహరణకు : న్యూజిలాండ్ లో ఆంగ్ల భాషకు సమాంతరంగా మౌరీ భాష వాడకం.

మాతృభాష బలోపేతం కావాలంటే ఆ మాతృభాష ఏ రంగాల్లో దృఢంగా వాడాలో, ఏ రంగాల్లో పెద్ద భాషకు స్థానం ఉంటూ మాతృభాషకు చిన్నపీట వేయవచ్చో సముదాయ సభ్యులకు అవగాహన ఉండాలి. భాష పదికాలాల పాటూ నిలవాలంటే ఎక్కడ మన భాషను వాడాలో, ఎక్కడ పరాయి పెద్ద భాషను వాడాలో తెలుసుకుని వ్యవహరించాలి.

భాషల పాఠ్యీకరణ (documentation) అవసరం, అక్కర

9. పాఠ్యీకరణ స్వరూపం మరియు నాణ్యత

భాషల పాఠ్యీకరణ ఈ రోజుల్లో చాలా అవసరం. ఆ పాఠ్యీకరణ ఎంత త్వరగా జరిగితే అంత మేలు. ఒక్కో రోజు గడుస్తుంటే, భాషల్లో వ్యవహరించే వ్యక్తులు కనుమరుగవుతున్నారు. కొన్ని భాషలకైతే ఇటీవలే ఆఖరి వ్యక్తిని కోల్పోయిన సందర్భాలు కూడా చూసాము. ఈ పాఠ్యీకరణ అంటే ఏమిటి? – భాషలోని రాతలను భద్రపరచడం.

ఎలాంటి రాతలు? – ఆ భాషలో వెలువడిన సాహిత్యమంతా.


అంతేనా? – కాదు. ఆ భాషలో సహజంగా మాట్లాడిన పలుకుబడుల శ్రవ్యకాలు(ఆడియో), దృశ్యకాలు(వీడియో), అవి చక్కగా వివరణలతో, అనువాదాలతో, సందర్భానుసారంగా గుర్తించబడి భద్రపరచాలి.

ఇంకా? – ఆ భాషా సముదానికే ప్రత్యేకమైన సంప్రదాయ సంపద అంతా భద్రపచాలి.

ఏం భద్రపరచాలి, ఎలా భద్రపరచాలి అన్న విషయమై పరిశోధకులకు ఎన్నో ప్రమాణాలు ఉండవచ్చు గాక. ఆ మాతృభాషా సముదాయంలోని వ్యక్తుల మాటతీరు, నడవడిక, వ్యవహారం ప్రకారం ఒక్కో భాష పాఠ్యీకరణ ఒక్కో రకంగా విశిష్టంగా జరుగుతుంది.

పార్శీకరణ స్వరూపం	స్థాయి సంఖ్య	భాష పట్ల అధికారిక అభిప్రాయం
పెద్ద స్థాయి పార్శీకరణ	5	ప్రస్తుత వ్యవహార భాషకు సంబంధించిన విస్తృతమైన నిఘంటువులు, వ్యాకరణాలు ఉన్నాయి. పెద్ద పెద్ద పాఠ్యాలున్నాయి. భాషలో సాహిత్యం నిరంతరంగా వస్తూనే ఉంది. పెద్ద స్థాయి వివరణతో కూడిన ఆడియోలు, వీడియోలు ఉన్నాయి.
మంచి పార్శీకరణ	4	ఒక మంచి వ్యాకరణం పదిలపరిచి ఉంది. పలు వ్యాకరణాలు, నిఘంటువులు, పాఠ్యాలు, సాహిత్యం వస్తున్నాయి. వివరణతో కూడిన ఆడియోలు, వీడియోలు ఉన్నాయి.
ఒక మోస్తరు పార్శీకరణ	3	పలు వ్యాకరణాలు, నిఘంటువులు, పాఠ్యాలు, సాహిత్యం అప్పుడప్పుడూ వస్తున్నాయి. రోజువారీ వార్తాపత్రికలు లేవు. వివరణతో కూడిన తక్కువ స్థాయి నాణ్యత ఆడియోలు, వీడియోలు ఉన్నాయి.
చాలా కొద్ది పార్శీకరణ	2	పూర్తి స్థాయి వ్యాకరణం ఒక్కటీ లేదు. పదాల జాబితాలు, కొద్దిపాటి సాహిత్యం ఉంది. వివరణ లేని, నాణ్యత లేని ఆడియోలు, వీడియోలు ఉండవచ్చు.
అరకొర పార్శీకరణ	1	పూర్తి స్థాయి వ్యాకరణం ఒక్కటీ లేదు. చిన్న చిన్న పదాల జాబితాలు, కొద్దిపాటి సాహిత్యం ఉంది. ఆడియోలు గానీ, వీడియోలు గానీ లేవు లేదా వాడుకునే నాణ్యతవి లేవు.
పార్శీకరణ జరగలేదు	0	ఎలాంటి పాఠ్యాలు లేవు

– ముగింపు వచ్చే సంచికలో



ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద (15)

భాషలో మార్పు సహజం. ఆ మార్పులో కొత్త పదాలు కొత్తకొత్త పదబంధాలు ఏర్పడతాయి. కొత్త వస్తువుకు సరికొత్త పేర్లు కూడా ఉత్పన్నమవుతాయి. ఒక కాలం వాడుకలో ఉన్న పదాలు క్రమేపి అదృశ్యం అవుతాయి. వాడుకలోలేని మాటలు వాటి అర్థాలు కనుమరుగవడం సహజం. ఈ ప్రమాదాన్ని వారించేందుకు నిఘంటువులు వచ్చాయి. భాషలో అక్షరక్రమానుగుణంగా పదాలు వాటి అర్థాలు తెలియజేసేదే నిఘంటువు. పదకోశము వ్యుత్పత్తి కోశము అని కూడా జన వ్యవహారంలో ఉంది. తెలుగు భాషలో తొలినాళ్ళలో ఉన్న నిఘంటువులు, పద్యరూపాల్లో ఉన్నాయి.

తెలుగులో నిఘంటువులు ఏర్పడక ముందే సంస్కృత భాషలో నిఘంటువులు వచ్చాయి. యాస్కుడు, కశ్యపుడు రచించిన నిరుక్తములు వేదాలకు సంబంధించినవే. ఏయే వేదాలకు ప్రత్యేకంగా రూపొందించిన నిరుక్తము ఆ వేద పరిమిత నిఘంటువుగానే గుర్తింపు. నిఘంటువులు కూడా పలురకాలుగా పేర్కొంటారు. పర్యాయపదాలు వివరించే అమరకోశము, నామ లింగ శాసనము, అభిదాన చింతామణి మొదలయినవి ఒక కోవలోకి వస్తాయి. తెలుగులోనూ వచ్చిన నానార్థ నిఘంటువు సూరయామాత్యుడు రచించిన నానార్థ రత్నమాల ఒకటి కనిపిస్తుంది. ఈ సందర్భంలోనే గణపవరపు వేంకట కవిని గురించి ప్రత్యేకంగా చేప్పుకోవాలి. తెలుగు సాహిత్యంలో చిత్ర కవిత్వం అనే ప్రక్రియను చిత్ర విచిత్రాది రూపాలుగా విలక్షణ రచనా విన్యాసాన్ని ప్రదర్శించిన వాడు గణపవరపు వేంకట కవి. ఈయన రచన వేంకటేశాంధ్రం 1650 నాటి రచన. అమర సింహ సమానమైన యతులు సకల/ కవులు బొగడంగ లోకాపకారమగును / క్షితినాంధ్రనిఘంటువుగా జేసినాడ/ నంకీ తంబుగ నీ పేర వేంకటేశ. తెలుగులో ఉన్న పద్య నిఘంటువులకు గణపవరపు వేంకటకవి ఆద్యుడనే చెప్పాలి. ఆయనదే అకారాది దేశీయంధ్ర నిఘంటువు (1650) పైడిపాటి ఏకామ్ర మంత్రి గారి లక్ష్మణ కవి కృతమైన ఆంధ్రనామ సంగ్రహము (1700) పైడిపాటి అమరయ్య ఆంధ్ర రత్నాకరము (1700) అడిదము సూరకవి ఆంధ్రనామ విశేషం (1750) కస్తూరి రంగకవి సాంబ నిఘంటువు (1750) నుదురుపాటి వేంకట కవి ఆంధ్ర భాషార్ణవం (1769) పూసపాటి వీరపరాజు (1800ప్రాంతం) అలాగే ప్రగడపు వారి కందాలు, చౌడప్ప కవి డప్పు సీసాలు (30దాకా ఉన్నాయని జయంతి రామయ్య పంతులుగారు సూర్యారాయంధ్ర నిఘంటువు పీఠికలో చెప్పారు). ఇంకా నానార్థ నిఘంటువు, నానార్థ సార సంగ్రహం మొదలయినవి కన్పిస్తున్నాయని ఆరుద్ర వివరించాడు. అలాగే అగ్ని పురాణములోనూ నిఘంటువు ప్రక్రియ బీజాలున్నాయని, అదే అనంతర నిఘంటువులకు మార్గ దర్శకమనీ ఆనోటా ఈనోటా వినిపించే మాట. మామిడి వెంకయ్య ఆంధ్ర దీపిక (1848) ప్రాచీన ప్రబంధాల నుంచి అకారాది క్రమంలో గుది గూర్చిన నిఘంటువు బ్రౌన్ తదితరులకు ఉపయోగపడింది.

పాశ్చ్యాతులలో తెలుగు నిఘంటువు నిర్మాణానికి నాంది పలికినవారు ఫ్రెంచ్ వారే. 18వ శతాబ్దంలో గుంటూరులో ఫ్రెంచ్ మిషనరీలు కేంద్రంగా వారి కార్యకలాపాలు కొనసాగించారు. ప్రస్తుతం బిషప్ బంగ్లా అనే ప్రాంతంలోనే ఫ్రెంచ్ మిషనరీలు తమ విద్యా బోధనను ప్రారంభించారని 1975 ప్రాంతంలో స్వర్గీయ బిషప్ ఇగ్నేషియస్ ముమ్మడి స్వామి నాతో ప్రస్తావించారు. ఆనాటి వారి తొలి ప్రయత్నం పాఠశాలల స్థాపనకు కొంతమేర కృషి చేశారని అది స్థానికుల్లో ఏమాత్రం స్పందన లేనందువల్ల ఆప్రయత్నం విరమించుకున్నటు వారి ముఖాముఖి సంభాషణలో తెలియవచ్చింది. ఫ్రెంచ్ మిషనరీలే 1794 ప్రాంతంలో రూపొందించిన ఫ్రెంచ్-తెలుగు, తెలుగు-ఫ్రెంచ్ నిఘంటువుల రాత ప్రతులు 25 షిల్లింగులకు బ్రౌన్ కొన్నాడు. తెలుగు-ఫ్రెంచ్‌లో 12,500, ఫ్రెంచ్-తెలుగులో 14,800 పదాలున్నాయి. కాంబెల్ తన నిఘంటువుల నిర్మాణానికి ఈ నిఘంటువులు వాడాడు. Dictionarie Telengow or Badaga అనే పేర తయారయిందని బ్రౌన్ తెలియజేశాడు. ఇందులో ఎక్కువగా ఆనాటి వ్యావహారిక పదాలు, నిత్యం ఉపయోగించే మాటలున్నాయని తెలుస్తుంది. అలాగే జెసి. మారిస్ 1735-1839 ప్రాంతంలో మద్రాసు కళాశాల వారిచే ఒక నిఘంటువు ముద్రణ జరిగింది. వివరాలు పూర్తిగా తెలియవు. 1817లో విలియంబ్రౌన్ ఒక నిఘంటువు తయారు చేశాడని అంటారు. ఐతే దాని వివరాలు పెద్దగా తెలియవు. అలాగే బాల్జియల్ అనే పాశ్చాత్యుడు ఒక నిఘంటువు తయారుచేసి మద్రాసు కాలేజి బోర్డుకు సమర్పించాడు. దాని వివరాలు అలభ్యం. అలాగే బోయల్ అనే మరో పాశ్చాత్య పండితుడు తెలుగు నిఘంటువును తయారు చేశాడని, దానికి ఒక తెలుగు పండితుని సహాయం తీసుకున్నానని చెప్పాడు. ఇవి కేవలం లేఖలు, రిపోర్టులలో మాత్రమే లభ్యమయే వివరాలు. అంతకుమించిన ఆధారాలు లభించడం లేదు.

భారతదేశంలో అన్ని భాషలకన్నా మొదట అచ్చయిన నిఘంటువు అంతవొడాప్రోయన్‌కాస్ తయారు చేసిన తమిళము-పోర్చుగీసు నిఘంటువు. మలబార్‌లోని అంబలకాడ్ జెస్యూట్ ప్రెస్‌లో మదర్‌డేన్స్ కళాశాలవారు 1679లో ఈ నిఘంటువు అచ్చువేశారు. ఇందులో పోర్చుగీసు పదాలకు విడి అక్షరాల టైపును, తమిళ పదాలకు కొయ్య అచ్చులు ఉపయోగించారు. పాండిచ్చేరిలో ఈ ప్రతి ఉంది. గ్రెగ్‌షార్ప్ అనే వ్యక్తి తన ఆసక్తికొద్దీ 47 తెలుగు పదాలు సేకరించి అకొన్సీ పట్టణంలో1767లో అచ్చయిన సింటగ్మా డెసర్‌టేషియనమ్‌లో అనుబంధంగా యిచ్చాడు. 53 పదాలతో ఒక పదజాలాన్ని సంకలనం చేసి 11 ప్రాచ్యభాషల అర్థాలను రోమన్ లిపిలో సమకూర్చాడు. ఈ పుస్తకం 1782లో హలె, జర్మనీలో అచ్చయింది. నిఘంటు నిర్మాణంలో నూతన చరిత్ర సృష్టించిన విలియం కేరీని ఈ సందర్భంలో ప్రస్తావించుకోవాలి. సిరంపూరులో కేరీ రూపొందించిన బహుభాషా నిఘంటువు (Polyglott dictionary) 13 భాషల్లో అర్థాలు వివరించాడు. అమరకోశ పద్ధతిని అనుసరించి తయారు చేసిన ఈ నిఘంటువులో

తెలుగు కూడా ఉంది. 1812లో సిరంపూరు ప్రెస్ అగ్నికి ఆహుతి అయింది. అప్పటికే తయారుగా ఉంచిన ఈ నిఘంటువు తొలి పుటలు కొన్ని కాలిపోయినా మిగిలిన పుటలు నేటికి భద్రంగా ఉన్నాయి. సిరంపూరు విలియం కేరి గ్రంథాలయంలో ఈ నిఘంటువు ఉంది. గత వ్యాసాల్లో ఈ వివరాలు ఉన్నాయి.

భారతీయ భాషల గురించి సర్వే చేసిన గ్రియర్సన్ తెలుగులో వచ్చిన మొదటి నిఘంటువును గూర్చి ఎ వొకాబులరి ఆఫ్ జెంటూ అండ్ ఇంగ్లీష్ ఉపయోగంలోని పదాలను ఉదాహరణలతో సహా మామూలు సంభాషణలు, తెలుగువారు వాడే పదాలు ఇందులో సమకూర్చారు. ఉత్తర సర్కారులో చాలకాలం నివసించిన ఒక సీనియర్ మర్చంట్ రూపొందించిన ఈ నిఘంటువును మద్రాసు కమర్షియల్ ప్రెస్‌లో కాన్‌స్టాంటైన్ శాంపి 1818లో అచ్చు వేశారు. దీని పీఠిక మీద విలియం బ్రౌన్ సంతకం చేశాడు. 1821లో కాంబెల్ నిఘంటువు అచ్చయింది. Teloogoo - English Dictionary (1821) ఈ నిఘంటువులో ఇంగ్లీషులో అనేక అర్థాలు వివరించాడు. అరబిక్, పర్షియన్ పదాలను కూడా ఆయా లిపిలో ఇచ్చాడు. సంస్కృత పదాలు ఎక్కువగా ఎన్నిక చేస్తూ అక్కడక్కడా గ్రామ్య, దేశ్య పదాలు ఇచ్చాడు ఈ నిఘంటువులో చాలావరకు రాయలసీమ ప్రాంత పదాలున్నాయి. కాంబెల్ ఎక్కువగా బళ్ళారి ప్రాంతంలో పనిచేసిన నందువల్ల ఆ ప్రాంత భాషా ప్రభావం ఉండి ఉండవచ్చు. తొలి ప్రచురణలో 601 పుటలున్నాయి. ప్రతి పుటలో రెండు వరుసలు, వరుసకు 25 లైన్లు ఉన్నాయి. రెండవ ముద్రణ 1848లో మద్రాసు హిందూ ప్రెస్ నుంచి అచ్చయింది. రెండవ ముద్రణలో 312 పుటలున్నాయి. 1849లో మూడవ ముద్రణ వచ్చింది. అలాగే జె.నికోలస్ రాసిన ఇంగ్లీషు–తెలుగు పదకోశం 1832 మద్రాసులో అచ్చయింది. Teloogoo - English Dictionary ఇది ప్రజల ఆదరణకు గాని, ప్రభుత్వ దృష్టికి పెద్దగా రాలేదు. ప్రథమ ముద్రణ ప్రతి అడయార్ లైబ్రరీలోని అరుదైన పుస్తకాలలో భద్రపరచారు. 137 పుటలున్న ఈ నిఘంటువు అమరకోశ పద్ధతిలోనే ఉంది. నికోలస్ తెలుగు పదకోశంలో 30 అధ్యాయాలున్నాయి. 1.ఆకాశము, పంచభూతాలు, 2. మానవుడు–శరీరభాగాలు, 3. అనారోగ్యము 4. బంధువర్గము 5. బుద్ధి6. ఆహార పానియాలు 7. దుస్తులు 8. గృహము, గృహాల విషయాలు 9 నగరము నాగరికులు 10. కళలు, విజ్ఞానము 11. ఉపకరణలు, పనిముట్లు 12 శకటములు 13.నాటకాలు, పాటలు, సంగీతం 14. చర్చి భగవద్భక్తి 15. పాఠశాల, విద్య 16 వ్యాపారము సంబంధిత విషయాలు 17. గ్రామము, వ్యవసాయము 18.చెట్లు పొదలు, మొక్కలు 19. జంతువులు 20. పక్షులు, విహంగములు 21. చేపలు, జలచరములు 22. విష జంతువులు 23.ఖనిజాలు, జంతు శిలాజాలు, లోహాలు 24 రంగులు 25 యుద్ధము, ఆయుధాలు 26 నౌకలు, నౌకా విషయాలు 27 గౌరవాలు బిరుదులు 28 నాటకాలు – మనోల్లాసాలు 29. కాలము 30. అంకెలు, కొలతలు, బరువులు, నాణెములు. ఆపై మరో రెండు అనుబంధాలు కూడా చేర్చాడు.

అనంతరం జాన్ కర్నక్ మారిస్ (Teloogoo - English Dictionary) తయారు చేసిన Teloogoo - English Dictionary (1835) మొదటిగా మద్రాసు అసైలమ్ హెరాల్డ్ ప్రెస్‌లో 1835లో అచ్చు వేశాడు. రెండవ సంపుటి అదే ప్రెస్‌లో 1839లో అచ్చువేశారు. మొదటి సంపుటిలో 586 పుటలు, రెండవ సంపుటిలో 532 పుటలున్నాయి. ఈ ప్రతులు నేషనల్ లైబ్రరీ కలకత్తాలో (ఇది స్వయంగా 1975లో చూశాను) మద్రాసు యూనివర్సిటీ లైబ్రరీలో, బ్రిటీష్ మ్యూజియం లండన్‌లో ఉన్నాయి.

1842లో తెలుగు స్పెల్లింగ్ అసిస్టెంట్ (Teloogoo - English Dictionary) అనే పదకోశం పాఠశాల విద్యార్థులకోసం SPCK (సొసైటి ఫర్ ప్రాపగేషన్ ఆఫ్ క్రిస్టియన్ నాలెడ్జ్) వారు మద్రాసు వేపెరి ప్రెస్‌లోలో ముద్రించారు. ఇందులో TeloogooLexicon అనే శీర్షికతో తెలుగు అక్షర నిఘంటు పుస్తకము అనే పేర పదాలకు నానార్థాలిచ్చారు. తెలుగు నిఘంటువులో ఇంగ్లీషు–తెలుగు–తమిళంలో కూర్చిన నిఘంటువు, ఒకటి 1851లో మద్రాసులోనే లూయీ అనే అధ్యాపకుని శిష్యుడు అచ్చు వేశాడు. ఆంగ్ల పదాలకు తెలుగు, తమిళంలో అర్థాలున్నాయి. ఈ ప్రతులు పాండిచ్చేరి ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండాలజీలో ఒక ప్రతి, ఇండియా ఆఫీసు లైబ్రరి, లండన్‌లో ఒక ప్రతి ఉన్నాయి. పాశ్చాత్యులు రచించిన నిఘంటువులను చెప్పేటప్పుడు సి.పి.బ్రౌన్ తయారు చేసిన నిఘంటువులను ప్రస్తావిస్తేనే అది సంపూర్ణం అవుతుంది. బ్రౌన్ నిఘంటువులకే బ్రౌణ్యమనే పేరు. బ్రౌన్ కీర్తిని అజరామరం చేసింది నిఘంటువులనే చెప్పాలి. నూరార్లుగా కావ్యాలు, శతకాలు, మరెన్నో గ్రంథాలను పరిష్కరించి బ్రౌన్ మహాశయుడు తన నిఘంటువుల్లో సాధారణ వ్యావహారిక పదాలు, జనసామాన్యలో ఉన్న మాటలను స్వీకరించి ప్రాణం పోశాడు.

బ్రౌన్ నిఘంటువుల్లో ఆంగ్ల పదాలకు తెలుగు అర్థాలివ్వాలి. జాన్సన్ రూపొందించిన నిఘంటువును విడదీసి కాగితాల మధ్య తెల్ల కాగితాలు కుట్టించాడు. తెల్లకాగితాల మీద తననోట్సుతో పాటు సరయిన అర్థాలు రాశాడు. ఈ చిత్తు ప్రతి మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరిలో 12 సంపుటాల్లో నేటికి ఉంది. బ్రౌన్ నిఘంటువు కన్నా ముందే ఒకటి ఉంది. దీని లిఖిత ప్రతిలో 1618 పుటలున్నాయి. ప్రతిపుటకు 25 పంక్తులున్నాయి. ప్రతి పుటకు 25 పంక్తులున్నాయి. ఈ పదనిధి 1841 డిసెంబర్‌లో ప్రారంభించి మూడు సంపుటాల్లో పూరించాడు. 1852లో పూర్తి చేసిన ఇంగ్లీషు తెలుగు నిఘంటువులో 1304+20 పుటలున్నాయి. తొలిగా రాత ప్రతులు నాలుగు సంపుటాలుగా చేశారు. మద్రాసు ISPCK వారు 3 సంపుటాలుగా ముద్రించారు. అలాగే తెలుగు–ఇంగ్లీషు నిఘంటువుకు అదే పరిమాణంలో అదే కాలంలో అచ్చయింది. 1852లో జిల్లా నిఘంటువు అచ్చయింది. ఇందులో 132 పుటలున్నాయి. ఈ ప్రతి నేషనల్ ఆర్కైవ్స్, న్యూఢిల్లీలో ఉంది. 1854లో ఎడిక్షనర ఆఫ్ మిక్స్‌డ్ డయలెక్ట్స్ అండ్ ఫారిన్ వార్డ్స్ అనే నిఘంటువును క్రిస్టియన్ నాలెడ్స్ సొసైటీ, మద్రాసు (వేపేరి)వారు ముద్రించారు. ఇందులో 131 పుటలున్నాయి. అలాగే Galletties Telugu Dictionary 1935లో రచించినది ఒకటి వచ్చింది. Swetlana రచించిన Telugu Russian Dictionary 1972లో మరొకటి కనిపిస్తుంది. ఇంకా పరిశీలనకురానివెన్నో ఉన్నాయి. సి.పి.బ్రౌన్ రచనలు సాహిత్యం వివరాలు తరువాత సంచికలో.

ఈ వ్యాసం కేవలం విహంగావలోకనం మాత్రమే. అదీ పాక్షికంగానే.

అమ్మనుడిపై నెనరు లేనివాడు కన్నతల్లినీ, పుట్టిన నేలనీ ప్రేమించలేడు..

ముకుందరామారావు
99083 47273

అనేక భాషల స్వరాల భారతీయ కవిత్వం



"అదే నేల: భారతీయ కవిత్వం – నేపథ్యం" అన్న నా గ్రంథానికి తాపీ ధర్మారావు పురస్కారంతో సత్కరించిన సందర్భంగా (18 సెప్టెంబరు 2021) ఈ వ్యాసం. సాహిత్య అకాడమీ గుర్తింపు పొందిన భారతీయ భాషల నుండేకాకుండా, పాలీ ప్రాకృత భాషలతో పాటు,కవిత్వంతో అలరారుతున్న విభిన్న గిరిజన భాషలు – వాటన్నింటిలోని దాదాపు మూడు వేల మంది కవుల ప్రస్తావన, ఏడు వందలకు పైగా కవుల కవితల అనువాదాలు, 896 పేజీల ఈ గ్రంథంలో ఉన్నాయి. 117 పేజీల 160 కవితల ఆదివాసుల కవిత్వం అందులో ఒక భాగం.

భారతదేశం అనేక భాషలలో రాస్తూ, అంతకంటే ఎక్కువ స్వరాలలో మాటాడుతుంది. అయినా విభిన్న భాషల మూలంగా సమాచార మార్పిడి దెబ్బతినలేదు. తెలియని భాషలో, భారతదేశంలో ఎక్కడైనా ఉండాల్సి వస్తే, అక్కడి భాషని నేర్చుకోవడమో, లేదా హిందీనో, ఆంగ్లాన్నో ఆశ్రయించి ఎవరైనా నెట్టుకు రాగలగడం అందరికీ తెలిసిన విషయం. ఏ భాషనైనా ఇముడ్చుకునే శక్తి, సంలీనత, దృఢ విశ్వాసం భారతీయులందరిలో ఉండటం మూలంగా ఈ బహుముఖీనత సాధ్యమయింది. దేశం ఒకటే అయినా అభివ్యక్తులు అనేకం. చైనా, కొరియా, జాపాన్లాంటి దేశభాషలలాగ, భారతీయభాషలలోని ఏదోఒక భాషని, ఇదే భారతీయభాష అని ఎవరికీ ఇప్పటికీ చెప్పలేము. అయితేనేం భారతీయ భాషలన్నింటికీ దేని ప్రత్యేకత దానికుంది.

మౌఖికంగా కొన్ని వేల సంవత్సరాలు కాపాడుకుంటూ వచ్చి, పాడటానికి, పఠించడానికే పరిమితమైన వైదిక సంస్కృత సాహిత్యానికైనా, సింధూ నాగరికత కాలం వరకూ రాత రూపం సమకూరలేదు. అంటే నాలుగువేల సంవత్సరాల పూర్వం వరకూ భారతదేశానికి మౌఖిక సాహిత్యం తప్ప, లిఖిత సాహిత్యం లేదు. సింధూ నాగిరకత కాలం నాటి రాతలిపులు ఎవరూ సరిగ్గా తెలుసుకోలేక కాలగర్భంలో కలిసిపోయాయి. క్రీ.పూ. 500 నాటికే బ్రాహ్మీ, ఖరోష్ఠీ లేదా గాంధారీ లాంటి లిపులు సమకూర్చుకోగలిగారు. ఈ బ్రాహ్మీలిపి క్రీ.పూ. 8 వ శతాబ్దం నాటిదని అంచనా. బ్రాహ్మీలిపికి సమకాలీన ఖరోష్ఠీలిపి ప్రాథమికంగా ప్రాకృతానికి వాడుకున్నా, క్రీ.శ. 3–4 నాటికి అదీ అంతరించిపోయింది. ఇటీవల నిర్వహించిన సర్వేక్షణ ప్రకారం 25 లిపుల వరకూ మనకు ఉన్నట్టు తేలినా, అందులో 14 మాత్రమే ప్రధానమైన లిపులు. ఆ 14లో 12 లిపులు, బ్రాహ్మీలిపి నుండి వచ్చినవే.

ప్రాచీన ధార్మిక సాహిత్యాలన్నింటా (హిందూ, జైనం, బౌద్ధం ఏ మతమైనా) ఆత్మ పరమాత్మ మధ్య సంబంధాన్ని గ్రహించడం, వాస్తవం నుండి అవాస్తవాన్ని గుర్తించడం, ప్రముఖంగా ప్రస్తావించబడ్డాయి. విధితం కాని దాన్నేదో అన్వేషించడం భారతీయుల కళల్ని, వాస్తుకళని సైతం ప్రభావితం చేసింది. భరతముని క్రీ.పూ (1–3) మధ్య, మానవ మనోభావాల్ని నవరసాలుగా సూత్రీకరించగలిగారంటే వారు ఎంత గొప్ప ఆలోచనాపరులో, పండితులో అర్థం చేసుకోవచ్చు. వాటిని సాహిత్య సాంస్కృతిక రూపాలన్నింటా చూడగిలిగారు, చూపగలిగారు. అది బహుశా ప్రపంచ సాహిత్యానికే మార్గదర్శకంగా చెప్పుకోవచ్చు. అలాగే ఆనందవర్ధనుడు(820–890), కవిత్వంలో ధ్వనికి సంబంధించిన ధ్వన్యాలోకం గ్రంథం కూడా ప్రపంచ సాహిత్యంలో మార్గదర్శక రచన.

ప్రపంచ భూభాగంలో 2.4 శాతం మాత్రం భారతదేశానిది, అయినా 1995 నాటికే ప్రపంచ జనాభాలో 16 శాతం జనాభా కలిగి ఉంది. 1652 మాతృభాషలున్నాయని, అందులో విదేశీ సంపర్కంతో వచ్చినవి 103 అని 1961 జనాభాలెక్కలు తేల్చాయి. ప్రపంచంలో కొత్త గయానా తరువాత అత్యధిక భాషలున్న దేశం మనదే.

2001 గణాంకాల ప్రకారం పదివేలకంటే ఎక్కువగా ప్రజలున్న 234 మాతృభాషలు మనకు ఉన్నాయి. అందులో87 భాషలకు ముద్రణమాధ్యమం, 71 భాషల్లో రేడియో ప్రసారాలు ఉన్నాయి. దేశ పరిపాలన 13 వివిధ భాషల్లో కొనసాగుతోంది. అనేక భాషలు అంతరించి పోయినా, 2010 నుండి తీసుకున్న ప్రజల భాషా సంబంధిత సర్వేక్షణ లెక్కల ప్రకారం 860 విభిన్న భాషలున్నట్టు కనుగొన్నారు. గత 50 సంవత్సరాలలో కనీసం 220 భాషలు కనుమరుగయ్యాయి. మరో 400 భాషల వరకూ కోల్పోయే ప్రమాదం ఉందని భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం. వాటిల్లో తీర ప్రాంతాల్లో ఉన్న భాషలే ఎక్కువ. తీరప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో జీవనం దుర్భరంగా మారుతుండడంతో వారు నగరాలకు వలసబాట పడుతుండటం అందుకు కారణం. అయితే కొన్ని భాషలు – ఒడిసా, చత్తీస్ఘర్, మహారాష్ట్రలో మాట్లాడే సంతాలీ–గోండియా భాషలు, మహారాష్ట్ర గుజరాతీ రాజస్థాన్లో మాట్లాడే భీలి, మిజోరాంలో మాటాడే మిజో,

మేఘాలయాలో మాట్లాడే గారో–ఖాసీ భాషలు, త్రిపురలో మాట్లాడే కోక్బురాక్ రానురాను అభివృద్ధి చెందుతున్నాయి. ఆయా భాషల్లోని విద్యాధికులు వారి భాషలను కాపాడుకోవాలనే ప్రయత్నం ముమ్మరంగా చేస్తున్నారు. అంతేకాదు అందరూ అనుకుంటున్నట్టు హిందీ గాని, ఆంగ్లం గాని – ప్రముఖ భాషలైన మరాఠీ, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం, బెంగాలీ, ఒడియా, గుజరాతీ, పంజాబీలాంటి భాషల ఉనికిని పోగొట్టలేక పోయాయి. ఒక భాష పుట్టుక వెనక కొన్ని వందల సంవత్సరాల మానవ పరిశ్రమ మేధస్సు పనిచేసిందన్న విషయం నిర్వివాదాంశం. దానిని పోగొట్టుకోవడం అంటే మన పూర్వీకులు మనకోసం శ్రమకోర్చి వదిలిన అమూల్య నిధిని బూడిదపాలు చేయడం.

1956లో 14 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఉన్న భారతదేశం, 2014 నాటికి 29 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలయ్యాయి. అయా రాష్ట్రాలు ప్రాంతాల్లో ముఖ్యమైన అధికారిక భాషలు వేరు వేరు. భారతీయ భాషలకొస్తే భాషా ప్రయుక్త రాష్ట్రాలే అయినా, కొన్ని రాష్ట్రాలకు ఆ రాష్ట్రానికి చెందిన భాష లేదు. రాజస్థాన్, అరుణాచలప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, లాంటివి. కొన్ని భాషలకు రాష్ట్రాలు లేవు – సింధీ, నేపాలీ, డోగ్రీ, మైథిలి లాంటి వాటికి. కొన్ని భాషలకు లిపులు లేక అక్కడి ప్రముఖ భాషా లిపులను వాడుతున్నారు. బోడో, కొంకిణీ మొదలైనవి. ఇతర భాషా లిపులు వాడుతున్న భాషలు ఎక్కువ కాలం మనలేకపోతున్నాయి. ప్రతి రెండువారాలకు ప్రపంచంలో ఒక భాష తన ఉనికిని కోల్పోతుందని చెప్పుకోవడం కాస్త అతిశయోక్తిగానే ఉన్నా, అది నిజమని ఆందోళన చెందుతున్నారు భాషాశాస్త్రవేత్తలు. ఈ శతాబ్దాంతానికి మిగిలిన ఏడువేల భాషల్లో ఏవి మిగులుతాయో తెలియదన్న ఆందోళన భాషాశాస్త్రవేత్తలు వెలిబుచ్చుతూనే ఉన్నారు. ఇలా భాషలు కనుమరుగవడానికి కారణం – ఆ భాషీయుల సంఖ్య క్రమేపీ తగ్గుతుండడం, ఆ భాషలో జీవనోపాధి లేకపోవడం, ఇలా ఎన్నో కారణాలున్నాయి. అ భాషలకు కేవలం లిపి లేక కాదు, లిపి ఉన్న వాటి పరిస్థితిలో కూడా మార్పులేకపోవడమే విషాదం. ఆంగ్లానికి సైతం తనసొంత లిపి లేదు. రోమన్ లిపిలో ఆంగ్లం ఉంది. దేవభాషగా చెప్పబడే సంస్కృతం నాగరీలిపిలో ఉంది. మరాఠీ, హిందీలాంటి భాషలకు సైతం అదే వాడబడుతోంది. ఎన్ని భాషలుంటే అన్ని ప్రత్యేక లిపులు లేవు. ఏదైతేనేమి ఏ భాషనైనా ప్రతిబింబించ గలిగే అద్దం లాంటిది మాత్రమే లిపి. అంతరించిపోయిన భాషలు అంతరించిపోయిన జాతుల్లాగానే తిరిగిరావు.

12వ శతాబ్దపు క్షేమేంద్రుడు, మన ఆదిభాష సంస్కృతంలోని కవికంఠాభరణంలో చెప్పినట్టు –ఆకుల స్వరూపాల్ని –/ కవి తన కంటితో చదవగలగాలి/ వాటిలోని సముద్రాలు పర్వతాలు/ సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు తెలియాలి/అతని మనస్సు రుతువుల్లోకి ప్రవేశించాలి/ అనేక మనుషుల మధ్యకు పోయి/ వారి భాషల్ని అభ్యసించాలి.

ఇది సాధ్యమయినా కాకపోయినా తెలిసిన భాషలతోనే అనేక ఇతర భాషలు తెలుసుకునే వెసులుబాటు ఇప్పుడు అందరికీ పుష్కలంగానే ఉంది. దానిని అందిపుచ్చుకోగలిగితే, తెలుసుకున్న కొద్ది భాషలతోనైనా, మనకు తెలియని వివిధ భాషల్లోని సాహిత్యం రానురాను అందరికీ దగ్గరవుతూనే ఉంది. ప్రసార సాంకేతికత పెరుగుతున్నకొద్దీ ఇది మరింతగా అందుబాటులోకి వస్తోంది. క్షేమేంద్రుడు సూచించినట్టు ఎక్కువ మనుషుల మధ్యకు పోగలుగుతున్నాం, వారి భాషల్లోని అనేక విషయాలను తెలుసుకోగలుగుతున్నాం.

అయితే భాషలపరంగా చూస్తే భారతీయ కవిత్వాన్ని రెండు భాగాలుగా చూడొచ్చు. మొదటిది – సంస్కృతం, పాలీ, ప్రాకృతం, అపభ్రంశం. రెండవది – ఆధునిక భారతీయభాషలు, అందులో అదనంగా చేరినవి దేశీభాషలు ఆంగ్లం, ఉర్దూ. మొదటి భాషలకు ఎంత దూరమయినా, దూరమవుతున్నా, రెండవ భాషల మీద మొదటి భాషల ప్రభావం లేకుండాపోలేదు. ఈ రెండవ భాషల మీద విదేశీ భాషల ప్రభావం కూడా ఎక్కువగానే ఉంది. అంతే కాకుండా ఈ భాషల సమయానికి రెండు ప్రపంచయుద్ధాలు, భక్తి ఉద్యమాలు, స్వాతంత్ర్యసమరాలు, స్వతంత్రం సిద్ధించాక పరిణామాలు, రాజకీయాలు, సామాజిక పరిస్థితులు, స్థానిక ప్రాంతీయ జాతీయ అంతర్జాతీయ సమస్యలు, అనుకూల ప్రతికూల ఆందోళనలు, కక్షలు కార్పణ్యాలు, ఆశానిరాశల మధ్య ఊగిసలాటలు, ఇలా ఎన్నో వారి కవిత్వాల మీద ప్రభావం చూపిస్తూనే ఉన్నాయి. అంతే కాకుండా ఇందులో దళితులు, ఆదివాసీలు, స్త్రీలు, ప్రగతిశీలవాదులు, మధ్యతరగతికి చెందినవారు, వారివారి విలక్షణ తని చెప్పదలుచుకున్న వాటిని ధైర్యంగా నిస్సందేహంగా కవిత్వమాధ్యమంలో బలంగా చెప్పగలుగుతున్నారు. ఆ ఉద్యమాల మూలంగా భారతీయ కవిత్వంలో వారిదైన అద్భుతమైన కొత్త కవిత్వం చోటుచేసుకుంటూనే ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వకవులకు, మనుషుల దేవుళ్ల వీరోచిత విషయాలు, ప్రకృతి వర్ణనలు, జాతీయ ఆదర్శాలు, ఆచారాలు, నమ్మకాలు వాటిమీద శ్రద్ధ వారి కవిత్వమంతా పరుచుకునేవి. కానీ ఆధునిక భారతీయ కవి అనేక విషయాలలో సతమతం కావడంతో తన పాత్ర అత్యంత జటిలమవుతోంది.

భారతీయ కవిత్వం మీద ముందుగా సంస్కృత ప్రభావం ఉన్నట్టే, తరువాత కాలంలో ముఖ్యంగా పరదేశీయుల రాకమొదలు ఫారసీ, ఉర్దూ, చివరికి ఆంగ్ల కవిత్వంతో పాటు, బహుముఖీన ఇతరదేశాల ప్రభావం కూడా ఉంది. స్వాతంత్ర్య సమయానికి ఎక్కువగా ప్రభావితం చేసిన ఆంగ్లం మూలంగా, పశ్చిమ దేశాల కవిత్వప్రభావమూ తోడయింది. ఆ కారణంగా **భారతీయ కవిత్వానికి పునాదులు సంస్కృతమే అయినా, ఆధునిక హంగులకు మూలం పశ్చిమ దేశాల కవిత్వం. అయితే ఈ ప్రభావాలలో చిక్కుకుని భారతీయ కవిత్వం, భారతీయత కోల్పోకుండా కాపాడుకోవడం విశిష్టంగా కనిపిస్తుంది.**

ఇతర భారతీయ భాషల్లో కవిత్వం ఎలా ఉంది, ఏమి జరుగుతోంది అన్న ఆసక్తితోబాటు, వాటితో పరిచయం ఏర్పర్చుకోవడం కూడా ఎంతవరకు సాధ్యపడుతుందో అన్న ఆందోళన నన్ను చాన్నాళ్లుగా వేధిస్తూ వచ్చింది. పైగా చెప్పుకుందుకు మన భారతీయ భాషలే అయినా అవి చాలావరకు నాకు తెలియని పరభాషలు. అందులోని ఏవి తెలుసుకోవాలన్నా, నాకు తెలిసిన పరిమిత భాషలైన హిందీ, ఆంగ్లం, బెంగాలీలాంటి భాషలలోనే నేను పయనించాల్సి రావడం కొంతైనా నాకు తోడ్పడ్డాయి. వాటి మూలంగా ఆయా భాషల కవిత్వాల్లోకి

ప్రవేశిస్తున్నకొద్దీ, అదేదో పరభాషగా నాకు అనిపించేది కాదు. నేను ఆయా భాషలకవుల్లోని ఒకడిగా నాకు తోచేది. హెచ్చుతగ్గులు ఉన్నా, ఆ కవిత్వాలు మనవి గానే నేను అనుకున్న సందర్భాలు అనేకం. అది ఒక విధంగా నాకు ఆనందాన్ని ఆశ్చర్యాన్ని కలగజేసేది. ఇంత సామీప్యానికి కారణం ఏమై ఉంటుంది, ఒకే దేశంలోని అదే నేలమీది సభ్యులం కావడమా, లేదంటే మన ఆది భాషలు, మన ప్రాచీన ఇతిహాసాలు, మన పూర్వీకులు వేసిన బలమైన పునాదులా అన్నది ఇంకాస్త లోతుగా ఆలోచించాల్సిన విషయం. భారతీయ భాష ఏదైనా నా భాషగానే నన్ను నేను అందులో చూసుకోవడాన్ని, అనువాదానికైనా అంతగా పరీక్షకు పెట్టేవి, భారతీయ భాషల్లో నాకు ఎదురుకాలేదు. భాష, ప్రాంతం మూలంగా, ఆయా కవితలు వాటి చారిత్రక ప్రాముఖ్యత మూలంగా, కొన్ని వాటి ఏకైకత మూలంగా, కొన్ని వాటి సాధారణ ప్రజాదరణ మూలంగా, మరికొన్ని వాటి శక్తిమంతమైన ధోరణుల మూలంగా, అలా ఎన్నో అవి అంత ప్రత్యేకంగా ఎందుకు ఉన్నాయో తెలియజేసేవి. అయినా ఉపఖండంలోని ఇతర భాషలకు అవి మరీ దూరం అనిపించకపోవడమే, భారతీయ భాషల్లోని విశేషగుణం.

భారతీయ భాషల్లో కవుల సంఖ్య ఏ భాషలోనైనా ఎక్కువే. అయితే చాలా వరకు భాషల్లో వారి భాష పట్ల విపరీతమైన అభిమానం ప్రేమ వారికి ఉన్నాయి. ఆ కారణంగా అక్కడ ఇతర భాషలు తెలిసినవారు, తమ భాషని, అందులోని సాహిత్యాన్ని అన్ని విధాలా అందరికీ చేర్చే ప్రయత్నం తమకు తామే చేస్తున్నారు. ఆయా భాషల్లోని కవిత్వం ఎవరికైనా చేరటానికి అదొక్కటే కారణం కాదు, మరొక భాషలో తమ సాహిత్యాన్ని, ఇతర భాషీయులదగ్గరగా తీసుకుపోయే ప్రయత్నంలో వారు చాలావరకు విజయం సాధిస్తున్నారు. సాహిత్యకారుల్లో సహజంగా కనిపించే రాజకీయాలు వారిలో ఎన్ని ఉన్నా, ఇతర భాషీయుల ముందు తమ సాహిత్యకారుల గొప్పతనం విషయంలో వారందరిదీ ఒకే స్వరం. ఆ కారణంగా వారి సాహిత్యకారులకు జాతీయ అవార్డులు సైతం సాధించుకోవడంలో వారు సఫలీకృతులవుతున్నారు.

భారతీయ భాషల మధ్య ఆశించినంతమేర సాహిత్య ఆదానప్రదానాలు ఇప్పటికీ జరగకపోవడం విషాదం. ఎవరి భాష వారికి గొప్పగా ఉన్నా, ఎవరి సాహిత్యం వారికి ఎంతో ఉన్నతంగా ఉన్నా, ఇతర భాషల్లో వారిని ఆకర్షించే స్థాయిలో సాహిత్యం లేదనుకోవటం, లేదా ఇతర భాషల పట్ల ఒక విధమైన చిన్న చూపుచూడటం, కొంత ఆందోళన కలిగిస్తున్న అంశం.

జాతీయంగానో, ప్రాంతీయంగానో ఉద్యమాలు, ప్రతికూల ఉద్యమాలు, సంప్రదాయాలు, మతాలు, విభిన్న వైఖరుల మూలంగా భారతీయ కవిత్వం అనేక మార్పులకు లోనవుతూ వచ్చింది. ఇప్పుడు జాతీయ సమస్యల పట్ల తప్ప, ఏ ప్రాంతం సమస్యలు వారివేగా అనాదిగా వస్తూ ఉండటం కవిత్వంలోనూ కనిపిస్తుంది. అవి ఒక్కోమారు జాతీయంగా మార్పులకు దోహదపడితే, ఒక్కోమారు ప్రాంతీయానికే పరిమితమై ఉండిపోయాయి. అయితే ఆ ప్రాంతపు కాలమాన పరిస్థితులను అవి ప్రతిబింబించడం మూలంగా, ఆయా ప్రాంతాల చరిత్రను, సామాజిక మార్పుల్ని, అన్ని సందర్భాల్లోనూ గమనిస్తూ వారి కవిత్వాల్లో నమోదు చేయడంలో కవులంతా ముందుండటం భారతీయ భాషలన్నింటిలోనూ సుస్పష్టం. స్వాతంత్ర్యానికి పూర్వం అనేక ఒత్తిడుల మధ్య నలిగిన స్త్రీలు, దళితులు, ఆదివాసీలు, తమ వేదనని ఆవేదనని ఆక్రోషాల్ని ఏదోఒక రూపంలో వ్యక్తం చేయగలుగుతున్నారు. అంతకు ముందు లేనంతగా అందరి దృష్టినీ తమ స్వరాల వైపు ఆకర్షించుకోగలుగుతున్నారు. వాటిమూలాన భారతీయభాషల మధ్య ఆకస్మిక నిరంతర స్పృహ నెలకుంటూ వచ్చింది. అవి వైవిధ్యమైన వాదాలకు దారితీసింది. రానురాను కవిత్వం సమాజంలోని ఏ ఒక్క వర్గానికో పరిమితం కాకుండా అన్ని వర్గాల సంలగ్నతతో మరింత సంపన్నమవుతూ వస్తోంది. గతాన్ని మరచిపోకుండా, గడుస్తున్న దానిలో లీనమవుతూ, రాబోయే వాటి మీద దృష్టిపెడుతూ ఇప్పటివరకే కాదు, మున్ముందు కూడా అలాగే సాగుతుందన్న నమ్మకాన్ని భారతీయ కవిత్వం ఎవరికైనా కలిగిస్తుంది.

ప్రముఖ హిందీ కవి కేదారనాథ్ సింగ్ (1934-2018), 'హిందీ' భాషకోసం చెప్పిన ఈ క్రింది కవిత నిజానికి భారతీయ భాషలన్నింటికీ వర్తిస్తుంది. *"చెప్పకుండా కూడా తెలుసు నా నాలుకకి/ దాని వీపు మీద మరచిపోయిన/ ఎన్ని గాయాల గుర్తులున్నాయో/ దాని అనేక క్రియాపదాలకు నిద్ర రాదు/ రాత్రులు రాత్రులు/ దాని అనేక విశేషణాలు తరచు గాయపడుతుంటాయి./భాష, రాజ భాష కాదు/ భాష భాషే, కేవలం భాషగానే ఉండనివ్వండి నా భాషను/ అరబ్బీ టర్కీ బెంగాలీ తెలుగూ/ ఆకు అల్లల్లాడే ధ్వని కూడా/ కొద్ది కొద్దిగా/ నేను మాటాడుతూనే ఉంటాను/ హిందీ మాటాడుతున్నప్పుడు"*

మన దేశంలో మన భాషకాని సాహిత్యాన్ని, అత్యధికం ఆంగ్ల మాధ్యమం ద్వారానే చేరుకోగలుగుతున్నాం. అంతెందుకు మన ఇరుగుపొరుగు భాషల అనువాదాలయినా ఆంగ్లమో, మరీగిరీ అయితే హిందీనో ఆశ్రయిస్తున్నాం. పశ్చిమ దేశాలతో పోలిస్తే మన దేశంలో అనువాదాల సంఖ్య తక్కువనే చెప్పుకోవాలి. ఒకప్పుడు సంస్కృతం మనకు అనువాదం చేసుకుందుకు తరగని గనిలా ఉండింది. ఇప్పుడు సంస్కృతం అయినా అధారపడుతున్నది, దాని ఆంగ్లం లేదా హిందీ అనువదల మీదనే. అనువాదాలను చేయిస్తున్న లేదా ప్రోత్సహిస్తున్న సంస్థలు కూడా మనకు తక్కువే. ఉన్నా వాటికున్న పరిధులు వాటికున్నాయి. వ్యక్తులు చేస్తున్న అనువాదాలు, పుస్తకాల రూపంలో వచ్చినా అవి ఎందరికి చేరుతున్నాయి, ఎన్ని నిలుస్తాన్నాయన్నది అనుమానాస్పదమే. మన దేశంలో హిందీ, మరాఠీ, మలయాళం, బెంగాలీ, ఒడియా, కొంతవరకు కన్నడం కూడా అనువాదాల్ని ప్రోత్సహిస్తున్నాయి. ఫలితంగా అక్కడి సాహిత్యంలో మార్పు, వారు తతిమా భాషలకంటే సాహిత్యంలో ముందంజలో ఉండటం మనం గమనించవచ్చు. ఒకప్పుడు అమెరికా, రష్యా, చైనా దేశాల అనువాద సాహిత్యం తెలుగులో సైతం విరివిగా వచ్చేది. మన భాషే అయినా మనకు తెలియకుండా మనం చేసుకుంటున్నది కూడా అనువాదమే. అనువాదం ఒకవిధంగా మనజీవితంలో భాగం. ఎవరో అన్నట్టు మన మనస్సు భాషకు అద్దం. నాలుక ఆ భాషా స్వరాలకు యంత్రం.

రచయితలకు కవులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతి పెద్ద సమస్యల్లా, వారు ఎవరికోసం రాస్తున్నారో, ఎవరు తాము రాసినవి చదువుతున్నారో, ఎందరు చదువుతున్నారో వారికే చాలావరకు

కవిత

అతడు ఈ యుగం సూర్యుడు

అతడు
సముద్రాన్ని చిలికి
వెన్న తీసిన
తల్లి హృదయుడు –
అతడు
మానవతా శిఖరాగ్రాన
నిలబడిన ప్రజ్వలుడు –
అతడు
అక్షర ప్రపంచానికి
చక్రవర్తి –
అతడు
కులం గోడలు
కూల్చిన సంస్కర్త –
అతడు
ఖండాంతరాలు
ప్రయాణం చేసిన
అక్షర కాంతి
అతడు
భారతావనికి
నూతన వస్త్రాలు
ప్రసాదించిన నేతగాడు –

అతడు
స్త్రీ విముక్తికి
బాటలు వేసిన
మహానేత–
అతడు
అంటరాని జీవితాలకు ఓ వెన్నెల
–
అతడు
ముళ్ల పొదల్లో
మల్లెలు పూయించిన
తోటమాలి –
అతడు
తత్త్వాన్ని చిలికి
ప్రశ్నలు సృష్టించిన
మరో సోక్రటీసు –
అతడు
ఖండాల హద్దులను
చెరిపివేసి
ప్రపంచ గమనాన్ని
నిర్దేశించిన
దార్శనికుడు –

అతడు
రాజ్యాంగానికి,నీతికి
కిరీటం –
రాజ్యాంగ సృష్టికర్త –
అతడు
అస్పృశ్యతలో
"అ" ను కొట్టివేసిన
వ్యాకరణ కర్త –
అతడు
ఈ యుగం
సూర్యుడు –
అతడు
సింధూ నాగరికత
దళితుల సృష్టి అని
నిగ్గు తేల్చిన వాడు –
అతడు
మనుస్మృతిని
దగ్ధం చేసి
మానవ శాస్త్రాన్ని
సృష్టించిన బుద్ధుడు –
అతడు

బౌద్ధ జీవన ప్రభాతుడు –
అతడి
పుట్టినరోజు
భారతదేశానికి
మరో సరికొత్త
పుట్టినరోజు –
అతడు
అంబేద్కరుడు –
తరగని ప్రేమ పెన్నిధి –
అతడు
రాజ్యాధికార
దిక్సూచి –
అతని మార్గం
జీవన విముక్తికి
రాచబాట.
అతని మార్గంలో
పయనిద్దాం –
ప్రపంచ మానవాభ్యుదయంలో
భాగమౌదాం ః

డా. కత్తి పద్మారావు
9948748812


తెలియకపోవడం. రానురాను చదివేవారిసంఖ్య తగ్గిపోవడం, మరీముఖ్యంగా సాహిత్య పాఠకులసంఖ్య గణనీయంగా తగ్గడం, రాబోయే తరాల మీద ఏవిధంగా ప్రభావం చూపిస్తుందోనని సాహిత్యకారులు ఎంతగానో ఆందోళన చెందుతున్నారు.

చరిత్రపట్ల ఆధునికకవికి ఆసక్తి ఉన్నా, దానిని తనదైన పద్ధతిలో తాను తెలుసుకున్న వివరాలతో మరో కొత్త వ్యాఖ్యానంతో బయటపడుతూ ఉండటం భారతీయభాషలు అన్నింటిలోనూ ఉంది. ఆధునిక కవులు అనుకరణలోనే కాదు, నవీకరణలోనూ ముందంజలోనే ఉంటున్నారు. అంతకుముందులా వారికి, ఏవిధమైన ప్రతిబంధకాలూ లేవు. ఒక్కోమారు తాము ఏదిరాస్తున్నా కవిత్వమే అన్న ఆత్మవిశ్వాసం కూడా ఎక్కువగానే కనిపిస్తుంది. కొందరి విషయంలో మొక్కను వేర్లతో దాని మట్టినుండి వేరుచేసి, కొంతసేపు గాలిలో అలా ఉంచి, ఆ తరువాత మరోమట్టిలో దానిని బతికించుకోవడంలా ఉంటుంది. పశ్చిమదేశ ఏ కవిత్వధోరణులనూ భారతీయకవులు అనుకరించకుండా లేరు. ప్రతీకాత్మకవాదం, ప్రతిబింబవాదం, అనుభూతివాదం, అధివాస్తవికవాదం, మొదలైన అన్ని వాదాల్నీ వారు తమ కవిత్వంలో వాడుకున్నారు. అయితే వారు ఆ అద్దాలమేడల నుండి తొందరలోనే బయటపడి, వారి అనుభవాల వాస్తవికతల్ని, మానసిక, సామాజిక ఆర్థిక సాంస్కృతికతల్ని, వారి దైన సృజనాత్మక శక్తితో అద్భుతంగా చిత్రించగలుగుతున్నారు.

మౌఖిక కవిత్వం తమదైన మాతృభాషలో వచ్చిననాటికి, ఆ తరువాత లిఖిత కవిత్వం, మరీ ముఖ్యంగా సమకాలీన కవిత్వంలోకి (ఉదాహరణకు ఆదివాసీల కవిత్వం) వచ్చినప్పటికి, కవిత్వం మాతృభాషను పోగొట్టుకుందా, లేక మాతృభాష కవిత్వాన్ని పోగొట్టుకుందా అన్న సందేహం నాకు కలిగిన సందర్భాలు లేకుండా పోలేదు. బహుశా కవిత్వానికీ మాతృభాషకూ ఉన్న సంబంధం అటువంటిదేమో తెలియదు. ఎవరెంతగా గిరిగీసుకుని ఉన్నా, అనాదిగా కవిత్వం, ప్రయోగాల నుంచి, ప్రభావాల నుంచి, సామాజిక పరిస్థితుల నుంచి, అనేక మార్పులకు లోనవుతూనే ఉంది. కవిత్వం ఎప్పుడూ అంత నవనవంగా ఉండటానికి బహుశా కారణం అదే. భారతీయభాషల్లోని కవిత్వం రాబోయే కాలాల్లోనూ అంతే నిత్యనూతనంగా ఉంటుందన్నది కేవలం నా ఆశే కాదు, నా గట్టినమ్మకం కూడా.

మూలం: మైఖేల్ కారిథెర్స్
అనువాదం: డి.చంద్రశేఖర్
92900 91232

కాలాములకు బుద్ధుని ఉపదేశం



మైఖేల్ కారిథెర్స్ 1978లో, "The forest-dwelling monks of Lanka: an historical and anthropological study" అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందారు. 1992 లో ఆయన రాసిన "Why Humans have Cultures" అనే గ్రంథం ప్రపంచ ప్రసిద్ధి పొందింది. 1992 నుండి ఆయన Durham University Anthropology విభాగంలో ఆచార్యునిగా పనిచేస్తున్నారు. Oxford University వారు ప్రచురించిన Past Masters seriesలో భాగంగా, 1983లో ఆయన The Buddha అనే పుస్తకాన్ని రాశారు. 2012లో దీని తెలుగు అనువాదం "గౌతమ బుద్ధుడు" అనే పేరుతో పీకాక్ క్లాసిక్స్, హైదరాబాద్ వారిచే ప్రచురించబడింది. The Buddha నుండి ఎంపిక చేసి, అమ్మనుడి పత్రిక కోసం కొత్తగా అనువదించిన భాగమే ఈ వ్యాసం.

సామాన్య ప్రజలకు బుద్ధుడు చేసిన బోధనల పొందిక, కాలాముల నుద్దేశించి ఆయన చేసిన ఉపదేశంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సుత్తంలో, బుద్ధుడు కొందరు భిక్షువులతో కలిసి సంచరిస్తూ కేశపుత్తం అనే గ్రామానికి చేరి, అక్కడ విడిది చేసినట్లు చెప్పబడింది. ఆ ప్రాంతంలో నివసించే 'కాలామ' అనే ఒకజాతి జనులు బుద్ధుణ్ణి దర్శించి, తమ సమస్యను ఆయనకు తెలియజేస్తారు. అనేకమంది శ్రమణులు (బ్రాహ్మణేతర సత్యాన్వేషకులు), బ్రాహ్మణులు తరచూ వారి గ్రామానికి వచ్చి, తమ వాదాలను వినిపిస్తుంటారు. ఎవరికి వారు తమవాదమే సరైనదని, ఇతరుల వాదాలు తప్పని చెబుతుంటారు. ఇటువంటి స్థితిలో ఎవరు చెప్పేది సత్యమో, ఎవరిది అసత్యమో, ఎవరిని అనుసరించాలో, ఎవరిని నిరాకరించాలో తెలియని కాలాములు, తమ సందేహం తీర్చమని బుద్ధుణ్ణి కోరతారు. కాలాముల సందేహాన్ని తీర్చటంకోసం బుద్ధుడు చెప్పిన సమాధానం ద్వారా, ఆయన పిడివాది కాదని, మనిషికి గల విచక్షణా దృష్టిని ఆయన ప్రోత్సహించాడని తెలుస్తుంది. "దేనినైనా 'చాలకాలంగా వింటున్నది, సంప్రదాయంగా వస్తున్నది, పురాతన గ్రంథాల్లో చెప్పబడింది, మనకు తెలిసిన సిద్ధాంతానికి అనుగుణంగా ఉంది, లేదా మన గురువు చెప్పింది' అనే కారణంతో దానిని సత్యంగా స్వీకరించవద్దు" అని ఆయన కాలాములకు చెప్పాడు.

ఇదేదో చిత్తచాపల్యం గల వారి ఉబలాటాన్ని సంతృప్తిపర్చటం కోసం చెప్పిన బోధన అనుకుంటే, అది పొరపాటే అవుతుంది. తాను స్వయంగా ఉపయోగించే బుద్ధికుశలతను, హేతుదృష్టినే బుద్ధుడు కాలాములకు బోధించాడు. వీటిని ఉపయోగించటం ద్వారా కాలాములు తాను చెప్పే ధర్మం వైపు మొగ్గుతారని ఆయన భావించాడు. తరువాత ఆయన వారికి ఇలా చెప్పాడు:

"ఈ ధర్మాలు అకుశలమైనవి, ఇవి కుశలమైనవి; ఇవి వివేకవంతులు నిందించేవి, ఇవి వివేకవంతులు ప్రశంసించేవి; వీటిని స్వీకరించి ఆచరిస్తే హాని జరుగుతుంది, వీటిని స్వీకరించి ఆచరిస్తే మేలు జరుగుతుంది అని మీరు స్వయంగా తెలుసుకుని వేటిని నిరాకరించాలో, వేటిని స్వీకరించి ఆచరించాలో నిర్ణయించుకోండి."

ఈ సందేశం ద్వారా కాలాములు ఆచరించే నైతిక ధర్మం సూటిగా ఉంటుంది. వారు జీవహింస చెయ్యరు, ఇవ్వనిదానిని తీసుకోరు (దొంగతనం చెయ్యరు), తప్పుడు మాటలు చెప్పరు, అక్రమ శారీరక సంబంధాలు నెరపరు. వారు హానికరమైన పనులు చేసేటట్లు ఇతరులను ప్రేరేపించరు. కాలాముల జీవితానుభవం, ఇంకా యుక్తితో కూడిన ఆత్మపరిశీలన వారిని సహజంగానే ఈ నియమాల వైపు నడిచేటట్లు చేస్తాయి.

ముఖ్యంగా, ఈ సందేశంలో స్థానిక నేపధ్య ప్రభావం ఉన్నట్లు కనిపిస్తుంది. కాలాములు, తమ పొరుగుజాతి ప్రజలైన శాక్యులవలె, స్వయం నిర్ణయాధికారం గల స్వతంత్ర రాజ్యవ్యవస్థలో జీవిస్తున్నారని చెప్పటానికి తగిన ఆధారాలున్నాయి. కాని, వారు క్రమంగా కోసలరాజ్యపు ఆధిపత్యంలోకి లాగబడుతున్నారు. ఈ రకమైన రాజకీయ మరియు ఆర్థిక శక్తులు, సరళమైన ఏకజాతి రాజ్యంలో జీవిస్తున్న కాలాములను, ఆనాడు గంగానది పరివాహక ప్రాంతంలో పెంపొందుతున్న సంక్లిష్టమైన నాగరికతలోకి లాగుతున్నాయి. ఈ మార్పుకు బలం చేకూర్చే సాంస్కృతిక రూపాలను శ్రమణులు, బ్రాహ్మణులు చెబుతున్న విభిన్నమైన బోధనల్లో మనం గుర్తించవచ్చు.

జీవహింస, దొంగతనం, అబద్ధాలాడటం, కామదురాచారం వంటి అనైతిక చర్యలను విరమించాలనే నియమాలు కాలాములకు పూర్తిగా కొత్తవని అనుకోలేం. వారి సంస్కృతిలో ఇటువంటి నియమాలు ఏదోఒక రూపంలో ఉండివుండాలి. ఇలాంటి నైతిక నియమాలు అసలు

లేని సమాజాన్ని ఊహించటం కష్టం. అయితే, కాలాముల వంటి సమాజాల్లో, ఈ నైతిక విలువలు తార్కికంగా రూపొందకుండా, సహజంగా సంక్రమించిన సంప్రదాయ లక్షణాలుగా ఉండివుండొచ్చు. నూతనంగా తలెత్తుతున్న సామాజిక పరిస్థితుల్లో, ప్రశ్నించబడకుండా సంప్రదాయంగా అనుసరిస్తున్న నైతిక విలువలు తమ పట్టు కోల్పోతున్నాయి. కాబట్టి, మానవ జీవితపు మూలాల నుండి పుట్టిన ఇటువంటి నైతికతకు బుద్ధుడు హేతుబద్ధతతో కూడిన కొత్తరూపం కల్పించాడు. ఈ బోధనలో ప్రతిపాదించిన నైతిక విలువలు కాలాములకు మాత్రమే పరిమితమైనవి కావు. సమాజంలో రకరకాల వ్యక్తులు తమకు, ఇతరులకు ప్రయోజనకరంగా సహజీవనం సాగించవలసిన అనివార్యమైన పరిస్థితి వలన వీటి అవసరం ఏర్పడింది. ఈ నైతిక విలువలు అన్నిరకాల పరిస్థితులకు వర్తిస్తాయి.

బుద్ధుడు కాలాముల జీవితానికి కొత్త నైతిక పునాదిని అందించటం కంటే మరింత విశాలమైన దృష్టితో వ్యవహరించాడు. ఆయన బోధించిన నియమాలు కాలాములకు మాత్రమే గాక, వారితో వ్యవహరించే అందరికీ వర్తిస్తాయి. చిన్నవైన ఆదిమ సమాజాలు, నైతికత అనేది తమకు మాత్రమే పరిమితమని భావించటం సహజం. కాని ఇప్పుడు కాలాములు బయటి ప్రపంచంలోని విశాల ప్రజానీకంతో సంబంధాలు ఏర్పర్చుకుంటున్నారు. కాలాములకు అనివార్యంగా సంక్రమించిన బహుళజాతి జీవన విధానానికి అనుగుణంగానే, బుద్ధుడు వారికి విశ్వజనీన నైతిక సూత్రాలను బోధించాడు.

ఇంతవరకూ చెప్పినదాన్నిబట్టి చూస్తే, సామాన్యులకు ఉద్దేశించిన బుద్ధుని బోధన హేతుబద్ధమైన నైతికతపై ఆధారపడిందని తెలుస్తుంది. అయితే, ఈ సుత్తంలో కనిపించే హేతుదృష్టి, బుద్ధుని ఇతర బోధనలైన అనుభవవాదం, మానవస్వభావ విశ్లేషణ, అంతరంగ పరివర్తన, సరైన సంకల్పం అనేవాటిలో మరింత లోతుగా కనిపిస్తుంది. భిక్షువులను ఉద్దేశించి చేసిన బోధనల్లో, దుఃఖానికి మూలమైన రాగ ద్వేష మోహాలు తనలో కలిగివున్న వ్యక్తికి, అవి హాని కలిగిస్తాయని బుద్ధుడు చెప్పాడు. కాని, సామాన్య ప్రజలను ఉద్దేశించి చేసిన ఈ ఉపదేశంలో, రాగ ద్వేష మోహాలు వాటిని కలిగివున్న వ్యక్తులకే గాక, ఇతరులకు కూడ హానికరమైనవని ఆయన నొక్కిచెప్పాడు.

"మనిషిలో దురాశ ఉత్పన్నమైతే అది హాని కలిగించదా? మనిషిలో ద్వేషం ఉత్పన్నమైతే అది హాని కలిగించదా? మనిషిలో మోహం (అవిద్య లేక అజ్ఞానం) ఉత్పన్నమైతే అది హాని కలిగించదా? దురాశకు, ద్వేషానికి, అవిద్యకు లోనయిన మనిషి జీవహింస, దొంగతనం, అబద్ధాలాడటం, అక్రమసంబంధాలు నెరపటం వంటి పనులు చెయ్యడా? దురాశ, ద్వేషం, అవిద్యకు లోనుకాని మనిషి జీవహింస, దొంగతనం, అబద్ధాలాడటం, అక్రమ సంబంధాలు నెరపటం వంటి పనులకు దూరంగా ఉండడా?"

పైన ఉటంకించిన వాక్యాల్లో 'హాని' తనకు, ఇతరులకు కూడ అని అర్థం. బుద్ధికుశలత తనకు ఇతరులకూ ప్రయోజనం కలిగించినట్లే, హాని కూడ తనకు ఇతరులకూ కలుగుతుంది. ఇక్కడ ఈ విషయాన్ని నొక్కిచెప్పటం అవసరం. ఎందుకంటే, ఈనాటి పాశ్చాత్యులు, బుద్ధుని తదనంతరం రూపొందిన కొన్ని శాఖలు 'బుద్ధుడు ఇతరుల సంక్షేమం గురించి, సామాజిక సంక్షేమం గురించి చెప్పలేదంటు'న్న కారణంగా, ఒకవైపు సమాజహితాన్ని నిరాకరించటం, మరోవైపు ఈ దిశగా బౌద్ధాన్ని విస్తరించకూడదని భావించటం జరిగింది.

బుద్ధుని బోధనల ప్రకారం, మనిషి తన మనసును అజేయంగా (రాగ ద్వేష మోహాలకు లొంగనిదిగా) మలుచుకోవాలంటే, అది కేవలం సహజాత జ్ఞానంతో జరగదు. ఒకవైపు, ప్రజలకు హేతుబద్ధంగా ఆలోచించగల శక్తి ఉందని, దానికి సరైన దిశానిర్దేశం చెయ్యగలిగితే, అది నైతిక సమస్యలకు సరైన పరిష్కారం చూపగలదని బుద్ధుడు భావించాడు. సామాన్య ప్రజలకు ఏది చెయ్యదగిందో తెలుసుకునే శక్తి ఉంది. మరోవైపు, హేతుబుద్ధి కలిగిన సామాన్య ప్రజలు – తమ స్థితికి తగినట్లు – తమను తాము పరివర్తన చేసుకోగలరని బుద్ధుడు భావించాడు. అందుకే, కాలామసుత్తంలో ఆయన కరుణ, మైత్రి వంటి మానవీయ లక్షణాలను పెంపొందించుకోమని సూచించాడు. ప్రజలు ప్రపంచంలోని అన్ని జీవులపట్ల 'రాగ, ద్వేష, మోహ రహితమైన హృదయంతో .... తన, మన అనే భేదభావం లేకుండా' కరుణ, మైత్రి అనే గుణాలను పెంపొందించుకోవాలి. ఈ మానసిక అభ్యాసం ఫలితంగా కాలక్రమంలో, ప్రేమతో కూడిన కరుణను ఒక అలవాటుగా, తానుచేసే చర్యలకు చోదకశక్తిగా నెలకొల్పాలి.

దీనిలో రెండు ముఖ్యమైన అంశాలను మనం చూడవచ్చు. **మొదటిది:** మనిషి మానసిక నైపుణ్యంతో ఎందుకు ప్రవర్తించాలో చెప్పటమే గాక, కొన్ని సమయాల్లో అదుపుతప్పిన మానవ స్వభావాన్ని నైపుణ్యంతో ప్రవర్తించేటట్లు చెయ్యటం ఎలా అనే విషయాన్ని కూడ బుద్ధుడు వివరించాడు. కనుక ఆయన వాస్తవవాది. ఒక వ్యక్తి ఏది మంచిదో, ఏది నైపుణ్యంతో కూడినదో అంచనా వెయ్యవచ్చు. కాని, ఆ వ్యక్తి అందుకు అనుగుణంగా పరివర్తించటంలో సఫలం కాకపోవచ్చు. మనిషిలో సాధారణంగా ఉండే ఈ బలహీనతను బుద్ధుడు పరిగణనలోకి తీసుకున్నాడు.

రెండవది: స్వీయ పరివర్తన కోసం చేసే ఈ సాధన, సూత్రరీత్యా ప్రతిఒక్కరూ ఆచరించగలిగిందే. ఇది ఎంతో ముఖ్యమైన సంగతి. ఎందుకంటే సాధనచేసే మనిషి అనుభవాన్ని, ప్రత్యేకించి, బౌద్ధసంఘం పరిధికి బయట ఉండే సాధకుల అనుభవాన్ని కొందరు తమ స్వార్థ ప్రయోజనాలకు అనుకూలంగా మలుచుకోవటం సాధ్యంకాదు. కాలాముల జీవితంలో సహజమైన మార్పు జరుగుతూవుంది. అంతకుమించి, తమ అదుపులో లేని, తమకే పూర్తిగా అర్థంకాని సామాజిక మార్పులకు వారు లోనవుతున్నారు. అయినప్పటికి మనిషి తన అలవాట్లను, ఉద్వేగాలను అదుపు చేసుకోగలడు. **ఒక మనిషి ప్రపంచాన్ని మార్చలేకపోవచ్చు, కాని అతడు కనీసం తనను తాను మార్చుకోగలడు.** సామాన్య ప్రజలు సాధనచేసే కరుణ మైత్రి వంటి గుణాలు, కొంతవరకు, వారు బౌద్ధసమాజంలో భాగంగా ఉండటం వలనే ప్రభావశీలంగా ఉండవచ్చు; కాని అంతిమంగా ఎవరికివారే స్వయంగా కృషిచెయ్యాలి, తమ సాధనపైనే తాము కేంద్రీకరించాలి.

కాలాములకు చేసిన ఉపదేశం, బహుశా, ఆ ప్రాంతంలో నివసించేవారికి బాగా తగినది కావచ్చు. కాని, బుద్ధుడు సామాన్య ప్రజలను ఉద్దేశించి చేసిన ఇతర ఉపదేశాలవలే, ఇది కూడ

అదేరకమైన పరిస్థితుల్లో జీవించేవారికి ఎవరికైనా వర్తిస్తుంది. అలనాటి గంగామైదాన ప్రాంతపు నాగరికతలో జీవించిన కాలాముల వలె, ఈనాడు సంక్లిష్టతతో కలవరపెట్టే విశాల ప్రపంచపు ప్రభావానికి లోనుకాని జనాలు చాల అరుదు. అందుకే మనకు ఈ సుత్తంలోని బుద్ధుని ఉపదేశం మరింత ఆధునికంగా కనిపిస్తుంది. ఒక సంక్లిష్ట సమాజంలో, విభిన్న అనుభవాలకు గురవుతున్న విశాల ప్రజానీకానికి వర్తించే విశ్వజనీన సత్యాన్ని బుద్ధుడు బోధించాడు. ఆనాటి భారతదేశపు ప్రజానీకం జీవించిన పరిస్థితులకు ఏమాత్రం తీసిపోని సంక్లిష్టతలో ఈనాడు మనం జీవిస్తున్నాం. పైపైన చూస్తే, ఆనాటి జనంలాగే ఈనాటి ప్రజానీకం కలవరపెట్టే రకరకాల అవసరాలకు, విభిన్నమైన విలువలకు లోనవుతుంటారు. కాని, వీరందరిలో ఉమ్మడిగా ఉండే లక్షణాలు కొన్ని ఉన్నాయి: బాధలకు, సంతోషానికి స్పందించే గుణం, ఇంకా, ఇతరులకు కీడు లేదా మేలు చేయగల సామర్థ్యం. వీటి ఆధారంగానే బుద్ధుడు మానవజాతి మొత్తానికి వర్తించే ధర్మాన్ని బోధించాడు.

Buddha, A Very Short Introduction
అనే రచన నుండి ఎంపికచేసిన భాగం.
రచయితకు, ప్రచురణ కర్తలకు ధన్యవాదాలతో.

పద్యాలు

ధర్మ సుడులు

1. గగనమందు పుట్టి గంగ దిగువజారి
కల్మషాల తోడ కడలి కలసె
మురికి నీట కమలములు పుట్టి శుచిపడె
పుణ్య గతులు ఎంచు పుటుక గాదు.

2. కొండమంచు కరిగి గొప్ప నీరైపారు
నీరు మరిగి మరిగి నింగి చేరు
నీటి గతులు వేరు నీరములొక్కటే
మార్గ మెన్న వేరు మనసు ఒకటె!

3. పాకమైన మట్టి పలువిధాల ఒదుగు
కాల్చినంత ఎంతొ కఠిన మౌను
కోపమందు మనసు కోరి కఠిన మౌను .
మైత్రి జల్ల ఎంతొ మాన్యనౌను.

4. మావిపండు మృదువు మరి టెంకె గడ్డగున్
పైన మనసు వేరు లోన వేరు
విత్తు లేక మొలకలెత్తవేపత్నైన
మొలక లేని మనసు ముక్త మౌను


...బుద్ధజయంతి సందర్భంగా

తియ్యగూర సీతారామిరెడ్డి,
94913 36258

గ్రంథాలయం




విహంగం (కవిత్వం)
రచన: గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి
పుటలు: 98, వెల :100/-
ప్రతులకు : గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి
ఇంటి నెం. 86-267, సోమప్ప కాలనీ, బీ క్యాంప్,
కర్నూలు-518002, ఆంధ్రప్రదేశ్ , సెల్:
9110595847






సాహిత్య లేఖలు పుటలు: 40,
దేశం ప్రశాంతంగానే వుంది (కవిత్వం)
పుటలు28
రచన: వి. చెంచయ్య,
సెల్: 94406 38035
ప్రతులకు : 'సాహితీ నిలయం'
10-40-15ఎ జనతాపేట నార్త్,
కావలి - 524 201.



ఖయాల్ (సుభాని పొయెట్రీ)
రచన :సయ్యద్ మహబూబ్ సుభాని
పుటలు:66 వెల: 60/-
ప్రతులకు :సయ్యద్ మహబూబ్ సుభాని
డోర్.నెం. 7-525, టిప్పర్స్ వీధి,
పెద్దబావి బజార్‌వద్ద , మంగళగిరి
ఫోన్: 9963833942



అశ్రుతర్పణం
రచన: ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు
సెల్: 99454 22748
పుటలు: 462, వెల :400/-
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక దుకాణాలలో



మిక్చర్ పొట్లం
రచన: ఆర్.సి. కృష్ణస్వామి రాజు
పుటలు: 115, వెల :125/-
ప్రతులకు : ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ,
మంగళం రోడ్డు, తిరుపతి-517501
సెల్: 9393662821




స్పర్శవేది కథలు
రచన :ఎమ్.వి.రామిరెడ్డి పుటలు: 177, వెల:160/-
ప్రతులకు : ఎమ్.వి. రాజ్యలక్ష్మి
ఫ్లాట్ నెం.ఎ-904, ఫస్ట్ ఫేజ్, రాంకీ గెలాక్సీ,
నల్లగండ్ల గ్రామం హైదరాబాదు-19
సెల్: 9866777870

మన అమ్మనుడితోనే మనకు గుర్తింపు

ఆచార్య లక్ష్మి అయ్యర్. యన్
96802 76038

మానవతావాది మన విశ్వకవి వేమన





నైతిక విలువలు మానవ మనుగడ వృద్ధికి తోడ్పడుతూ సమాజాన్ని మంచి దిశలో ముందుకు తీసుకు వెళ్తుందనడంలో సందేహం లేదు. ఈనాటి మనిషి ఇంటర్నెట్ ఇంద్రజాలంలో డబ్బు సంపాదించే యంత్రంలా ముందుకు పరిగెత్తుతూనే ఉన్నాడు. ఆ పరుగులో తన సంస్కారం, సంస్కృతి, మానవ గుణాలు అన్నీ మరచి ఒంటరితనం, విచ్చలవిడితనం, స్వార్థం, కుళ్ళు వంచనలకు లోబడి, విచక్షణాజ్ఞానం లేకుండా ప్రవర్తిస్తున్నాడు. వైజ్ఞానిక ప్రగతికి బానిసై తన ప్రక్కన ఉన్న కనీసం రక్తసంబంధీకులను (తల్లిదండ్రులు,అమ్మమ్మ, బామ్మ, తాతయ్యలాంటి పెద్దవాళ్ళను) చుట్టూ ఉన్న మనుషులను లెక్కచేయక తన సెల్ఫోన్లో, వాట్సాప్లతో ఇయర్ ఫోన్ పెట్టుకొని ఏదో కృత్రిమ సంతోషాలతో ఒంటరిగా జీవిస్తూ అత్యాధునిక సభ్యసమాజంలో ప్రపంచంతో ఐక్యత నెలకొన్నట్లు భావిస్తూ అపోహ పడుతున్నాడు. ఇలాంటి యుగంలో తన అస్తిత్వాన్ని సంస్కారాన్ని మానవ ధర్మాన్ని మరచి స్వార్థపరుడిగా ప్రవర్తిస్తున్నాడు. ఇలాంటి ప్రదర్శన ప్రియ, ఆడంబర, పాశ్చాత్య సమాజపు జీవన పద్ధతులతో నిండిన మన భారతీయ సమాజానికి అత్యంత అవసరం నైతిక విలువలతో కూడిన మానవ గుణాలు. ఇలాంటి సత్యాలను చాటి చెప్పే మేటి సాహిత్యాలే కాలాన్ని జయించే సాహిత్యాలు. నీతి సాహిత్యం, భక్తి సాహిత్యం ఈ కోవకు చెందినవి.

భారతదేశంలోని అన్ని భాషల సాహిత్య వినీలాకాశంలో సమాజంలో నైతిక విలువలు నెలకొల్పడానికై నీతి శతకాలు, నీతి పద్యాలు అవతరించాయి. తెలుగులోని ఆటవెలది దేశీయ ఛందస్సును ప్రయోగించిన శతకకర్త, ప్రజారంజక కవి , లోక కవి, విప్లవ కవి, మొదటి మానవతావాది– యోగివేమన. ఆంధ్రప్రదేశ్కే కాక సమస్త విశ్వ మానవ మనుగడ ఐక్యతకే ఓ వైతాళికుడు. వేమన చర్చించిన మానవత్వం గూర్చి వాటిలోని సామాజిక తత్వాలను ఓసారి స్మరించి ఆయన ప్రతిపాదించిన విశ్వమానవ ఐక్యత గురించి ప్రస్తావించడమే ఈ పరిశోధనాత్మక వ్యాస ముఖ్యలక్ష్యం. వేమనలోని ఔన్నత్యాన్ని ప్రప్రథమంగా గుర్తించినవారు పాశ్చాత్య పండితులైన ఎం.ఆర్.మ్యాక్ డోనాల్డ్, హోవర్డ్ క్యాంబెల్, జే.దుబాయ్, చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ మొదలగువారు. సి.పి.బ్రౌన్ గారు ఆంధ్రదేశపు నలుమూలల నుండి వ్రాత ప్రతులను తెప్పించి వేమన పద్యాలను సేకరించి ఆంగ్లంలోకి అనువదించి ఆంధ్ర సాహిత్యలోకానికి వేమన పద్యాలను పరిచయం చేసిన మహోన్నతవ్యక్తి. తర్వాత అతన్ని మహాకవిగా గుర్తించిన వ్యక్తి డా.కట్టమంచి రామలింగా రెడ్డిగారు. తర్వాత శ్రీ వంగూరి సుబ్బారావు వేమనను శతక కవిగా గుర్తించారు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వేమన గురించి ప్రస్తావిస్తూ "వేమన కవిత్వం గాలి వంటిది, అది చూడని చోటులేదు దొరకని తావులేదు". అన్నారు. ఇదే వేమనను ఎరుక పరిచిన అధ్యయన గ్రంథం– కానీ దీనిలో వేమన నారీద్వేషిగా చిత్రింపబడ్డాడు. డాక్టర్ ఎన్.గోపి గారి పరిశోధన గ్రంథం 'ప్రజాకవి వేమన'లో వేమన 17వ శతాబ్దికి చెందిన వాడని, రాయలసీమకు చెందిన వాడని నిర్ధారణ చేసి ఆయన మానవతా వాదాన్ని విశ్వమానవ దృక్పథాన్ని వివరించారు. ఈ పరిశోధన వ్యాసం ప్రధాన లక్ష్యం వేమన గారి మానవత్వం పై చూపు సారించడం. వేమనపై పరిశోధనా గ్రంథం సమర్పించిన గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి గార్లు వేమనను, వేమన చింతనను, వేమన పద్యాలను నిశితంగా పరిశీలించి సమగ్రంగా క్రోడీకరించి వ్యాఖ్యానించారు. 'రాళ్లపల్లి వారికి, నార్ల, ఆరుద్రలకు కానీ, డాక్టర్ గోపీకి గాని అలవి కాని బ్రౌన్ కాలంనాటి 1839లోని 1164 పద్యాలను తెలుగు ప్రపంచానికి, అందించిన ఘనత, కీర్తి, బంగోరె గారికే దక్కుతుంది, అని తేల్చి చెప్పారు. **నేటి సమాజంలో చౌరవ, సాహిత్యస్థాయి గల సాహసకవికి స్థానంలేదు. నాగరికతకు ఉన్న స్థానం మానవతకు లేదు; నీతికి నిలువనీడ లేదు. ప్రతిభా సంపన్నులను ఆదరించక, ఆర్థిక, రాజనీతి, అధికారం ప్రయోగము ఇవన్నీ సమాజాన్ని పాలిస్తున్నాయి.** "విశ్వదాభిరామ వినురవేమ" గూఢార్థాన్ని వెల్లడిస్తూ "లోకమందు ప్రజలకు ఆదర్శాలను నీతులను మనోహరంగా మనసుకు ఆకట్టుకునేట్లు బోధించుటకు నిర్ణయించుకున్న ప్రజాకవి వేమన విశ్వ మానవత్వపు ప్రతీక."

మనుష్యులంతా ఒకటే : వేమన అశ్వఘోషుని మానవుని జన్మ హక్కుల గ్రంథంలో చెప్పబడ్డసత్యాలను గ్రహించాడు . ఒకే చెట్టుకు పండిన పండ్లలో ఇది బ్రాహ్మణ ఫలం, ఇది క్షత్రియ ఫలం అని చెప్పడం సాధ్యం కాదు, అదే విధంగా మానవులందరూ ఒకే మహాశక్తికి జన్మించినవారు. ఇదే సత్యాన్ని లోకానికి చాటిన ఘనత మన మానవప్రేమి వేమనకే దక్కుతుంది. వేమన మాట ఇలా ఉన్నది:

'తొలుత బొమ్మ గుడ్డు పరికించి చూడగ
కులము లన్ని గూడ తోడబుట్టె
అందరొకట గలయ నన్నదమ్ములె గదా
విశ్వదాభిరామ వినురవేమ.'


సి.పి.బ్రౌన్


రాళ్ళపల్లి


నార్ల వెంకటేశ్వరరావు


బండి గోపాలరెడ్డి(బంగోరె)

'జాతి భేద మెంచి జన్మముల్ తెలియక
ముక్తి గానలేరు మూఢ జనులు
జాతు లెంచ నేల జన్మంబు తెలియుము
విశ్వదాభిరామ వినురవేమ.'

ఇక్కడ ముక్తి అంటే మానవ ముక్తి. అంటే మానవజాతి అంతా ఒకటే. వేమన సమాజంలో శైవ వైష్ణవ బ్రాహ్మణ వాదం అగ్రకులాలవారి వల్ల ప్రజలు హింసించబడ్డారు. ఇవిగాక జమీందార్లు, షావుకార్లు నిరుపేదలను ఆర్థికంగా మానసికంగా హింసించారు. దానిపై వేమన కఠినంగా విమర్శించారు. గొడ్డు చాకిరీ చేసే పేదలపై– వేమన కరుణ నిండిన హృదయం బాధతో విలపించింది. వేశ్యావృత్తితో నిండిన సమాజం అది. స్త్రీలు, విధవలు చెప్పనలవికాని శోకానికి గురయ్యారు. వాటన్నింటినీ చూసి **వేమన కంఠంలో విరక్తితోబాటు విప్లవం జనించింది.** ఆనాడు శూద్రులు, స్త్రీలు– వేద పాఠానికి అనర్హులన్నారు. దానిని నిరసిస్తూ వేమన ఈ వైరుధ్యాన్ని సంప్రదాయ రీతిలో ఎత్తిపొడిచాడు.

'తల్లి గన్నతల్లి తన తల్లి పినతల్లి
తండ్రి గన్నతల్లి తాత తల్లి
యెల్ల శూద్రులైరి యేటి బాపడు తాను'

వేద పాఠేన విప్రాణాం బ్రహ్మజ్ఞానాత్తు బ్రాహ్మణం అన్న స్మృతి వాక్యం వేమన దృష్టిలో ఉన్నది. **స్త్రీల స్వాతంత్ర్య సమరంలో శంఖం పూరించిన ప్రథమ వ్యక్తి వేమన మాత్రమే** బ్రాహ్మణ కులంలో స్త్రీ పురుషుల మధ్య భేదం జందెం ధరించినందు వల్ల మాత్రమే కదా అని వేమన అంటాడు. ఉపనయనం రోజు జంధ్యాన్ని వేయడం జ్ఞానానికి చిహ్నమా? అని అడుగుతున్నాడు వేమన. **వేమన జ్ఞాన పిపాసి. ఆనాటి బ్రాహ్మణులు ప్రజలకు తమకు తెలిసిన శాస్త్ర బోధనలు చేయలేదు. అందుకే ఆయన బ్రాహ్మణులను ఇలా ఎత్తిపొడిచాడు.**

'జాతి వారలెల్ల జాతి విద్యల నేర్చి
జాణలైరి మిగుల జగతిలోన
బ్రాహ్మణులగు వారు బ్రహ్మంబు నెరుగరు'

ఇక్కడ జాణలు అనగా ప్రవీణులు అన్న అర్థంలో సూచించబడినది .వేమన మానవత్వం జాతి మత భేదాలులేని సర్వ సమాన సోదరత్వం. వేమన జ్ఞానం అందరికీ అందించాలనే దీక్ష కలవాడు. సుజ్ఞాన బ్రాహ్మణత్వమే నిజమైన బ్రాహ్మణత్వం. వేమనకు బ్రాహ్మణ ద్వేషం లేదు కానీ అగ్ర కులాల ఆధిపత్యం పోవాలని ఎలుగెత్తి చాటాడు. దానివల్ల కులమత భేదాలు సమాజంలో లేకుండా జనం అందరూ అన్నదమ్ముల్లా మెలగాలని ఆయన చిరకాల వాంఛ. అగ్ర కులాల ఆధిపత్యం పోవాలి అని వేమన అన్నప్పుడు– అగ్రకులాలవారు ఆగ్రహించినప్పటికీ సామాన్య ప్రజలు ఆయన పద్యాలను వేద సూక్తులుగా గౌరవించారు. వేమన పద్యాలలో ఆనాటి రాజకుటుంబ వ్యవస్థలు, సంప్రదాయాల పేరిట ప్రజల మనసులను పీడించిన బ్రాహ్మణ వాదాలు, ఆనాటి సామాజిక, సాంఘిక, కుటుంబ వ్యవస్థలు అద్దం పట్టినట్లు కనిపిస్తుంది. వేదం వల్లించే బ్రాహ్మణులు చేసే కార్యాలు వేద పఠనము, దేవతార్చన, వేద మంత్రాల అర్థం అనేక మంది బ్రాహ్మణులకు తెలీదు. దక్షిణ తీసుకుని ప్రజలను కొల్లగొట్టే బ్రాహ్మణుల మీద ఆయన ద్వేషం పెంచుకున్నారు. దేవతార్చన మంత్రాలు చదివి, ప్రజల ముందు తమను దేవతలుగా భావించి నటించే పండితులు వెర్రి వెంగళప్పలుగా ప్రజలను అనుకుంటున్నారు అని ఆయన అంటున్నారు. ఆయన దృష్టిలో బ్రాహ్మణుడంటే తన విద్యను పదిమందికి పంచిపెట్టి అందరికి చదువులు మంచి చెడ్డలు నేర్పించే నిస్వార్థపరుడుగా వుండాలి .

'బ్రాహ్మణులకు సకల భాగ్యంబు లీయవచ్చు
గౌరవింప వచ్చు కలయవచ్చు
జ్ఞాన మొసగి జనుల కడతేర్చు నటులైన

అంధ విశ్వాసాల ఒకటి' –పెండ్లికి ముహూర్తాలు పెట్టడం అనే పేరుతో, జాతకాలు పేర్లతో ప్రజలను హింసించడం ఏమార్చడం. శ్రాద్ధ కర్మ, ముహూర్తాల పేరిట ఏమార్చే మూఢ నమ్మకాలను తుద ముట్టిస్తూ వేమన

'పిండములను జేసి పితరుల తలపోసి
కాకులకును పెట్టు గాడ్దెలారా
పియ్యతినెడు కాకి పితురుడెట్లాయెరా?'

'విప్రులెల్లరుచేరి వెర్రికూతలు కూసి
సతిపతులను కూర్చి సమ్మతమును
మును ముహూర్తముంచ ముండెట్లు మోసెరా ?'

ఆ కాలంలో కరణాలకు కాపులకు ఐక్యతతో వుంటే క్షేమం లేకుంటే

మిగతా కవులందరూ నారీ ద్వేషిగా వేమనను పరిగణిస్తే 'విశ్వకవి వేమన' రచనలో గుర్రం వెంకటరెడ్డి, పోచన్న వేమారెడ్డి గార్లు- వేమనను స్త్రీజనోద్ధరణ నాయకునిగా వక్కాణించారు. అందుకై వేమన పద్యాలను ఉదహరిస్తూ ఎన్నో సిద్ధాంతాలను స్త్రీజనోద్ధరణకు వేమన ప్రయోగించాడు అని తేల్చి చెప్పారు. ఆయన సిద్ధాంతాలు స్త్రీ పురుష సమానత్వం, స్త్రీజనోద్ధరణలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తాయి. ఆయన దృష్టిలో స్త్రీ తల్లి.

ఇద్దరికీ నష్టమే. అందుకే వేమన అంటున్నాడు -

'కాపు లేని యూరు కరణమ్మునకు కీడు
కరణము పగ చేత కాపు కీడు
కాపులు కరణాలు కావడి కుండలు' అని. ప్రజలను పీడించే నియోగి బ్రాహ్మణులను విమర్శిస్తూ

'వేము కంటె విషము వెలనాటి కరణాలు
పాము కంటె విషము ప్రథమ శాఖ
అంతకంటె విషము ఆరువేల నియోగులు' అని అన్నారు.

సామాన్య ప్రజలకు ఆయన ఇచ్చిన సందేశం
విశ్వము నడుపంగ విశ్వేశ్వరుండుండ
బ్రాహ్మణులకు నేల పట్టుదలలు
వనము లోని కోతి వసుమతి నడుపునా?

ఏ ఒక్క కులంతోను ఈ ప్రపంచం నడుస్తుందని అనే వాదనలను వేమన పటాపంచలు చేశాడు. ఆయన దృష్టిలో సర్వ మానవులు సమానులు. విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని వేమన తన సిద్ధాంతాలకు మూలంగా తీసుకున్నాడు

రామ నామ పఠనచే మహి వాల్మీకి
పరగ బోయడయ్యు బాపడయ్యే
గుణంబు ఘనము కాని కులంబు కాదు ॥విశ్వ॥

కరక కాయలు తిని కాషాయ వస్త్రముల్
బోడినెత్తి కల్గి బొరయు చుండు
*తలలు బోడులైన తలపులు బోడులా?..*అని దొంగ సాధువులను వేమన ప్రశ్నించాడు.

అతని దృష్టిలో సర్వ మానవులు సమానులు. దేవుడొక్కడే ప్రభువు. ఆ కాలం నాటి రాజ కుటుంబాలకు, సంప్రదాయ బ్రాహ్మణ వాదులకు ఆనాటి సామాజిక వ్యవస్థలకు- వేమన విసిరిన సవాళ్ళకు ఈ నాటికీ జవాబు దొరకలేదు. రాజ కుటుంబాల్లో జరిగే కలహాలు, కుట్రలను అన్నింటిని తన రచనల్లో చూపించిన వేమన సంఘజీవి.

'ఎరుకలేని దొరల నెన్నాళ్ళు గొలిచిన
బ్రతుకు లేదు వట్టి భ్రాంతి గాని
గొడ్డుటావు పాలు గోకితే చేపునా'

తెలుగు సాహిత్యంలో రాచరిక వ్యవస్థ పోవాలని సవాలు చేసిన తొలి కవనం వేమనదే.

'భూమి నాది యన్న పుడమి ఫక్కున నవ్వు
దానహీనుని చూచి ధనము నవ్వు
కదన భీతు జూచి కాలుండు నవ్వురా.'

ఆనాటి పిరికిపందలు లోభిగా వున్న వాళ్లకు వినాశనం తప్పదని, వాళ్ళందరూ కాలగర్భంలో కలిసిపోతారని ముందే జ్యోతిష్యం చెప్పిన కవి వేమన. వేమన గ్రామీణ భాషలో విప్లవం అనే శబ్దానికి ఉప్పలం అనే వికృతి శబ్దాన్ని ప్రయోగించాడు. వేమన ఆశించిన సమాజం జాతి కుల మత భాషా విభేదాలు లేని, ఆడ మగ భేదాలు లేని సర్వమానవ సమానత్వంగల ఆదర్శ సమాజం. మానవులందరూ సమానులు అనే వేమనకు బ్రాహ్మణులను భూసురులనడము, మాల మాదిగలను అస్పృశ్యులనడము బొత్తిగా నచ్చదు. ఆయన దృష్టిలో అందరూ సమానులే, ఆ భగవంతుడు ఒక్కడే అందరికి ప్రభువు, స్వామి. కష్ట జీవితంలో ఎప్పుడూ సుఖం ఉంటుంది. కష్టం చేస్తేనే కాని మనిషి ముందుకు సాగదు అనే సిద్ధాంతాన్ని నమ్మే వ్యక్తి తన పూర్వీకులైన తెలుగు కవులందరికంటే వేమన దూరదృష్టిగల విప్లవ కవి. "అన్యాయ కాలము దాపురించినప్పుడు అందరూ మేల్కోవాలి అని" మాన్యాలు, భోగాలు మనుషులందరికీ లభించేందుకై మార్గాలు వెతకాలని- సామాజిక ఐక్యతను సూచించిన వ్యక్తి. వేమన

'మాలవాని నేల మహిమీద నిందింప
నొడల రక్తము మాంసమ్ము ఒకటి గాదే ?
వానిలోన మెలగువాని కులంబేది ?' అని ప్రశ్నించిన మహోన్నత మానవతావాది వేమన.

చిలుక గర్భమందు శ్రీశుకుం దుదయించి ......అన్న పద్యములో ఇదే సత్యాన్ని చూపించాడు వేమన .


మిగతా కవులందరూ నారీ ద్వేషిగా వేమనను పరిగణిస్తే 'విశ్వకవి వేమన' రచనలో గుర్రం వెంకటరెడ్డి, పోచన్న వేమారెడ్డి గార్లు వేమనను స్త్రీజనోద్ధరణ నాయకునిగా వక్కాణించారు. అందుకై వేమన పద్యాలను ఉదహరిస్తూ ఎన్నో సిద్ధాంతాలను స్త్రీ జనోద్ధరణకు వేమన ప్రయోగించాడు అని తేల్చి చెప్పారు. ఆయన సిద్ధాంతాలు స్త్రీ పురుష సమానత్వం, స్త్రీజనోద్ధరణలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తాయి. ఆయన దృష్టిలో స్త్రీ తల్లి.


'తల్లి నెరుగు వాడు దైవంబు నెరుగును
మన్ను నెరుగు వాడు మిన్ను నెరుగు
మన్ను మిన్నెరిగిన తన్నుతా నెరుగురా'

అంటూ ఆనాడు కామాంధకారంతో కన్నుమిన్ను గానక సంచరించే పురుషులకు స్త్రీ యొక్క పవిత్రతను గుర్తుచేశాడు

'వెలయ భూమితల్లి, విత్తనంబటు తండ్రి,
పంటలరయ సుతులు, పాడి పరము
ధర్మమే తన పాలి దైవంబు తలపోయ అంటున్నాడు. వేమన ధర్మ స్వరూపమైన దేవాలయాన్ని చేరుకోవడానికి మూలం తల్లి అన్నారు. పరశురాముడు తండ్రి మాటలను విని తల్లిని చంపి తాను సాధించిందేమిటి? నిలువ నీడ లేక మలయ పర్వతం పై తల దాచుకోవలసి వచ్చింది కదా అతనికి అంటున్నాడు.

స్త్రీల అధోగతికి కారణం పురుషులేనని గుర్తించిన వేమన





'తరుణి పుణ్యవతిగ నరుని బట్టియే యగు
పాపి యగును మగని బట్టియే ఇల
భర్త వర్తనంబె పడతికి గ్రాహ్యంబు'

అని స్త్రీల పక్షాన వేమన వాదించాడు. వేమన దృష్టిలో స్త్రీల యెడ పురుషులు చూపిన దారుణ వివక్ష.

'పుణ్యమంత గూడి పురుషుడై జన్మించె
పాపమంత గూడ పరగునే సతి
కష్టపు సతి యని కనువారు లేరయా !'

అంటూ స్త్రీల పక్షాన కన్నీరు కార్చాడు వేమన. పురుషుడు ఎలా ఉండవలెను?అని ప్రబోధిస్తూ

'కావవలయు మగడు కాంత నెల్లప్పుడు
కావలేని నాడు చావవలయు...' అన్నాడు.

వేమన వేశ్యావృత్తిని నిరసిస్తూ భార్యలను ప్రేమించి గౌరవించాలని పురుషులకు బోధిస్తాడు.

'ఇంటియాలి విడచి ఇల జార కాంతల
వెంట దిరుగువాడు వెర్రివాడు
పంట చేను విడచి పరిగ యేరిన యట్లు'

అన్నాడు వేమన. మరొక పద్యంలో

'పేదవాడైనను పెంటి నిచ్చెదనని
పైడి నడుగ రాదు పరుసమునను
పైడి గొనుట పెంటి బట్టిన యట్లయా' అన్నాడు.

అలాగే కన్యాశుల్క దురాచారం, ధనవంతుల బహుభార్యాత్వ దురాచారానికి, ముసలి ముప్పు పెండ్లి, వేశ్యా వృత్తులను తీవ్రంగా నిందించాడు వేమన. ఉమ్మడి కుటుంబాల వల్ల కలిగే లాభాలు కూడా వేమన తన పద్యాలలో ప్రతిపాదించాడు. ఆనాటి స్త్రీలలోని అవినీతి చర్యలను కూడా వేమన దుయ్యబట్టాడు.

ఆనాడు పొట్ట నింపుకోవడం కోసం స్త్రీలు పురుషుల దగ్గర దాసిగా పడి ఉండటం కంటే పురుషులతోపాటు సమానంగా కష్టించి, పనిచేసి సాధించాలి అన్నాడు వేమన.

'కూలినాలి చేసి గుల్లాము పనిచేసి
తెచ్చి పెట్ట నాలు మెచ్చుచుండ్రు' అనే పద్యంలో ఆర్థిక స్థితి బాగాలేక కుటుంబంలో కలతలు వస్తుంటాయి. మగవాడితోబాటు స్త్రీలు కూడా ఆర్థిక రక్షణ చేసుకోవాలని అన్నాడు .

వేమన దృష్టిలో నిజాయితీ కలవాడే సత్యాన్ని మాట్లాడగలడు. సత్యమే మానవత, మానవతే సత్యము. ఈ రెండిటి కలయికే వేమన పద్యాల్లోని సారం అంటున్నారు డాక్టర్ గోపి. వేమన సత్యాన్ని ప్రతిపాదిస్తూ కల్లలాడు వాడికంటే కష్టం మరి లేదు. దుర్వ్యసనపరుడి కంటే, తాగుబోతు కంటె అబద్ధం ఆడే వాడే నీచుడు. వేమన దృష్టిలో సాహసం ధైర్యం లేని వారు సత్యం పలక లేరు .వేమన వ్యక్తిత్వంలోని సౌందర్యమే సత్యం. ఆయన నిస్వార్థపరుడు. వేమన సర్వసంగ పరిత్యాగి.అతనికి ఎవరి మీద శ్రద్ధ, మమకారాలు కానరావు అని డాక్టర్ ఈశ్వర్ గారు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. సాంఘిక దోషములను సరిదిద్దు వానిగా మానవత్వ సిద్ధాంతములకై పోరాడు అని చెప్పి వేమన సర్వ సమానత్వాన్ని నెలకొల్పిన ఉద్యమనాయకుడు. వేమన వర్ణవ్యవస్థ మనిషి జాతి ఐక్యతను భంగ పరుస్తుందని హెచ్చరించాడు. కులాలు అన్నీ ఒకే కులమని, అదే మనిషి కులమని వేమన సూచించాడు. ప్రపంచంలోని మానవులు అందరూ కూర్చొని తినే సహ పంక్తి భోజనాలను కూడా వేమన ప్రతిపాదించాడు.

'ఉర్వి వారికెల్ల నొక్క కంచము బెట్టి
పొత్తుగుడిపి కులము పొలయజేసి
తలను చెయ్యి బెట్టి తగనమ్మ జెప్పరా'

అంటున్నాడు వేమన. ఇంతకంటే మానవ సమానత్వానికి ఉదాహరణ ఏదీ ఉండబోదు. అనేక పద్యాల్లో కులం కన్నా గుణము ప్రధానం అంటున్నాడు.

'కులములోన నొక్క గుణవంతుడుండె
కులము వెలయు వాని గుణము చేత
వెలయు వనములోన మలయజంబున్నట్లు'.. అంటున్నాడు

'రామ నామ పఠనచే మహి వాల్మీకి
పరగ బోయడయ్యు బాపడయ్యె'

వేమన నాటి సాంఘిక శాపం ఇంకొకటి అస్పృశ్యత. పరమ కరుణ మనస్సు కలిగిన వేమన దీన్ని తీవ్రంగా ఖండించాడు చతుర్వర్ణాలకు వెలిగా పుట్టిన అస్పృశ్యత సాంఘిక అధర్మానికి చిహ్నమైనది. మానవులందరి మాంసం ఒకటే కదా మరి ఆ అస్పృశ్యత ఎక్కడి నుండి వస్తుంది అని అంటున్నాడు వేమన. వారి దుస్థితి చూసి ఆయనకు ఎంతో నొప్పి కలిగింది. అందుకే వేమన అస్పృశ్యుల వారి పక్క వాదించాడు.

'మాలవాని నేల మరిమరి నిందింప
ఒడలనున్న మాంస మొకటి గాదె
వానిలోన వెలుగు వాని కులంబేది ?' అని వేమన అడిగాడు.

'మాలవానినంటి మరి నీళ్ల మునిగేరు
మాల కర్మచేత మాలడయ్యె
ఏమి తెలియలేరొ ఈ నరపశువులు' అని వాపోతున్నాడు వేమన.

అతని విశాల మానవ ప్రేమను శబ్దాలలో బంధించడం వీలుకాదు. సాధ్యం కాదు. వేమన సమాజంలోని రాజకీయ, ఆర్థిక, ప్రజా జీవన సామాజిక పద్ధతులలోని అంధ విశ్వాసాలు, మతం పేరిట మనుష్యులను నొప్పించే ఆచారాలను ఖండించి వ్రేళ్ళతో సహా పెకిలించి పారవేసిన

విప్లవ కవి, మానవతవాది. దైవాన్ని ప్రతి మనిషిలోను దర్శించేవాడే నిజమైన మానవుడు అన్నది వేమన విశ్వాసం. దాన్నే గీతాచార్యులు శ్రీకృష్ణ పరమాత్మ సమదర్శిగా పేర్కొన్నాడు.

వేమన మానవత్వ స్థాపనకై సమాజంలోని కుళ్ళును, వంచనను, జాతి, మతం పేరిట మనుష్యులను కించపరిచే విధానాలను చూసి ఉద్రేక జ్వాలలను కురిపించాడు. కానీ దాని వెనుకగలది వేమన మానవప్రేమ యనే అనుకోవాలి. వేమన మనస్సు వెన్నపూసయని మరువరాదు.

వేమన మనసును శుభ్రంగా, నిస్స్వార్థంగా, నిర్మలంగా, ఉంచుకోమని పదే పదే చెబుతున్నాడు

'చిత్తశుద్ధి లేని చేసిన పుణ్యంబు
కొంచమైన నదియు కొరవిగాదె
విత్తనంబు మర్రి వృక్షంబున కెంత'

వేమన మానవత్వం మానవతావాద సిద్ధాంతం. పవిత్రమైన మనస్సుతో మానవత్వం ముడివడి వున్నది. అందుకే వేమన అన్నాడు, "ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల?" అని.

గుళ్ళు, గోపురాలు, మసీదుల వెంట తెరిగే జనాన్ని వెర్రి వాళ్ళని వేమన పరిహసించాడు.

'హృదయమందున్న ఈశుని తెలియక
శిలల కెల్ల మ్రొక్కు జీవులారా
శిలలనేమివుండు, జీవులందేగాక'

మనస్సును నొప్పించేవారిపై వేమన ద్వేషాన్ని కురిపించాడు.


'ఇనుము విరిగెనేని ఇనుమారు ముమ్మారు
కాచి అతుకవచ్చు కమ్మరీడు
మనసు విరిగెనేని మరి యతక నేర్చునా' అన్నారు. ఎక్కడ మానవత్వం లోపిస్తుందో అక్కడ నిలదీసి ప్రశ్నల వర్షం కురిపించే సాహస విప్లవ కవి వేమన. మానవత్వాన్ని ప్రతిపాదిస్తూ

'పసుల వన్నె వేరు, పాలేక వర్ణమే
పుష్ప జాతి వేరు పూజలొకటె
దరిశనంబులు వేరు దైవమొకటే' అన్నాడు.

సమాజంలో కుటుంబపు విలువలను గుర్తించి దాన్ని పదిమందికి తెలిపిన వ్యక్తి వేమన. వేశ్యావృత్తి నిండిన ఆ సమాజంలో పతివ్రతలను గుర్తించిన మహోన్నతుడు. ఉత్తమ ఇల్లాళ్ళను ప్రశంసిస్తూ అన్నాడు:

'గుణవతి యగు యువతి గృహంబు
చక్కగనుండ, చీకటింట దివ్వె చెలగురీతి
దేవియున్న గృహము దేవార్చన గృహము'

వేమన పద్యాలలో మానవత్వం పేదవాళ్ళ పేదరికంలో, ఆడవాళ్ళ కష్టాలలో, అప్పుల పాలబడ్డ రైతుల కన్నీళ్ళలో తారసిల్లుతుంది. అదే మానవత్వం కపట సన్యాసులను, మతం పేరిట అఘాయిత్వం చేసే బ్రాహ్మణులపై, పేదోళ్ళ నోరు కొట్టే రాజులు, భూస్వాములపై అగ్నివర్షమై కురుస్తుంది. **వేమనలాంటి మానవతావాది, విశ్వ బంధుత్వ కవి, నిర్మల మనస్కుడైన కవి ఎవరూలేరు అంటే అది అతిశయోక్తి కాదు. వేమన సాహిత్యంపై భారతీయ భాషలన్నీ పరిశోధనా కేంద్రాలు స్థాపించి వేమన కీర్తిని విశ్వమంతా చాటి చెప్పాలి.**



రచన:ఎన్నవెల్లి రాజమౌళి
వెల: 80/-
ప్రతులకు:
ఎ. రాజమౌళి
తడకపల్లి పోస్టు, సిద్దిపేట జిల్లా
తెలంగాణ-502 114

'ఆట-పాట' పుస్తకం బాలబాలికలను ఆనందింపచేస్తుంది. మచ్చుకు 2వ కథ సారాంశాన్ని తెలిసుకొంటే పాఠశాల విద్యార్థి అయిన విజయ్ చదువులో ముందున్నాడు. మిగతా విషయాల్లో చురుకుగాలేడు' అని అబ్బాయి తల్లి చంద్రకళ చెప్పింది. అన్నం బాగా తింటాడా అని మాస్టారు అడిగారు. బ్రతిమిలాడినా అన్నం బాగా తినడు అని తల్లి బాధగా చెప్పింది. మాస్టారుతో. అయితే పొరపాటు వాడిలో లేదు. మీ దగ్గరే ఉంది అని మాస్టారు చెప్పారు. మేమేం చేశాం? బాగా చదివిస్తున్నాం గదా? ఆదుర్దాగా అడిగగింది చంద్రకళ. అప్పుడాయన 'ఆటల వల్ల కావాల్సిన వ్యాయామం లభిస్తుంది. దాంతో ఆకలి, దప్పికలు వాటంతట అవే పుడ్తయి.' ఈ రోజునుంచి వాడిని సాయంత్రాలు ఆడుకోమని చెప్పండి. అలాచేస్తే ఫలితాన్ని తొందరగా చూస్తారు. అని విష్ణు మేష్టారు అన్నాడు. ఆ రోజు నంచి వాడిని ఆడుకోమని, అందరితో బాగా కలవమని చెప్పింది. దానితో విజయ్‌లో మార్పు వచ్చింది.. ఆకలి బాగా పెరిగింది. శారీరక శ్రమ వల్ల నీళ్ళు ఎక్కువగా తాగుతున్నాడు. విజయ్‌లో వచ్చిన మార్పును గమనించిన చంద్రకళ విష్ణు గారికి కృతజ్ఞత చెప్పుకొన్నది.

కథల తాతయ్య కథలు బాలలు మంచి కథలు విన్నప్పుడు వారు పిల్లల కెంత సేవ చేస్తున్నారో తెలుస్తున్నది.

'బాలల కథలు' పుస్తకంలో హంస తీర్పు- చేపతెలివి, ఐకమత్యం, నేను సైతం, గ్రామ సింహం స్ఫూర్తి దాయకమైన కథలని చెప్పవచ్చు. ఒక తట్టు ఆనందం, మరో తట్టు విజ్ఞానం జంటగా అందించడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.


మొత్తానికి రచయిత ఎన్నవెళ్ళి రాజనాల ఈ బాలల గ్రంథంలో 30 మంచి కథలను వ్రాసి పిల్లలకు ఆనందం కలిగించారనగంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు పుస్తకమంతా బొమ్మలతో, ముఖచిత్రం సహా ఆహ్లాదకరంగా ఉన్నాయి.

- డా॥ జి. వెంకటేశ్వరరావు
9491457496

డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

ఎడింబరోలో ఒపేరా


ఎడింబరో నగరానికి వచ్చిన రెండుమూడు రోజుల్లోనే, అక్కడ బాగా ప్రాచుర్యంలో వుండే మెట్రో అనే వుచిత దినపత్రికలో ‘ఎ మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్’ అనే (A Mid Summer Nights Dreams) అనే షేక్స్‌పియర్ నాటకాన్ని ‘ఒపేరా’ గా ప్రదర్శించబోతున్నారనే ప్రకటన కనిపించింది. దాన్ని నేను కుతూహలంగా చూస్తూండడం గమనించి, మా అల్లుడు ధీరజ్ కృష్ణ వెబ్‌సైట్‌లో వెతికి పట్టుకుని టికెట్లు బుక్ చేసేశాడు. అలా నాకు ఆ ఒపేరాను చూసే అవకాశం దొరికింది.



‘ఎ మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్’ అనే షేక్స్‌పియర్ నాటకాన్ని నేను డిగ్రీకాలేజీలో పాఠంగా చెప్పాను. షేక్స్‌పియర్ రాసిన విషాదాంత నాటకాలెంత గొప్పవో, ఆయన రాసిన సుఖాంత నాటకాలూ ('Comedy' అనే యింగ్లీషు మాటకు సుఖాంత నాటకమనే మాటకంటే దగ్గరి మాట దొరకదు) అంతే ప్రసిద్ధాలు. వాటిలో యీ నాటకం చాలా రకాలుగా విశిష్టమైంది. న్యూక్‌లూ, పౌరాణిక పాత్రలూ, యువప్రేమికులూ, యక్షులూ (Fairies) యిలా రకరకాల పాత్రల్ని కలిపే కథతో, కళ్లపైన చిలకగానే వాళ్లు ఆ వ్యక్తులు తాము మొదటగా చూడబోయే వ్యక్తుల ప్రేమలో పడిపోయేలా చేసే మాంత్రిక పుష్పాలతో, హాస్యరసస్ఫోరకంగా, ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని గావించే ఆ నాటకాన్ని సంగీత భరితమైన ఒపేరాగా మార్చుకోవాలనుకోవడం చాలా సహజమైన విషయమే! నాటకాన్ని పాడుకునేలా సంగీత రచనలు చాలా మందే చేశారు. వాటిలో ప్రసిద్ధమైన బెంజిమిన్ బ్రిట్టన్ 1942లో చేసిన సంగీత రచనను యిదివరలో చాలాసార్లు ఎడింబరోలో ప్రదర్శించారట. కోవిడ్ వల్ల అనుకున్న దానికంటే ఆలస్యంగా యిప్పుడు ప్రదర్శించబోతున్నామని ‘స్కాటిష్ ఒపేరా’ వాళ్లు చెప్పుకొచ్చారు.

ఎడింబరో నగరం నడిబొడ్డులో ఎడింబరో కోటకు అర ఫర్లాంగు దూరంలోనే, రోడ్డుపక్కన కిక్కిరిసిన భవన సముదాయాల మధ్య, మరికొన్ని అలాంటి నాటక ప్రదర్శన శాలలకు దగ్గరలోనే వుంది ఫెస్టివల్ థియేటర్. 1928 లో స్థాపించబడిన యీ ప్రదర్శనశాలకు 1994 లో కొత్తహంగుల్ని సంతరించారట! దాదాపు 2500 అడుగుల విస్తీర్ణముండే యీ ప్రదర్శనశాలలోని రంగస్థలం వైశాల్యంలో స్కాట్‌లాండుకంతా పెద్దదీ, మొత్తం యింగ్లాండులో మూడవదీ అని తెలిసింది. స్కాట్లాండు ఒపేరాలకూ, బాలేలకూ వేదికగా ప్రసిద్ధిపొందిన యీ ప్రదర్శనశాలకు ప్రపంచ ప్రసిద్ధికూడా వుంది. 1915 మంది ప్రేక్షకులకు సరిపోయేలా నిర్మించిన యీ ప్రదర్శనశాలలో రకరకాల సంగీత కార్యక్రమాలూ, నాటకాలూ యేడాది పొడుగునా జరుగుతుంటాయి.

సాయంకాలం 7 గంటలా పదిహేను నిముషాలకు ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. మేము పది నిముషాలు ముందుగానే



పెర్కుసన్, సెలెస్టా అనే వాయిద్యాలతో వొక్కొక్కరూ వున్నారని తరువాత తెలుసుకున్నాను. యీ సంగీత కచేరీనంతా నిర్వహించే అంటోనీ మఫెట్ అనే విద్వాంసుడు అందరికంటే యెత్తయిన కుర్చీలో కూర్చుని, పొడవాటి బెత్తం చేత్తో పట్టుకొని, అందరికీ వొకే సమయంలో సూచనలందేలా చేతులు తిప్పుతూవున్నాడు.

పొడవాటి వున్ని కోట్లతో లోపలికొచ్చిన ప్రేక్షకులందరూ తమకోట్లు కుర్చీలపైన వేసుకుని, వాటి కానుకుని కూర్చున్నారు. ప్రేక్షకుల్లో అన్ని వయసుల వాళ్ళూ వున్నారు.

అక్కడికి చేరుకున్నాము. ఎడింబరోలోని యిండ్లూ, భవనాలు, వర్తక సముదాయాలూ అన్నీ వుమ్మడిగోడలపైన, పక్కపక్కనే సద్దుకుంటూ వుంటాయి. రోడ్డు పైనుంచీ పొడవాటి అద్దాల తలుపులగుండా ప్రదర్శనశాల వరండాలోకి అడుగుపెట్టాము. అప్పటికే వరండాలో వుండే బార్ముందు కుర్చీల్లో కూర్చుని కొందరు, అటూయిటూ తిరుగుతూ కొందరూ గాజు గ్లాసులలో రంగు రంగుల ద్రవాల్ని తీరిగ్గా తాగుతూ, కబుర్లు చెప్పుకుంటున్నారు. ప్రదర్శనశాలలోకి వెళ్ళేందుకు మూడు అంతస్థులలో దారులున్నాయి. ప్రతి అంతస్థులోనూ వరండాలో కఫేలూ, బార్లూ వున్నాయి.

మేము రెండో అంతస్థుకెళ్తూండగా, మెట్లదగ్గరే వున్న వుద్యోగిని మా టికెట్లను కంప్యూటరు సహాయంతో తనిఖీ చేసింది. ఆమె ముందు అక్కడ ఆ తర్వాతి రోజుల్లో జరగబోయే ప్రదర్శనల వివరాలను తెలిపే కరపత్రాలతోబాటూ, అప్పుడు జరగబోతున్న "ఎ మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్" ఒపేరా గురించిన వివరాలన్నీ తెలిపే అందమైన 70 పేజీల క్రౌన్ పరిమాణమున్న మెరుపుకాగితాల రంగుల పుస్తకమూ వున్నాయి. ఆ పుస్తకం ఖరీదు రెండున్నర పౌండ్లు (దాదాపుగా రెండు వందల యాభై రూపాయలకు సమానం). అయితే ఎడింబరో కొచ్చాక డబ్బుల్ని అలా భారతదేశపు ద్రవ్య పరిమాణాలతో కొలిస్తే కుదరదు. అక్కడ మంచినీళ్ళు సీసా కూడా రెండు పౌండ్లనేస్తారు). ఆ పుస్తకాలను అక్కడికొచ్చిన వాళ్లంతా కొనేస్తున్నారు.

పుస్తకంతోపాటూ ప్రదర్శనశాలలోకి అడుగుపెట్టేసరికి అక్కడ వాతావరణం వేరుగావుంది. అప్పటికే తమ ఆసనాల్లో సర్దుకుపోయినవాళ్ళూ, లోపలికి వస్తున్నవాళ్ళు అందరూ వీలయినంత నిశ్శబ్దంగా వున్నారు. ఆసనాలు వరసగా, అందంగా, సుఖమయంగా వున్నాయి. చలిదేశం గావడం చేత హీటర్లు నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుపోతున్నాయి. విశాలమైన యవనిక ముందు సంగీతవాయిద్యకారులు కూర్చునే 'పిట్'లో రకరకాల వాయిద్యాలతో విద్వాంసులు సిద్ధంగా వున్నారు. మొదటి వయొలిన్లతో పదిమందీ, రెండవ వయొలిన్లతో యెనిమిది మందీ, వయోలాలతో ఆరుగురూ, సెల్లోలతో అయిదుగురూ డబుల్ బాసల్లతో ముగ్గురూ, పిల్లనగ్రోవులతో యిద్దరూ, క్లారినెట్లతో–యిద్దరూ, ఫ్రెంచి హార్న్లతో యిద్దరూ, హర్ప్లతో యిద్దరూ వీళ్లుగాకుండా బాసూన్, ట్రంపెట్, ట్రాంబోన్, టింపనీ,

(ఆరేళ్ల మా మనవడు తప్ప పిల్లలెవరూ లేరని గమనించాను). సరిగ్గా సమయానికి అంతవరకూ మంద్రంగా వినవచ్చిన సంగీతం ఆగిపోయింది. బయటున్న ప్రేక్షకులూ లోపలికొచ్చి కూచునేశారు. గంట మోగింది. తెర పైకి లేచింది.

వేదికపైన దాదాపుగా యిరవై అడుగుల పొడవూ, వెడల్పులతో, పలచటి గుడ్డలు కట్టిన ఫ్రేములతో మరో వేదికను అమర్చారు. ఆ వేదికలోకి బయట నుంచీ రావడానికి కిందుగా వరసగా పది పన్నెండు తలుపులున్నాయి. ఆ తలుపులు కూడా అదే గుడ్డతో ఆ మొత్తం వున్న రంగస్థలంలో కలిసిపోతున్నాయి. కప్పునుంచీ కుర్చీలూ, మంచాలూ కకావికలంగా వేలాడుతున్నాయి. మంచాలపై నుంచీ, కొన్ని కుర్చీల పైనుంచీ తెల్లటి వస్త్రాలు వేలాడుతున్నాయి. వేదికపైకి ప్రసరించేలా ప్రదర్శనల కప్పునుంచీ, పక్కగోడలనుంచీ ఫోకస్ దీపాలను స్థిరంగా అమర్చేసి వున్నారు. ఆ దీపాల వెలుతుర్లో, వేదికపైన కలలాంటి, వూహలాంటి ప్రదేశాన్ని తయారు చేయడంలో దర్శకుడి నేర్పు కనబడుతోంది.

తెర తెరిచినప్పటి నుంచీ రంగస్థలం పైన సినిమా కంటే బిగి తో యేమాత్రపు తత్తరపాటు లేకుండా ఒపేరా కొనసాగింది. ఒపేరా అన్నది సంగీత ప్రదర్శన. పిట్లోంచీ వాయిస్తున్న సంగీతకారుల రాగాలకనుగుణంగా నటులందరూ పాడుతూ అభినయించాలి. షేక్స్పియర్ నాటకం రసవత్తరంగా వుంటుంది. ఆ రసన తగ్గకుండా ఒపేరా వుండాలి. షేక్స్పియర్ నాటకంలో అయిదు అంకాలుంటాయి. అయితే ఒపేరా రచయిత దాన్ని మూడు అంకాలకు కుదించుకున్నాడు. మొత్తం ప్రదర్శనంతా రాత్రి నుంచి పగలుకూ స్వప్నం నుంచి వాస్తవికతనూ సాగేలా రూపొందించుకొన్నాడు.

రంగస్థలంపైన యే మూలనుంచీ యే నటుడు పాడినా అది స్పష్టంగా వినబడుతోంది. అందరూ వొకే చోటనుంచి పాడుతున్నట్లుగా సమస్థాయిలో వినబడుతోంది. యెప్పటి కప్పుడు వేదికపైన మారుతున్న దీపాల జాలు యెటు వైపునుంచి వస్తోందో తెలియడంలేదు. రంగస్థలం నుంచే అటు లోపలికెళ్ళిన నటులు తాము మళ్లీ బయటికొచ్చేలోగా తమ వేషాల్నీ బట్టల్నీ మార్చేసుకుంటున్నారు. నాటకంలో ప్రధాన పాత్రలు యిరవై. ఫెయిరీల వేషం వేసే పిల్లలు పద్మూడు మంది. అన్నింటి కంటే ముఖ్యమైన విషయమేమిటంటే ప్రేక్షకులు కూడా అక్కడి



ప్రదర్శనలో భాగాలైపోయినట్లుగా కనిపించారు. వాళ్ళనవ్వులు, ప్రతిస్పందనలూ నటుల అభినయానికి భంగం కలగనివ్వకుండా వుండడం వాళ్ళ స్వభావమనిపించేటంత సహజంగా వుంది. కించిత్తయినా తొందరపాటులేకుండా, నాటకకర్త ఒపేరా రచయితలపైన వుండే గౌరవం అడుగడుగునా కనిపించేలా ప్రదర్శన సాంగోపాంగంగా, తుచ తప్పకుండా సాగింది. దాన్ని చూడడం కంటే ముఖ్యమైన పని మరేమీ లేదన్న స్పృహతో ప్రేక్షకులంతా చేస్తున్నారు.

3 గంటలా 15 నిమిషాలపాటు సాగే ప్రదర్శనలో రెండు విశ్రాంతి సమయాలున్నాయి. మొదటిది యిరవై నిమిషాలు. రెండవది పదిహేను నిమిషాలు. విశ్రాంతి సమయాల్లో దాదాపు అందరూ బయటికెళ్ళారు. మూడు అంతస్థుల వరండాల్లోనూ జిన్, విస్కీ, వైన్ బార్‌లున్నాయి. రకరకాల ఆహార పదార్థాలు, కాఫీలూ, పళ్లరసాలూ, అన్నీ అమ్ముతారు. ఆ తక్కువ వ్యవధిలో తామెంత తినగలరో, తాగగలరో అంతమాత్రమే తీసుకుని, అందరూ తమ ఆకలిదప్పుల్నీ, అవసరాల్నీ తీర్చుకున్నారు. మళ్లీ గంట మోగేసరికల్లా అందరూ తమ చోట్లలోకొచ్చి కూర్చున్నారు.

ఎడిన్‌బర్గ్‌లో ధూమపానం వీధుల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ నిషిద్ధమేమీగాదు. చలిదేశం గావడం చేత అన్నిరకాల సిగరెట్లు, చుట్టలూ, ఇ-సిగరెట్లూ తాగేవాళ్ళు యెక్కువగా కనబడతారు. ఒపేరా కొచ్చిన వాళ్లలో సిగరెట్లు కాల్చుకోవాలనుకున్నవాళ్ళు, బయటికెళ్లి రోడ్డు వారల్లో నిలబడి కాల్చుకోవడం చూశాను. విస్కీ, జిన్‌లను తమ దేశవాళీ ద్రవాలుగా గౌరవించుకునే స్కాట్లాండులో యెక్కడ బడితే అక్కడ బార్లు కనబడతాయి. హోటళ్లలోనూ కావాల్సిన రకపు మద్యం హాయిగా దొరుకుతుంది. అందరూ కావల్సినంత తాగి వెళ్ళిపోతూ వుంటారు. **అందరూ తాగుతారుగానీ తాగుబోతు లెవరూ కనిపించలేదు.** చాలా అభిరుచి వుండే ప్రేక్షకులు మాత్రమే వెళ్ళే ఒపేరా ప్రదర్శన శాలలోని బారుల్లో వాళ్ళు తాగడం గూడా నాగరిక పద్ధతిలోనే కనబడింది.

'బాగా రాత్రయిపోయింది. యిక యీ ఆటలు చాలించి యింటికెళ్లి పడుకుంటాను' అని వొక పాత్రే అనేంత వరకూ షేక్స్ పియర్ తన నాటకాన్ని పొడిగించుకుంటూనే వెళ్ళాడు చివరిలో నాటకం యెప్పటికప్పుడు ముగిసినట్టే అనిపిస్తుంది. కానీ మళ్లీ యింకో గొలుసు తగులుకుంటుంది. ప్రేక్షకులు తొందరపడకుండా వోపికగా చూస్తూనే కూర్చున్నారు.

నాటకం ముగిశాక దర్శకుడు అందరు పాత్రధారులూ(పాత్రలూ) 'గ్రూప్‌ఫోటో'లా గుమికూడే సన్నివేశాన్ని తయారుచేశారు. అంతవరకూ నిశ్శబ్దంగా వున్న ప్రేక్షకులు, పిట్‌లోని సంగీతకారుల వాయిద్యాలతో జతకుదిరేలా చప్పట్లు కొట్టసాగారు. చివరగా సంగీత నిర్దేశకుడు గూడా వాళ్లను కలిశాక ప్రేక్షకులందరూ నిలబడి చప్పట్లు కొట్లారు. యిష్టంలేనట్లుగా యవనిక కిందికి జారింది. ప్రేక్షకులూ అంతే అయిష్టంతో ప్రదర్శనశాల నుంచి బయటి కొచ్చారు.

భారతదేశంలోనూ, తెలుగువాళ్లలోనూ షేక్స్‌పియర్‌తో సరిసమానమైన ప్రతిభవుండే నాటక రచయితలు లేకపోలేదు. గొప్పసంగీత రూపకాల్ని తయారు చేసిన విద్వాంసులకు మనలో కొరత లేదు. పాడగలిగిన నటులూ చాలామందే వున్నారు.

'స్కాటిష్ ఒపేరా' సంస్థకు విరాళాలిచ్చే ధనవంతులున్నారు. ప్రభుత్వసాయం దొరుకుతోంది. ప్రదర్శించడానికి కావల్సిన ఆడిటోరియాలున్నాయి. ధ్వని, దీపాలంకరణలను ఆధునీకరించుకోగల సాంకేతిక నైపుణ్యముంది. టికెట్టుకు యాభై పౌండ్లు సంతోషంగాయిచ్చి హాజరయ్యే ప్రేక్షకులున్నారు.

ప్రాచీన మానవనాగరికతా కేంద్రాల్లో విశిష్టమైనదిగా వెలిగిన భారతదేశంలో, తెలుగునాడుల్లో యిలా యెందుకు జరగడంలేదు? వ్యాపార సినిమా రంగంలో అందరినీ వోడించేలా తయారై, అభిరుచిస్థాయిలో అతి తక్కువ స్థాయిని చేరుకున్న సినిమా వైభవం ముందు గొప్ప రచనలూ, గొప్ప ప్రదర్శనలూ వెలవెలబోవడం తప్పదా?

యెక్కడుంది లోపం? యెక్కడికెళ్తున్నాం మనం?

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

అడుగుజాడలు ఆనవాళ్లు-19

నా జ్యోతి - సిద్ధవటం యాత్ర

ఆయన ఒక నికార్సయిన మనిషి. వేమన తత్వాన్ని ఒంట బట్టించుకొని, ఇంటినిండా వేమన పద్యాల పుస్తకాలతో, వ్యాఖ్యాన గ్రంథాలతో నింపాడు. అంతేకాదు, వేమన బోధల్ని ముమ్మార్తులా ఆచరిస్తున్నవాడు. నిక్కచ్చిగా ఉంటాడు. నిజాయితీగా బతకటంలో కాకలు తీరిన వాడు. కాకాలు పట్టేవాడు కాదు. కాబట్టే, ఏ విశ్వవిద్యాలయ అంకుర దశ నుంచి మొదటి అడుగు వేసే దాకా అన్నీ తానే అయి, అహర్నిశలూ కృషి చేశాడో, ఆ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ కాలేకపోయాడు. ఆయన ఎవరో కాదు, కడపలో యోగివేమన విశ్వవిద్యాలయ స్థాపన ప్రకటన వెలువడినప్పటి నుంచి కొత్త వైస్ ఛాన్సలర్ కొలువుదీరిన దాకా, ప్రత్యేకాధికారిగా కొనసాగిన వాడు. అతడెవరో కాదు, వెంకటేశ్వర యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆచార్య జి. శివారెడ్డి.

శివారెడ్డిగారు నాకు చాన్నాళ్ల నుంచి పరిచయం. నేను, అడపాదడపా, కడప పరిసరాల్లో చారిత్రక పర్యటనలు చేసేప్పుడు తన కారు నివ్వటమే కాక అన్ని రకాల ఆతిథ్యాలను అందించిన, అందిస్తున్న వారు. ఒకరోజు దినపత్రికలో నేను తిరుపతి పరిసరాల్లో జరిపిన పరిశోధనలపై వచ్చిన వార్తను చూచి ఫోన్ చేశారు. మీరు ఎక్కడెక్కడో తిరుగుతున్నారు. కడపకెందుకు రాగూడదూ, ఇక్కడ ఒంటిమిట్ట, దేవునిగడప, నందలూరు, లంజ కనుమగుట్ట, జ్యోతి, సిద్ధవటం ఇలా ఎన్నో ఉన్నాయి. మీరొచ్చారంటే, నేనూ, నాకారూ సిద్ధం అని చెప్పారు. నిజమేననిపించింది. ఒక శనివారం రాత్రి వెంకటాద్రిలో బయలుదేరి, తెల్లవారుఝామున కడప స్టేషన్‌లో దిగేసరికి, 70 ఏళ్లకు పైనున్నా, ఆప్యాయతతో నన్ను పలకరించి ఆహ్వానించిన తీరు నన్ను పులకరింపజేసింది.


చాన్నాళ్ల తరువాత పులగం తిని, ఆ రుచిని మళ్లీ మదిలో పదలపరచుకొని ప్రయాణం ప్రారంభించాను. నాతో ఆయన కూడా. ఉదయాన్నే కడపదాటి తిరుపతి రహదారిపై వెళుతుంటే పచ్చదనాన్ని కప్పుకొన్న కొండలు, వెనుక నుంచి వేగంగా పైకి పొడుసుకొస్తున్న బాలభానుడు వెదజల్లుతున్న సూర్యకిరణాలు, వంపులు తిరుగుతూ సోయగాల్ని ప్రదర్శిస్తున్న రోడ్డు, మేం ప్రయాణిస్తున్నామన్న విషయం జ్ఞాపకమే లేదు. ఇంతలో సార్ ఒంటిమిట్ట రామాలయం చూద్దామా అన్నారు శివారెడ్డిగారు. ఒంటిమిట్టను చూడాలంటే ఒకరోజు సమయం కావాలి, ప్రస్తుతానికి జ్యోతి, సిద్ధవటం చూద్దామన్నాను. కారులో పోతున్నా రాములవారు కొలువు దీరిన ఒంటిమిట్ట దేవాలయ గోపురాలు, శిఖరాలు, ప్రాకారం కనిపిస్తూ, కవ్విస్తున్నాయి. మనసు దిటవు చేసుకొని దేవాలయాలు చూడకుండానే ఒంటిమిట్ట దాటాం. కొంచెం దూరం పోయిన తరువాత, ఎడమవైపు ఒక 32 స్థంభాల మండపం, కొంచెం దూరంలో చెరువు కట్ట పక్కన ఒక శివాలయం, శిథిల శిల్పాలు కలసి కట్టుగా నన్ను కారు దింపాయి. ఆ కట్టడాలు, శిల్పాలు క్రీ.శ.16-17 శతాబ్దాల నాటి విజయనగర వాస్తు శిల్పానికి అద్దం పడుతున్నాయి. మళ్లీ ప్రయాణం మొదలు.


ప్రకృతి పచ్చదనం, వొంపుసొంపుల మధ్య సిద్ధవటం దాటి జ్యోతికి



వెళ్తున్నాం. ఉన్నట్టుండి నా కళ్లు ఒక శిథిల కట్టడంపై పడ్డాయి. కారుదిగి చూస్తే, అదొక అందచందాల స్నానాల దిగుడు బావి. కట్టడ రీత్యా ఇస్లాం వాస్తులో, ఆర్చీలు, గూళ్లు, ఆకర్షణీయంగానే ఉన్నాయి. భూమికి 50 అడుగుల లోతున, 50 అడుగుల చదరంలో చుట్టూ రెండంతస్తుల గదుల వరుస, దానికి ముందునడవ, ప్రతిమూలన మెట్లు, బాల్కనీలు. చక్కటి సున్నపు తాపడం కడప నవాబులు దాదాపు 200 సంవత్సరాల క్రితం నిర్మించింద్రై ఉంటుందనిపించింది. బయటాలోపలా సందులేకుండా పెరిగిన సర్కారు కంప, కట్టడం సౌందర్యాన్ని మింగేసింది. ఒక వారసత్వ కట్టడం ఆలనాపాలనా లేక కునారిల్లుతోంది. వారసత్వ ప్రేమికుల హృదయాల్లో అంతులేని వ్యధను నింపింది. ఏం చేస్తాం, చూచి బాధపడటం తప్ప.

ఒక అరగంట సేపట్లో జ్యోతి చేరుకొన్నాం. ఊరికి చేరేలోపే గోపురాలు, శిఖరాలు చెట్ల సందుల్లోంచి కనిపించటానికి ప్రయత్నిస్తూతన్నాయి. నేరుగా ప్రాకారం దాటి ఒక ఎత్తైన గోపురం దగ్గర ఆగాం. మేము వెళ్లేప్పటికి ఆ గోపురద్వారంలో ఒకట్రాక్టరు పసుపు కొమ్ముల్ని గుమ్మరిస్తుంది. బయటికి వచ్చేప్పుడు ద్వార శాఖకు తగిలి, పెచ్చులూడదీసింది ఆ ట్రాక్టరు. ఇదేమిటని డ్రైవర్‌ను అడిగితే, ముప్పై ఏళ్ల నుంచి పుసుపును ఇక్కడే నిల్వచేస్తున్నామన్నాడు. గోపురం మరోవైపు ఏపుగా పెరిగిన అరటి చెట్లు. 150 అడుగుల ఎత్తున్న గోపురం, నిలువునా చీలింది. ఇటుకలు బయటికొచ్చాయి. సున్నం రాలిపోయింది. సున్నపు బొమ్మలు ఆకారాలు కోల్పోయి వికారంగా ఉన్నాయి. ఒకప్పుడు శిఖరంపైన ధగధగలాడిన కలశాల ఊసేలేదు.





చేయిదాటిన పరిస్థితిని చూచి, జాలిపడటం తప్ప ఏమీ చేయలేకపోయాను. గోపురం బయటికొచ్చి చూస్తే, అక్కడొక చెట్టు కింద ఒక శాసనం బండ. ఒంగిపోయి ఉంది. ప్రతిపంటకూ జొన్న కంకుల్ని ఈ బండమీదే కొడుతుంటామన్నారు. ఒకప్పటి చరిత్రకు మౌనసాక్షిగా ఉన్న ఆ శాసనం, శ్వాస ఆగిపోయింది.

ఆశ్చర్యమేమిటంటే పెన్నానది ఇక్కడ ఒక్కసారిగా కుడివైపుకు తిరగటాన, ఆలయాలు మీద ఇసుక మేటలు వేస్తుంది. అలా మేటల మాటున దాగిన అనేక ఆలయాలను 2006లో బయటకు తీశారు. అసలు సంగతికొస్తే పూర్తిగా ఇసుకలో పూడుకు పోయిన ఆలయాలను 1962లో గ్రామప్రజలు మళ్లీ వెలుగులోకి తెచ్చారు.


ఇక్కడ జ్యోతి సిద్ధేశ్వర, భీమేశ్వర, ఘటికా సిద్ధేశ్వర, అమృతేశ్వర, వేద కోటేశ్వర, మూల స్థానేశ్వర, కన్యేశ్వర, క్షీరేశ్వర, నీలకంఠేశ్వరాలయాలతో పాటు విష్ణు, దుర్గ, గణపతి, కుమారస్వామి ఆలయాలున్నాయి. అనేక శిల్పాలు కూడా ఉన్నాయి.

ఒక్కసారి చరిత్రలోకి తొంగిచూస్తే ఈ ప్రాంతం క్రీ.శ.8-9 శతాబ్దాల్లో రేనాటి చోళ, వైదుంబులపాలనలో ఉండేది. ఆ తరువాత రాష్ట్రకూట, కాకతీయ విజయనగర, మట్లిరాజుల పాలనలోకి వచ్చింది.



రాష్ట్రకూట మూడోకృష్ణుని కాలంలో ఈ ఆలయాలు ప్రాచుర్యంలో ఉన్నట్లు పుష్పగిరి శాసనంలో ఉంది. క్రీ.శ.1247 నాటి జ్యోతి శాసనంలో రాయదేవ మహారాజు సామంతుడైన జంతిరామనాయకుడు జ్యోతినాథునికి గోపురం కట్టించినట్లు తెలిపే శాసనం గోపురం ముందుంది. కాకతీయ రుద్రమదేవి సామంతుడు గండపెండేర జన్నిగ దేవుడు సిద్ధనాథునికి కొంత భూమిని దానం చేసినట్లు క్రీ.శ.1268 నాటి అట్లూరు శాసనం వల్ల తెలుస్తుంది.

ఆలయాలు, శిల్పాలు కలియ తిరిగిన తరువాత, ఒకప్పుడు, శ్రీశైల ద్వారంగా భాసిల్లిన జ్యోతిసిద్ధేశ్వరాలయ సముదాయం వన్నె కోల్పోయి చిన్న బోయింది. శిఖరాలపై శిల్పాలు రాలిపోయాయి. గోడలు కూలిపోయాయి. విగ్రహాలు నెలవులు తప్పాయి. నిరంతరం వెలుగులనీడన అపురూప ఆలయ సముదాయం గబ్బిలాలకు తావైంది.



ప్రధానాలయంలో తప్ప మిగిలిన శిథిలాలయాలు గత వైభవ ప్రాభవాలను తలచుకొంటూ కాలం వెళ్లబుచ్చుతున్నాయి. మమ్మల్ని ఇక వెళ్ళిరండి అంటున్నాయి. ఒక మూలన విసిరేసినట్టున్న ఈ ఆలయ సముదాయాన్ని చూచి, చలించి, తిరుగు ప్రయాణంలో మట్లిరాజులు నిర్మించి, కోటగోడ, లోపల ఆలయాలను చూచి, ఒక్కసారి మూడొందలేళ్ల కాలనాళికలో జొరబడిన అనుభూతితో నేను ఆచార్య జి. శివారెడ్డి మళ్లీ కడపకు చేరుకొన్నాం. ఆలయ శిథిలాలను చూచి ఖిన్నులమైన మేము కొంచెం తేరుకొన్నాం.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

మన్యం వీరుడు ద్వారబంధాల చంద్రయ్యదొర చరిత్ర వెలుగుచూసింది. తపాలాశాఖ ప్రత్యేక కవర్‌ను విడుదల చేసింది








కోటిపల్లి సుబ్బారావుగారి పుస్తకం తెచ్చిన గుర్తింపు ఇది!

* కొయ్యూరు మండలం ముంప గ్రామంలో లంబసింగిలో కట్టే 'మన్యం స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంలో' ద్వారబంధాల చంద్రయ్య దొర విగ్రహాన్ని పెడుతున్నట్లు మ్యూజియం అధికారులు 2022 ఫిబ్రవరిలో ప్రకటించారు.
* ఇప్పుడు భారత ప్రభుత్వ తపాల శాఖ వారు ప్రత్యేక కవర్‌ను ఏప్రిల్ 18న అన్నవరంలో ఒక సభను నిర్వహించి- కాకినాడ యం.పి. వంగా గీత, శాసనసభ్యులు పర్వత పూర్ణచంద్రప్రసాద్, పోస్టుమాస్టర్ జనరల్ వెంకటేశ్వర్లు, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా దీనిని విడుదల చేశారు. దీనితో పత్రికల్లోనూ టీవీ ఛానళ్లలోనూ ఈ విషయం ప్రముఖంగా వచ్చింది.
* నెల్లిపూడిలో చంద్రయ్య దొర నివసించిన చోట ఒక స్మృతివనాన్నీ, విగ్రహాన్నీ నెలకొల్పేందుకు యమ్.ఎల్.ఏ. పూర్ణచంద్రప్రసాద్ ప్రయత్నాలు ప్రారంభించారు.
* అల్లూరి సీతారామరాజు మన్యం వీరుడిగా ప్రఖ్యాతిని పొందిన సంగతి మనకు తెలిసిందే. ఆయనకు 45 ఏళ్లకు ముందే- 1860 సెప్టెంబరు 10న పుట్టిన చంద్రయ్య చరిత్ర కూడా ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. రంప పితూరీ వీరుడిగా ఆయన కీర్తినిపొందుతున్నారు. ఇంకా వెలుగుచూడని ఇటువంటి తెలుగు వీరులను రెండు రాష్ట్రాలలో గుర్తించి, వారికి తగిన ఖ్యాతి లభించేటట్లు చేయడం తెలుగువారి కర్తవ్యం.



తాడిత పీడితజనుల కోసం బ్రిటీషువారితో పోరాడిన **ద్వారబంధాల చంద్రయ్యదొర**

అల్లూరి సీతారామరాజుకంటే 45 సంవత్సరాల ముందు తెలుగుగడ్డపై బ్రిటీషువారినెదిరించి వారిపై పోరాటం చేసి, అసువులు బాసిన అమర యోధుడొకడున్నాడని తెలుసా? అతడే తన తర్వాతి వారందరికీ స్ఫూర్తినిచ్చిన స్వాతంత్ర్యయోధుడు ద్వారబంధాల చంద్రయ్యదొర. స్వాతంత్ర్యం కోసం, తాడిత పీడిత జనులకోసం, గిరిజనుల కోసం తనను తాను అంకితం చేసుకున్న వీరుడితడు. తూర్పుగోదావరి జిల్లా మన్యంలోని బురదకోటను స్థావరంగా చేసుకొని బ్రిటీషువారిపై పోరాటం చేసి, వారికి సింహస్వప్నమైనాడు. ఇతనిని కుట్ర పూరితంగా బందీని చేసి కిర్లంపూడిలో చెట్టుకు వ్రేలాడదీసి కాల్చిచంపారు ఆ పాలకులు. చంద్రయ్య దొర తూర్పుగోదావరి జిల్లా తొలి స్వాతంత్ర్య సమరయోధుడు. ఇతని పోరాటం తదుపరి భారత స్వాతంత్ర్య పోరాటాలకు స్ఫూర్తినిచ్చింది. మరుగునపడిపోయిన ఆ చరిత్రను వెలికితీసి చూపే దీపం ఈ పొత్తం.

వెల: రూ. 99/- ప్రతులకు:

1. తెలుగు బుక్‌హౌస్ 3-3-862, ఆర్యసమాజ్ రోడ్డు కాచీగూడ హైదరాబాద్ - 500027.

2. రచయిత కోటిపల్లి సుబ్బారావు గారిని సంప్రదించండి ఫోన్:9491524786

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
MAY Vol :8, Issue 3

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23



If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244